సంక్షేమ
# మనసర్కార్
Follow: manasarkar

పాఠకులు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు...
ఈద్ ముబారక్
- మనసర్కార్

సంపుటి: 01 ::: సంచిక:228 | Vol-01 ::: Issue-228
హైదరాబాద్ 21 మార్చి 2026, శనివారం | Hyderabad 21 March 2026, Saturday
పేజీలు: 8, వెల: రూ. 5/- | Pages: 8, Rs. 5/-

## రూ. 3,24,234 కోట్లతో తెలంగాణ బడ్జెట్
# అన్నదాతలకే అగ్రపీఠం



రెవెన్యూ వ్యయం ₹2,34,406 కోట్లు



రైతు సంక్షేమం, వ్యవసాయ రంగానికి ₹23,179 కోట్లు

వృద్ధి రేటు ₹10.2శాతం

మూలధన వ్యయం ₹47,267కోట్లు

## ఆరు గ్యారంటీలకు ₹50,713 కోట్ల కేటాయింపు

> రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని ఆవిష్కరిస్తూ ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 3,24,234 కోట్ల భారీ బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టారు. గత ప్రభుత్వాల తరహాలో కాగితపు అంకెలకు పోకుండా, క్షేత్రస్థాయి వనరుల ఆధారంగా 'ఆర్థిక క్రమశిక్షణ'తో ఈ పద్దును రూపొందించినట్లు ఆయన ప్రకటించారు.

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన భారీ బడ్జెట్‌ను శుక్రవారం ప్రవేశపెట్టారు. మొత్తం రూ. 3,24,234 కోట్లతో రూపొందించిన ఈ పద్దులో ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా అంకెలతో ఆర్భాటం చేయకుండా, క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న వనరులు, వాస్తవ అంచనాల ఆధారంగానే ఈ పద్దును సిద్ధం చేసినట్లు ఆయన స్పష్టం చేశారు .బడ్జెట్ అంచనాలలో రెవెన్యూ వ్యయం రూ. 2,34,406 కోట్లుగా ఉండగా, మూలధన వ్యయం కింద రూ. 47,267 కోట్లు కేటాయించారు. ఒకవేళ గత ప్రభుత్వ ధోరణిని అనుసరించి ఉంటే బడ్జెట్ రూ. 3.30 లక్షల కోట్లు దాటేదని, కానీ ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ వాస్తవిక గణాంకాలకే పరిమితమయ్యామని మంత్రి వివరించారు. రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ. 5 లక్షల మేర ప్రయోజనం చేకూర్చే 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకాన్ని జూన్ 2 నుంచి అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'ఆరు గ్యారంటీలకు' బడ్జెట్‌లో రూ. 50,713 కోట్లు కేటాయించడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరంలో వీటికి కేటాయించిన రూ. 56,084 కోట్లతో పోలిస్తే ఈసారి రూ. 5,371 కోట్ల మేర నిధులు తగ్గాయి. రైతు భరోసాకు రూ. 18,000 కోట్లు, చేయూత పెన్షన్లకు రూ. 14,861 కోట్లు కేటాయించారు.

....:::: తరువాయి 2వ పేజీలో...

# ఇది బోగస్ బడ్జెట్...




**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ కేవలం ఒక 'బోగస్ బడ్జెట్' అని, ఇందులో ప్రజలకు దక్కింది గుండు సున్నా మాత్రమేనని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్‌పై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ బడ్జెట్‌తో ప్రభుత్వం ఆరు గ్యారంటీలకు గోరీ కట్టిందని విమర్శించారు.

....:::: తరువాయి 2వ పేజీలో...

# ఆ 11 దేశాలకూ భారత విమానాలు రద్దు



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తత నేపథ్యంలో భారత విమానయాన నియంత్రణ సంస్థ అప్రమత్తమైంది. అంతర్జాతీయ విమాన ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని 11 దేశాల గగనతలం మీదుగా విమాన ప్రయాణాలను తక్షణమే నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ దేశాల మీదుగా వెళ్లడం ప్రాణాపాయంతో కూడుకున్నదని, ఏ క్షణమైనా క్షిపణి దాడులు జరిగే ముప్పు ఉందని ఏవియేషన్ సంస్థలకు కఠిన హెచ్చరికలు జారీ చేసింది. డీజీసీఏ నిషేధించిన జాబితాలో ఇరాన్, ఇరాక్, ఇజ్రాయెల్, లెబనాన్, జోర్డాన్ వంటి ప్రధాన యుద్ధ ప్రభావిత దేశాలతో పాటు , బహ్రెయిన్, కువైట్ , ఒమన్, ఖతార్, యూఏఈ తో పాటు సౌదీ అరేబియా వంటి గల్ఫ్ దేశాలు ఉన్నాయి. క్షిపణి దాడుల నుంచి రక్షణ పొందేందుకు విమానాలు ప్రయాణించే ఎత్తుపై ఆంక్షలు విధించారు. ఒకవేళ అత్యవసర పరిస్థితుల్లో ఈ ప్రాంతాలకు సమీపం నుంచి వెళ్లాల్సి వస్తే, FL320 (32,000 అడుగులు) కంటే తక్కువ ఎత్తులో ప్రయాణించవద్దని స్పష్టం చేసింది. అంతకంటే తక్కువ ఎత్తులో వెళ్లే విమానాలు క్షిపణి దాడుల బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని రక్షణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల ఇరాన్‌లోని వ్యూహాత్మక లక్ష్యాలపై అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన మెరుపు దాడుల తర్వాత, ఇరాన్ ప్రతీకార చర్యలకు దిగవచ్చునని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఈ ఆంక్షల ప్రభావం భారత్ నుంచి ఐరోపా, అమెరికా వెళ్లే ప్రయాణికులపై నేరుగా పడనుంది.



## వార్నింగ్ ఇచ్చాడు...
# హతమయ్యాడు...

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

పశ్చిమాసియా యుద్ధ నేపథ్యంలో ఇరాన్ వరసగా తన అగ్రనాయకత్వాన్ని కోల్పోతూ చావుదెబ్బలు తింటోంది. ఇరాన్ శక్తివంతమైన సైనిక విభాగం 'ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్' (ఐఆర్‌జీసీ ) అధికార ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ అలీ మహమ్మద్ నైనీ హతమయ్యారు. అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో శుక్రవారం తెల్లవారుజామున ఆయన మరణించారు. 1957లో జన్మించిన నైనీ, సైనిక వ్యూహకర్తగానే కాకుండా ఇమామ్ హుస్సేన్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా కూడా పనిచేశారు. టెహ్రాన్‌లోని వ్యూహాత్మక లక్ష్యాలే ధ్యేయంగా జరిగిన ఈ మెరుపు దాడుల్లో నైనీ ప్రాణాలు కోల్పోయినట్లు ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ధృవీకరించింది. దీనిని "అమెరికాజియోనిస్ట్ శక్తులు చేసిన పిరికిపంద చర్య,"గా ఇరాన్ వ్యాఖ్యానించింది. అయితే , మరణించడానికి కొన్ని గంటల ముందే జనరల్ నైనీ పశ్చిమ దేశాలకు హెచ్చరికలను జారీ చేశారు.

....:::: తరువాయి 3వ పేజీలో...

# చరిత్రలోనే కనిష్టస్థాయికి రూపాయి పతనం




**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

భారత స్టాక్ మార్కెట్లు ట్రేడింగ్ ముగిసే సమయానికి చివరి గంటలో యూటర్న్ తీసుకున్నాయి. మరోవైపు ఫారెక్స్ మార్కెట్‌లో భారత రూపాయి విలువ దారుణంగా పడిపోయింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ శుక్రవారం 1.17 శాతం నష్టపోయి 93.75 వద్ద ముగిసింది. ఇది రూపాయి చరిత్రలోనే అత్యంత కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. అంతర్జాతీయంగా ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధ మేఘాలు మళ్లీ కమ్ముకోవడంతో మార్కెట్లు ఇంట్రాడే గరిష్ఠాల నుంచి వెనక్కు తగ్గాయి. ఇన్వెస్టర్లకు వార్ వణుకు పట్టుకుంది.

....:::: తరువాయి 2వ పేజీలో...

# లీటర్ పవర్ పెట్రోల్‌పై రూ. 2 పెంపు..!

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

యుద్ధం మూడో వారానికి చేరుకున్న వేళ, దేశవ్యాప్తంగా ప్రీమియం పెట్రోల్ ధరలను ఆయిల్ కంపెనీలు పెంచేశాయి. సముద్ర మార్గంలో రవాణాకు అంతరాయం కలగడం వల్ల షిప్పులు నిలిచిపోవడంతో సరఫరా వ్యవస్థ దెబ్బతింది. ఈ క్రమంలోనే లీటర్ పవర్ పెట్రోల్‌పై రూ. 2.26 నుంచి రూ. 2.35 వరకు ధర పెరగడంతో, ప్రస్తుతం దీని ధర రూ. 115కి చేరుకుంది. అయితే, సాధారణ పెట్రోల్ ధరలలో ప్రస్తుతానికి ఎలాంటి మార్పు లేదని కంపెనీలు ప్రకటించినప్పటికీ, పెరిగిన ఈ కొత్త రేట్లు శుక్రవారం అర్ధరాత్రి నుంచి అమలులోకి వచ్చాయి. మరోవైపు, పట్టణ శివార్లలో, చిన్న చిన్న టౌన్లలో పెట్రోల్ బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం వద్ద సరిపడా నిల్వలు ఉన్నాయని అధికారులు చెబుతున్నా, క్షేత్ర స్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. యుద్ధం ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో సాధారణ పెట్రోల్, డీజిల్, సిఎన్‌జి ధరలు కూడా పెరిగే సూచన ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



సాధారణ పెట్రోల్ ధరలలో ఎలాంటి మార్పు లేదు



# బ్రిటన్ వీసా ఛార్జీల పెంపు...

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

బ్రిటన్ వీసా ఛార్జీలను భారీగా పెంచింది. ఉన్నత చదువులు, లేదా పర్యాటక సందర్శకులకు బ్రిటన్ ప్రభుత్వం షాకిచ్చింది. జీవన వ్యయాలు పెరిగి ఇబ్బందులు పడుతుంటే, అన్ని కేటగిరీల వీసా ఫీజులను పెంచుతూ బ్రిటన్ హోమ్ ఆఫీస్ ఈ నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు, సందర్శకులు , స్కిల్డ్ వర్కర్ వీసాలతో పాటు సెటిల్మెంట్ , స్పాన్సర్ లైసెన్స్ ఫీజులు వచ్చే నెల 8 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ పెంపు ఆరు నుంచి ఏడు శాతం వరకు ఉండబోతోందని అధికారిక ప్రకటన వెల్లడించింది.

....:::: తరువాయి 2వ పేజీలో...

## ఇక పదో తరగతి
# పరీక్షలు ఉండవు



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ విద్యావ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. కొత్త విద్యా విధానంలో భాగంగా పదో తరగతి బోర్డు పరీక్షలు ఉండవని, పన్నెండో తరగతి వరకు ఒకే పద్ధతిలో బోధన సాగుతుందని శుక్రవారం జరిగిన మీడియా చిట్ చాట్‌లో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. విద్యార్థులపై పరీక్షల ఒత్తిడిని తగ్గించి, నిరంతర మూల్యాంకన లేదా సెమిస్టర్ పద్ధతిని ప్రవేశపెట్టడం ద్వారా వారిలో సృజనాత్మకతను పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. 'వన్ బోర్డ్ ఫర్ ఆల్ క్లాసెస్' విధానం ద్వారా విద్యా బోర్డులన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది.

....:::: తరువాయి 2వ పేజీలో...



# అప్పు చెల్లించాలని అడగడం నేరం కాదు

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

తీసుకున్న అప్పును తిరిగి చెల్లించాలని రుణగ్రహీతను కోరడం లేదా ఒత్తిడి చేయడం 'ఆత్మహత్య ప్రేరేపణ' కిందకు రాదని సుప్రీంకోర్టు శుక్రవారం స్పష్టం చేసింది. బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేయడం రుణదాతకు ఉన్న చట్టబద్ధమైన హక్కని, దీనిని క్రిమినల్ నేరంగా పరిగణించలేమని ధర్మాసనం తేల్చి చెప్పింది. గుజరాత్‌కు చెందిన ధీరూభాయ్ పటేల్ అనే వ్యక్తిపై నమోదైన కేసును కొట్టివేస్తూ జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ చారిత్రాత్మక తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. గుజరాత్‌లోని మోర్బీ జిల్లాలో ఒక వ్యక్తి అప్పుల బాధ తాళలేక ట్రాక్టర్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తన మరణానికి తొమ్మిది మంది రుణదాతల వేధింపులే కారణమని రాసిన సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసులు ధీరూభాయ్‌పై ఐపీసీ సెక్షన్ 306 కింద కేసు నమోదు చేశారు. మృతుడికి ఆరు నెలల కాలంలో నిందితుడు 40 సార్లు ఫోన్ చేశాడని, ఇది తీవ్రమైన వేధింపుల కిందకు వస్తుందని ప్రాసిక్యూషన్ వాదించింది. మొదట గుజరాత్ హైకోర్టును ఆశ్రయించిన నిందితుడికి అక్కడ చేదు అనుభవం ఎదురవ్వడంతో, ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రాసిక్యూషన్ సమర్పించిన ఆధారాలను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.సూసైడ్ నోట్‌లో పేర్లు ఉన్నంత మాత్రాన అది ప్రేరేపణ కాదని, సదరు వ్యక్తి మరణానికి నిందితుడు ప్రత్యక్షంగా ఎలా కారణమయ్యాడో చెప్పే ఆధారాలు లేవని ధర్మాసనం పేర్కొంది. బెదిరింపుల స్వభావం, అవి ఎప్పుడు జరిగాయనే స్పష్టత లేనప్పుడు విచారణ జరపడం అనవసరమని...

....:::: తరువాయి 2వ పేజీలో...



# ఈద్ ముబారక్
## నెలవంక రాకతో రంజాన్ సంబరాలు!

**ఈద్-ఉల్-ఫితర్: ఉపవాస దీక్షల విరమణ** | **భక్తి, దానం, విందుల సమాహారం**

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని దేశాధినేతలతో పాటు తెలుగు రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖులు ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పవిత్ర పర్వదినం సమాజంలో శాంతి, సౌభాగ్యాలను, సోదరభావాన్ని నింపాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులు అందించిన సందేశాలు ఇక్కడ ఉన్నాయి.

**రాష్ట్రపతి ద్రౌపది ముర్ము:** రంజాన్ పండుగ సమాజంలో ప్రేమ, శాంతి , సామరస్యాన్ని పెంపొందించాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు. పవిత్ర ఖురాన్ బోధనల ప్రకారం పేదలకు సేవ చేయడం, దాతృత్వం పాటించడం మానవాళికి గొప్ప మార్గదర్శకమని ఆమె తన సందేశంలో పేర్కొన్నారు. ఈ పండుగ అందరి జీవితాల్లో సంతోషాన్ని నింపాలని కోరుకున్నారు.

**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ:** "రంజాన్ ముబారక్! ఈ పవిత్ర పర్వదినం మన సమాజంలో ఐక్యతను మరింత పటిష్టం చేయాలి. ప్రపంచమంతటా శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని కోరుకుంటున్నాను," అని ప్రధాని పేర్కొన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

**తెలంగాణ గవర్నర్ :** రాష్ట్రంలోని ముస్లింలందరికీ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో కూడిన ప్రార్థనలు మానవాళికి గొప్ప సందేశాన్ని ఇస్తాయని ఆయన కొనియాడారు. ఈ పండుగ సమాజంలో సోదరభావాన్ని మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు.

**ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్:** ఏపీ గవర్నర్ జస్టిస్ (రిటైర్డ్) ఎస్. అబ్దుల్ నజీర్ ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ తెలియజేశారు. రంజాన్ పండుగ త్యాగానికి, కరుణకు ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. పవిత్ర ఖురాన్ బోధనలు ప్రపంచవ్యాప్తంగా సుహృద్భావాన్ని పెంపొందించేలా ఉంటాయని, అల్లాహ్ అనుగ్రహంతో రాష్ట్ర ప్రజలందరికీ మేలు జరగాలని కోరుకున్నారు.

**తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి:** గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ నిదర్శనమని, ముస్లింల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రంజాన్ పండుగ లౌకికవాదానికి ప్రతీక అని, ప్రజలంతా కలిసిమెలిసి సుఖ సంతోషాలతో జీవించేలా అల్లా దీవెనలు ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు:** రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలుపుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో పాటించే క్రమశిక్షణ, ప్రార్థనలు అందరికీ ఆదర్శనీయమని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆయన కోరుకున్నారు.

**ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి:** రంజాన్ పండుగ కరుణకు, దాతృత్వానికి ,సర్వమానవ సమానత్వానికి ప్రతీక అని జగన్ పేర్కొన్నారు. మనిషిలోని ద్వేషాన్ని, చెడును రూపుమాపి.. సమాజంలో సుహృద్భావం పెంపొందించే ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు.

**సినీ ప్రముఖులు:** మెగాస్టార్ చిరంజీవి, సూపర్ స్టార్ మహేష్ బాబు వంటి సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా తమ అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర దినాన అందరికీ ఆయురారోగ్యాలు, శాంతి చేకూరాలని వారు అభిలషించారు.


# ఏపీలో ఐఏఎస్ అధికారుల బదిలీ




**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో ముఖ్యమైన మార్పులు చేసింది. పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో భాగంగా రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ కమిషనర్‌గా ఉన్న కన్నబాబును బదిలీ చేసి, ఆయనకు పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా నూతన బాధ్యతలు అప్పగించింది. కన్నబాబు స్థానంలో సీఆర్‌డీఏ కొత్త కమిషనర్‌గా విజయ రామరాజును నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా విధులు నిర్వహించిన సౌరభ్ గౌర్‌ను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. జిల్లాల స్థాయిలో కూడా కొత్త నియామకాలు జరిగాయి. మార్కాపురం కలెక్టర్‌గా విజయ సునీతను, పోలవరం జిల్లా కలెక్టర్‌గా దినేశ్ కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వీటితో పాటు రవి సుభాష్‌కు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలకు సంబంధించిన పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు.

# అవన్నీ ఉమ్మడి ఆస్తులే...



....:::: పూర్తి కథనం 2వ పేజీలో...

## అన్నదాతలకే అగ్రపీఠం

**మొదటిపేజీ తరువాయి...**

పథకాల అమలులో ప్రాధాన్యతలను బట్టి నిధుల సర్దుబాటు జరిగినట్లు ఆర్థిక శాఖ వర్గాలు వెల్లడించాయి. వ్యవసాయ రంగానికి మొత్తం రూ. 23,179 కోట్లు కేటాయిస్తూ అన్నదాతకు భరోసా కల్పించారు. సాగు విద్యుత్ రాయితీకి రూ. 14,000 కోట్లు, ధాన్యం బోనస్ కోసం రూ. 3,500 కోట్లు కేటాయింపులు జరిగాయి. రైతు భరోసా నిధులతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సాగు రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడమే లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. విద్యా రంగానికి ఈసారి బడ్జెట్‌లో అత్యధిక ప్రాధాన్యత లభించింది. ఏకంగా రూ. 26,674 కోట్లు కేటాయించగా, యంగ్ ఇండియా స్కూళ్ల కోసం రూ. 5,000 కోట్లు వెచ్చించనున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి రూ. 1,000 కోట్లు కేటాయించారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, ఐటీఐ విద్యార్థులకు నెలకు రూ. 2 వేల ఉపకార వేతనం వంటి కీలక ప్రకటనలు బడ్జెట్‌లో చోటు చేసుకున్నాయి. సామాజిక వర్గాల వారీగా చూస్తే బీసీ సంక్షేమానికి రూ. 12,511 కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ. 11,784 కోట్లు కేటాయింపులు జరిపారు. ఎస్టీ సంక్షేమానికి రూ. 7,934 కోట్లు, మైనార్టీ సంక్షేమానికి రూ. 3,769 కోట్లు పద్దులో చేర్చారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద గతంలో నిలిచిపోయిన రూ. 14,934 కోట్ల బకాయిలను సైతం ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులకు అదనంగా చేరుస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. నిధుల వ్యయంలో పారదర్శకత పాటిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. మరోవైపు బీసీ సంక్షేమ కేటాయింపులపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. బీసీలకు కేటాయించాల్సిన రూ. 20 వేల కోట్ల బడ్జెట్ ఏమైందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నిలదీశారు. ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని, తులం బంగారం వంటి హామీలను అమలు చేయకుండా ప్రజల చెవిలో పువ్వులు పెట్టిందని ఆయన ఆరోపించారు. బడ్జెట్ లోతైన విశ్లేషణ చేస్తే బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని ఆయన ధ్వజమెత్తారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో భాగంగా లోయర్ ట్యాంక్ బండ్ వద్ద 'డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాలెడ్జ్ టవర్' నిర్మించనున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. ఇందుకోసం, రాష్ట్రవ్యాప్తంగా వివిధ కమ్యూనిటీ హాళ్లు, విగ్రహాల ఏర్పాటుకు రూ. 368 కోట్లు కేటాయించారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ. 1,500 కోట్లు, మెట్రో రైలు రెండో దశ విస్తరణకు రూ. 600 కోట్లు కేటాయింపులు జరిగాయి. నింబోలి అడ్డలో బాబూ జగ్జీవన్ రామ్ పేరిట నూతన వసతి గృహాన్ని ఏర్పాటు చేయనున్నారు.మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి రూ. 4,305 కోట్లు, గ్యాస్ సబ్సిడీకి రూ. 723 కోట్లు కేటాయించారు. ఉచిత విద్యుత్ అందించే గృహజ్యోతి పథకానికి రూ. 2,080 కోట్లు, ఆరోగ్యశ్రీ సేవలకు రూ. 1,143 కోట్లు కేటాయింపులు జరిగాయి. మహిళా, శిశు సంక్షేమ శాఖకు రూ. 3,143 కోట్లు వెచ్చించనున్నారు. పేదల గృహనిర్మాణం కోసం 'ఇందిరమ్మ ఇళ్ల' పథకానికి రూ. 5,500 కోట్లు కేటాయించారు.వైద్య ఆరోగ్య శాఖకు రూ. 13,679 కోట్లు కేటాయిస్తూ ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిచ్చారు. పౌరసరఫరాల శాఖకు రూ. 7,366 కోట్లు, కార్మిక శాఖకు రూ. 998 కోట్లు కేటాయింపులు జరిగాయి. పశుసంవర్ధక శాఖకు రూ. 1,529 కోట్లు, పర్యాటక రంగానికి రూ. 1,224 కోట్లు వెచ్చించనున్నారు. విద్యా, వైద్య రంగాలు సమాంతరంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వం నిధుల పంపిణీ చేపట్టింది. ప్రభుత్వ ఉద్యోగులకు రూ. 1 కోటి వరకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ ఈ సదుపాయం వర్తిస్తుందని తెలిపారు. పన్నుల భారం పెంచకుండానే వనరుల సమీకరణ ద్వారా బడ్జెట్ లక్ష్యాలను చేరుకుంటామని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేసింది. ఆర్థిక ఒడిదుడుకులు ఎదురైనా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధుల కొరత రాకుండా సమతుల్యత పాటించినట్లు వివరించారు.

## ఇది బోగస్ బడ్జెట్...

**మొదటిపేజీ తరువాయి...**

ఇందిరమ్మ, రాజీవ్ గాంధీ పేర్లతో పథకాలను ప్రచారం చేసుకుంటున్నారే తప్ప, వాటి అమలుకు అవసరమైన నిధుల కేటాయింపులు మాత్రం శూన్యమని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనపై తాము శ్వేతపత్రం డిమాండ్ చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని హరీశ్ రావు ఆరోపించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్ల లోపే రూ. 3 లక్షల కోట్ల అప్పులు చేసిందని, ఇది కాంగ్రెస్ పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో తలసరి ఆదాయ వృద్ధి 12.1 శాతంగా ఉంటే, ప్రస్తుత పాలనలో అది 10.2 శాతానికి పడిపోయిందని గణాంకాలను ఉటంకించారు. ప్రభుత్వానికి టెండర్ల మీద ఉన్న ప్రేమ పేదల మీద లేదని, కాంగ్రెస్ పాలనలో స్కీముల కంటే స్కాములే ఎక్కువగా కనిపిస్తున్నాయని ఆయన ధ్వజమెత్తారు. తుగ్లక్ పాలన వల్ల రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని హరీశ్ రావు విమర్శించారు. హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేస్తూ ప్రభుత్వం 'మూడు ముక్కలాట' ఆడుతోందని, ఇది 'క్యూర్ మోడల్' కాదు 'చోరీ మోడల్' అని ఎద్దేవా చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలను వెనుక కూర్చోబెట్టుకుని రాజ్యాంగ విలువల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని పేర్కొన్నారు. పేదల ఇళ్లను కూల్చడం మీద ఉన్న శ్రద్ధ, కొత్త నిర్మాణాల మీద లేదని, ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మినందుకు రాష్ట్రం వెనుకబడిపోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## వార్నింగ్ ఇచ్చాడు... హతమయ్యాడు...

**మొదటిపేజీ తరువాయి...**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను సవాలు చేస్తూ "ధైర్యముంటే యూఎస్ యుద్ధ నౌకలను పర్షియన్ గల్ఫ్‌లోకి పంపాలి", అంటూ నైనీ గర్జించారు. ఇరాన్ క్షిపణి ఉత్పత్తి సామర్థ్యం ఏమాత్రం తగ్గలేదని, తమ రక్షణ పరిశ్రమకు 100కు 100 మార్కులు వేయవచ్చని ధీమా వ్యక్తం చేశారు. కొద్దిసేపటికే ఆయన వైమానిక దాడికి గురికావడం అంతర్జాతీయంగా సంచలనం రేకెత్తించింది. ఈ దాడుల ద్వారా ఇరాన్ ప్రచార యంత్రాంగాన్ని అమెరికా ,ఇజ్రాయెల్ దళాలు నేరుగా లక్ష్యం చేసుకున్నట్లు స్పష్టమవుతోంది. గత నెల 28న అయాతుల్లా అలీ ఖమేనీ మరణించినప్పటి నుంచి ఇరాన్ నాయకత్వం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ ఒక్క వారంలోనే సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజానీ, బాసిజ్ కమాండర్ ఘోలామ్రెజా సులేమానీ, ఇంటెలిజెన్స్ మంత్రి ఎస్మాయిల్ ఖతీబ్ వంటి అగ్రనేతలను ఇరాన్ వరస మరణాలను చవిచూసింది. తాజాగా నైనీ మరణం ఇరాన్ సైనిక స్థైర్యాన్ని దెబ్బతీసింది.



## చరిత్రలోనే కనిష్టస్థాయికి రూపాయి పతనం

**మొదటిపేజీ తరువాయి...**

మధ్యప్రాచ్యంలో దాడులు జరిగినట్లు వచ్చిన వార్తలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు అకస్మాత్తుగా పెరిగాయి. చమురు దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే భారత్ వంటి దేశాలకు ఇది ప్రతికూల అంశం కావడంతో, ఇన్వెస్టర్లు అప్రమత్తమై లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. ట్రేడింగ్ ముగిసే సమయానికి కీలక సూచీలు స్వల్ప లాభాలను నిలబెట్టుకున్నాయి. సెన్సెక్స్ 325.72 పాయింట్లు లాభపడి 74,533 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 112.35 పాయింట్లు పెరిగి 23,114 వద్ద ముగిసింది. ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్ రంగాలు రాణించాయి. నిఫ్టీ రియల్టీ సూచీ సుమారు 1 శాతం క్షీణించింది. ముడి చమురు ధరలు పెరగడం వల్ల మన దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలపై ప్రభావం పడే అవకాశం ఉంది. టాటా స్టీల్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, ట్రెంట్, రిలయన్స్ స్టాక్స్ లాభపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బీఈఎల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండిగో స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో క్రూడ్ బ్యారెల్ ధర 110 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ 4665 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



## అధికారంలోకి వస్తే ఐదు రాజధానులు

**ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్):**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోరులో నామ్ తమిళర్ కట్చి అధినేత సీమాన్ సరికొత్త రాజకీయ ప్రకంపనలు సృష్టించారు. చెన్నైలోని గిండీలో విడుదల చేసిన తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఐదు రాజధానుల ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. కేవలం ఒకే నగరంపై ఆధారపడకుండా, రాష్ట్రం మొత్తం సమానంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ఈ వినూత్న హామీ ఇచ్చామన్నారు. పాలనా సౌలభ్యం కోసం తిరుచ్చిని పరిపాలనా రాజధానిగా, పారిశ్రామిక హబ్ అయిన కోయంబత్తూరును వాణిజ్య రాజధానిగా మారుస్తామని సీమాన్ ప్రకటించారు. అలాగే, దక్షిణ కొనన ఉన్న కన్యాకుమారిని ఆధ్యాత్మిక, తత్వశాస్త్ర రాజధానిగా తీర్చిదిద్దుతామని, మిగిలిన రెండు ప్రధాన నగరాలను కూడా ప్రత్యేక హంగులతో అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

**కుల ఆధారిత రిజర్వేషన్లు రద్దు**

సామాజిక సంస్కరణల విషయంలోనూ సీమాన్ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఉన్న కుల ఆధారిత రిజర్వేషన్లను పూర్తిగా రద్దు చేస్తామని, వాటి స్థానంలో 'తమిళ పౌరసత్వ రిజర్వేషన్' అనే సరికొత్త విధానాన్ని ప్రవేశపెడతామని హామీ ఇచ్చారు. ఇది రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది. రాష్ట్ర స్వయంప్రతిపత్తిపై గళమెత్తిన సీమాన్, కేంద్రం పరిధిలో ఉన్న రైల్వే వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలోకి తెచ్చేలా చట్టాలు చేస్తామన్నారు. నీటి వ్యాపారాన్ని రద్దు చేసి ప్రతి ఇంటికీ ఉచిత తాగునీరు అందిస్తామని, ప్రకృతి వైద్యం కోసం ప్రత్యేకంగా సిద్ధ వైద్య మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రం నుండి మద్యం, పొగాకు, గంజాయి వంటి మాదకద్రవ్యాలను పూర్తిగా తొలగించి 'వ్యసన రహిత తమిళనాడు'గా మారుస్తామని ఆయన మేనిఫెస్టోలో స్పష్టం చేశారు. మహిళా సాధికారత కోసం పార్లమెంటులో ప్రత్యేక నియోజకవర్గాల సాధన కోసం తమ పార్టీ పోరాడుతుందన్నారు. ఏప్రిల్ 23న జరగనున్న ఈ ఎన్నికల్లో డీఎంకే, అన్నాడీఎంకే వంటి భారీ కూటములతో తలపడుతున్నప్పటికీ, సీమాన్ మాత్రం తన నామ్ తమిళర్ కట్చి తరపున 234 స్థానాల్లో ఒంటరిగానే బరిలోకి దిగుతున్నారు. అగ్ర పార్టీలకు దీటుగా తనదైన శైలిలో రికార్డులు బద్దలు కొట్టే మేనిఫెస్టోతో ప్రజల ముందుకు వెళ్తున్నారు.

## దీదీ ఎన్నికల మేనిఫెస్టో ఇదే...

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

అసెంబ్లీ ఎన్నికల వేళ.. పశ్చిమ బెంగాల్ లో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. అధికారాన్ని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శుక్రవారం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చేలా 10 కీలక హామీల'ను ఆమె ప్రకటించారు. రాబోయే ఐదేళ్లలో బెంగాల్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తామని మమత ఓటర్లకు భరోసా ఇచ్చారు




**మహిళలు, నిరుద్యోగులకు ఆర్థిక చేయూత**

మహిళా ఓటర్లను ఆకట్టుకునేలా భారీ నగదు బదిలీ పథకాలను దీదీ ప్రకటించారు. కొత్తగా అధికారంలోకి వస్తే జనరల్ కేటగిరీ మహిళలకు నెలకు రూ.1500, ఎస్సీ,ఎస్టీ మహిళలకు రూ.1700 చొప్పున నేరుగా ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, నిరుద్యోగ యువతకు ప్రతి నెలా రూ.1500 భృతిని అందిస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు.

**పాలనా సంస్కరణలు విద్య, వైద్యం:**

పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్రంలో కొత్తగా 7 జిల్లాలు, మరికొన్ని మున్సిపాలిటీలను ఏర్పాటు చేస్తామని మమత ప్రకటించారు. ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ ఇంటి వద్దే వైద్య సేవలందించేలా శిబిరాలు, పాఠశాలల్లో ఈలెర్నింగ్ సదుపాయాలు కల్పిస్తామన్నారు. వృద్ధులందరికీ నిరంతరాయంగా పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**రైతు సంక్షేమం - మౌలిక సదుపాయాలు**

అన్నదాతల కోసం ఏకంగా రూ.30 వేల కోట్లతో ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెడతామని మమతా బెనర్జీ హామీ ఇచ్చారు. ప్రతి కుటుంబానికి శాశ్వత ప్రాతిపదికన ఇల్లు, శుద్ధి చేసిన తాగునీరు అందించడంతో పాటు, బెంగాల్‌ను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా మార్చేందుకు ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్, ఓడరేవులు, గ్లోబల్ ట్రేడ్ సెంటర్లను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

**కేంద్రంపై ధ్వజం.. ఐక్య పోరాటం**

మేనిఫెస్టో విడుదల అనంతరం మమత మాట్లాడుతూ.. కేంద్రంలోని భాజపా సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. ఎన్ఆర్సీ, జనగణన పేరుతో పౌరసత్వాన్ని తొలగించేందుకు కేంద్రం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో 'అనధికార రాష్ట్రపతి పాలన' నడుస్తోందని, బెంగాల్ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. అన్ని మతాలు తనకు సమానమేనని, విభజన రాజకీయాలకు తావు లేదని ఈ సందర్భంగా మమత పునరుద్ఘాటించారు.



## బోరు బావిలో 'గ్యాస్'

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

కేరళలోని అలప్పురకు చెందిన రెత్నమ్మకు బోరుబావిలో ప్రకృతి ఓ అద్భుతాన్ని సృష్టించింది. ఇంటి ఆవరణలో పదేళ్ల క్రితం నీటి కోసం తవ్విన బోరు బావి కాస్తా, ఆమెకు గ్యాస్ బావిగా మారి ఏడాదికి రూ. 10 వేల వరకు ఆదా చేస్తోంది. పెరుగుతున్న సిలిండర్ ధరలతో సామాన్యులు ఇబ్బంది పడుతుంటే, ఆమె మాత్రం పైసా ఖర్చు లేకుండా దర్జాగా వంట చేసుకుంటోంది.

**బోరులో నీరు రాలేదని బాధపడినా...**

2011లో రెత్నమ్మ తన ఇంటి అవసరాల కోసం బోరు బావి తవ్వించారు. అయితే నీరు పడకపోవడంతో ఆమె నిరాశ చెందారు. ఆ బోరును మూసివేసే క్రమంలో ఒక వ్యక్తి సరదాగా అగ్గిపుల్ల వెలిగించగా ఒక్కసారిగా మంటలు వచ్చాయి. ఆ పైపు నుంచి వస్తోంది గ్యాస్ అని గుర్తించిన ఆమె, వెంటనే ఒక ప్లాస్టిక్ పైపు ద్వారా తన వంటింటికి కనెక్షన్ ఇచ్చుకున్నారు. అలా పదేళ్లుగా ఆమెకు సిలిండర్ అవసరమే రాలేదు.

**అసలేమిటి ఈ వింత గ్యాస్?**

ఈ వింతను చూసి ఆశ్చర్యపోయిన జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు అక్కడికి చేరుకుని పరిశోధనలు చేశారు. ఆ బోరు నుంచి వస్తోంది సాధారణ ఎల్‌పీజీ (LPG) కాదని, అది స్వచ్ఛమైన మీథేన్ అని వారు తేల్చారు. తీర ప్రాంతాల్లో భూగర్భంలో దశాబ్దాల క్రితం కూరుకుపోయిన వృక్షసంపద, సేంద్రీయ పదార్థాలు కుళ్ళిపోవడం వల్ల సహజంగానే ఈ వాయువు ఉత్పన్నమవుతుందని వారు వివరించారు. శాస్త్రీయ పరిభాషలో దీనిని 'మార్ష్ గ్యాస్' అని పిలుస్తారు. భూమి లోపల పరిమిత స్థాయిలో ఉన్న ఈ గ్యాస్ నిల్వలు పెద్ద ఎత్తున వాణిజ్య పరంగా ఉత్పత్తి చేయడానికి సరిపోవని, కేవలం ఒకటి రెండు ఇళ్లకు మాత్రమే సరిపోతాయని అధికారులు స్పష్టం చేశారు. ఏది ఏమైనా, దేశవ్యాప్తంగా ఇంధన ధరల సంక్షోభం నెలకొన్న తరుణంలో ప్రకృతి ప్రసాదించిన ఈ వరం రెత్నమ్మ కుటుంబానికి పెద్ద ఊరటనిస్తోంది.


## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

తమిళనాడు రాష్ట్రం సేలం సమీపంలోని ఉత్తమశోలపురం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంతో దూసుకొచ్చిన ప్రభుత్వ బస్సు, మినీ వ్యాన్‌ను బలంగా ఢీకొనడంతో 11 నెలల చిన్నారి సహా ఒకే కుటుంబానికి చెందిన మొత్తం ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వాహనాలు నుజ్జునుజ్జు కావడంతో ఆ ప్రాంతమంతా రక్తసిక్తమైంది. ఈ ఘటన మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ప్రభుత్వ బస్సు నియంత్రణ కోల్పోయి ఎదురుగా వస్తున్న మినీ వ్యాన్‌ను నేరుగా ఢీకొట్టింది. అదే సమయంలో వ్యాన్ వెనుక వస్తున్న ఒక ద్విచక్ర వాహనం కూడా ఈ ప్రమాదంలో చిక్కుకుంది. రెప్పపాటులో జరిగిన ఈ వరుస ప్రమాదాలతో వాహనాల్లో ఉన్న వారు బయటకు రావడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. మినీ వ్యాన్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురితో పాటు, బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు మరణించారు. మృతుల్లో కేవలం 11 నెలల వయసున్న పసిపాప ఉండటం అందరినీ కలచివేసింది. ప్రమాదంలో మరో ఆరుగురు తీవ్రంగా గాయపడగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. వాహనాల్లో ఇరుక్కుపోయిన వారిని అతికష్టం మీద బయటకు తీసి, అంబులెన్స్‌ల ద్వారా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం క్షతగాత్రులకు అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సేలం ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ బస్సు డ్రైవర్ అతివేగమే ఈ ఘోర ప్రమాదానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. మితిమీరిన వేగం కారణంగా బస్సుపై నియంత్రణ కోల్పోవడంతో ఈ విషాదం సంభవించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అవన్నీ ఉమ్మడి ఆస్తులే...



మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి మరణించే నాటి వరకు ఉన్న ఆస్తులన్నీ ఉమ్మడి కుటుంబ ఆస్తులేనని , వాటిపై వారసులందరికీ సమాన హక్కు ఉంటుందని ఆయన సతీమణి వైఎస్ విజయమ్మ స్పష్టం శుక్రవారం చేశారు. ఈ మేరకు ఆమె మీడియాకు ఒక అడ్వకేట్ నోటరీని విడుదల చేశారు . ఆస్తుల పంపకం ఇప్పటివరకు అధికారికంగా జరగలేదని ప్రకటన చేశారు. ఆస్తులన్నింటినీ నలుగురు మనవలు, మనవరాళ్లకు సమానంగా పంచాలన్నదే వైఎస్సార్ ఆకాంక్షని , ఈ వాస్తవం కుటుంబ సభ్యులకు, సన్నిహితులకు తెలిసిన వైఎస్సార్ ఆదేశమని ఆమె వివరించారు. షర్మిల పేరు మీద ఎంఓయూ లో రాసిన ఆస్తులన్నీ న్యాయంగా ఆమెకు చెందాల్సినవేనని, అందుకే జగన్ ఆ ఒప్పందం రాశారని విజయమ్మ పేర్కొన్నారు. నిజానికి షర్మిలకు రావాల్సిన వాటా కంటే తక్కువే రాశారని, సరస్వతి సిమెంట్స్ తో పాటు ఎంఓయూలో లేని యెలహంక భూమి కూడా షర్మిలదేనని ఆమె స్పష్టం చేశారు. జగన్ తన సోదరికి ఇచ్చానని చెబుతున్న డబ్బు షర్మిల వాటాకు రావాల్సిన డివిడెండ్ మాత్రమేనని, ఆస్తుల విషయంలో తన మేనల్లుడు, మేనకోడలికి జగన్ అన్యాయం చేశాడని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిగా జగన్ ఎప్పటికైనా వారికి న్యాయం చేస్తాడని ఆశిస్తున్నట్లు ఆమె తన లేఖలో తెలిపారు. ఆస్తుల వ్యవహారంలో జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని, గోబెల్స్ ప్రచారం మానుకోవాలని విజయమ్మ కోరారు. నిజం ఏమిటో దేవుడికి, తన కుమారుడికి కూడా తెలుసని, దేవుని సాక్షిగా తాను చెబుతున్నవన్నీ వాస్తవాలని ఆమె పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కుటుంబ అంతర్గత విషయాలను మీడియాలో మళ్లీ మళ్లీ ప్రస్తావించవద్దని, అసత్యాలతో వేధించవద్దని వైఎస్సార్ భార్యగా చేతులు జోడించి వేడుకుంటున్నానని ఆమె భావోద్వేగంగా విజ్ఞప్తి చేశారు.

## బ్రిటన్ వీసా ఛార్జీల పెంపు...

**మొదటిపేజీ తరువాయి...**

**కొత్త విధానం ప్రకారం వివిధ కేటగిరీల్లో పెరిగిన ఛార్జీల వివరాలు :**

- **స్కిల్డ్ వర్కర్ వీసా:** మూడేళ్ల కాలపరిమితి గల వర్క్ వీసా ఫీజు 769 పౌండ్ల నుంచి 819 పౌండ్లకు (సుమారు రూ. 1,02,470) పెరిగింది. మూడేళ్లకు పైబడిన దరఖాస్తుల రుసుము ఏకంగా 1,618 పౌండ్లకు ( రూ. 2,02,437 ) చేరింది.
- **విద్యార్థి వీసాలు :** బ్రిటన్ వెళ్లే భారతీయ విద్యార్థులపై ఈ ప్రభావం అధికంగా ఉండనుంది. ప్రస్తుతం ఉన్న 524 పౌండ్ల ఫీజు 558 పౌండ్లకు (రూ. 69,814) పెరగనుంది.
- **విజిటర్ వీసా:** ఆరు నెలల విజిటర్ వీసా ఛార్జీ 127 పౌండ్ల నుంచి 135 పౌండ్లకు (రూ. 16,890 ) పెరిగింది.

బ్రిటన్ తన దేశీయ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు , ఇమ్మిగ్రేషన్ వ్యవస్థ నిర్వహణ వ్యయాలను భర్తీ చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వీసా ఫీజులే కాకుండా, స్పాన్సర్ లైసెన్స్ ఈటీఏ ఛార్జీలను కూడా సవరించారు. ఇప్పటికే అమెరికా హెచ్ 1 బి వీసా ఫీజుల పెంపుతో సతమతమవుతున్న భారతీయ నిపుణులు , విద్యార్థులకు బ్రిటన్ అదనపు భారంగా మారింది. వచ్చే నెల 8 లోపు దరఖాస్తు చేసుకునే వారికి పాత ధరలే వర్తిస్తాయి కాబట్టి, ప్రయాణ ప్రణాళిక ఉన్నవారు త్వరపడటం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

## ఇక పదో తరగతి పరీక్షలు ఉండవు

**మొదటిపేజీ తరువాయి...**

ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి దీటుగా మార్చేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' ఏర్పాటు చేయనున్నట్లు సీఎం వెల్లడించారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ ఒకే చోట నాణ్యమైన విద్య, వసతి కల్పించడమే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా, చదువు పూర్తికాగానే ఉద్యోగ అవకాశాలు లభించేలా 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' ద్వారా నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. ఇందుకోసం టాటా వంటి దిగ్గజ సంస్థల భాగస్వామ్యంతో ఐటీఐలను కూడా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ఆయన వివరించారు. విద్యార్థుల ఆరోగ్యం, పౌష్టికాహారం విషయంలో రాజీ పడబోమని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని సీఎం ప్రకటించారు. పాఠశాలల నిర్వహణ బాధ్యతలను 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల' ద్వారా మహిళా సంఘాలకు అప్పగించి, స్థానిక పర్యవేక్షణను మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. పరీక్షల రద్దు , కొత్త విద్యా విధానం అమలుకు సంబంధించిన విధివిధానాలపై ప్రభుత్వం త్వరలోనే పూర్తిస్థాయి స్పష్టత ఇవ్వనుంది.

## అప్పు చెల్లించాలని అడగడం నేరం కాదు

**మొదటిపేజీ తరువాయి...**

కోర్టు అభిప్రాయపడింది. కేవలం ఎక్కువ సార్లు ఫోన్ చేసినంత మాత్రాన దానిని నేరంగా చూడలేమని, అది అప్పు వసూలు చేసుకునే క్రమంలో చేసే ప్రయత్నమేనని వ్యాఖ్యానించింది. మృతుడిపై శారీరక దాడి జరిగినట్లు గానీ, బలవంతం చేసినట్లు గానీ ఎలాంటి ఆధారాలు లభించలేదని కోర్టు గమనించింది. ఇటువంటి పరిస్థితుల్లో నిందితుడిపై క్రిమినల్ చర్యలు కొనసాగించడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుందని సుప్రీంకోర్టు హెచ్చరించింది. బాధితుడి ఆవేదన అర్థం చేసుకోదగ్గదే అయినప్పటికీ, చట్టపరమైన నిబంధనల ప్రకారం రుణదాత తన డబ్బు కోసం అడగడం నేరం కాదని నిందితుడిపై ఉన్న ఎఫ్ఐఆర్‌ను రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది.

## యుద్ధం ముదిరితే... ఇంధన కష్టాలు తప్పవు

**పెట్రోల్, డీజిల్ నిల్వలపై సీఎం సమీక్ష**



**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం ప్రపంచ సరఫరా గొలుసుపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఎరువుల కొరత ఏర్పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఆయన దిశానిర్దేశం చేశారు. సంక్షోభం ముదరకముందే అప్రమత్తంగా వ్యవహరించాలని, అవసరమైన ఇంధన నిల్వల కోసం కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచించారు. భవిష్యత్తులో ఇంధన సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కార మార్గాలపై దృష్టి సారించాలన్నారు. ఇండక్షన్ స్టవ్‌లు, పైపుల ద్వారా గ్యాస్ సరఫరా , ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడం ద్వారా ఇంధన భద్రతను పటిష్టం చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాలతో పాటు విద్యా సంస్థలు, ఆలయాలకు ఎల్పీజీ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. అంతర్జాతీయ పరిణామాల వల్ల సామాన్యుడిపై భారం పడకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఇదే సమావేశంలో రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టంపై సీఎం వరుసగా రెండో రోజూ సమీక్ష నిర్వహించారు. భారీ గాలులు, వడగళ్ల వానల కారణంగా 12 జిల్లాల్లో సుమారు రూ. 62 కోట్లకు పైగా పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు నివేదించారు. దాదాపు 6,684 హెక్టార్లలో మొక్కజొన్న, వరి వంటి ఆహార పంటలు, మరో 1,301 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశారు. నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని, తక్షణమే క్షేత్రస్థాయిలో అంచనాలు పూర్తి చేసి నివేదికలు పంపాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.



## మొజ్తాబా ఖమేనీ ఉన్నారోచ్

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):


ఇరాన్ కొత్త సుప్రీం అయతొల్లా మొజ్తాబా ఖమేనీ ఆచూకీపై నెలకొన్న సస్పెన్స్ వీడింది. ఈ నేపథ్యంలోనే ఇరాన్ ప్రభుత్వ అధికారిక మీడియా సంస్థ ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ బ్రాడ్కాస్టింగ్ మొజ్తాబా ఖమేనీకి సంబంధించిన ఒక నిమిషం 19 సెకన్ల నిడివి గల వీడియోను 'ఎక్స్' వేదికగా పంచుకుంది. యుద్ధ వాతావరణం మధ్య మొజ్తాబా కూడా తీవ్రంగా గాయపడ్డారని లేదా మరణించారని అంతర్జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల స్పందిస్తూ , మొజ్తాబా ప్రాణాలతో ఉన్నారో లేదో ఎవరూ ఖచ్చితంగా చెప్పలేకపోతున్నారని, ఆయన ఒక కాలు కోల్పోయి గుర్తుపట్టలేనంతగా మారిపోయారని సంచలన వ్యాఖ్యలు చేయడంతో ప్రపంచవ్యాప్తంగా అనుమానాలు రేకెత్తాయి. ఈ వీడియోలో మొజ్తాబా ఖమేనీ కొంతమంది విద్యార్థులకు అరబిక్ భాషలో 'రెలిజియస్ సైన్స్' బోధిస్తున్నట్లు కనిపిస్తోంది. "రెలిజియస్ సైన్స్ బోధిస్తున్న అయతొల్లా మొజ్తాబా ఖమేనీ వీడియోను తొలిసారి పబ్లిష్ చేస్తున్నాం" అంటూ ప్రభుత్వం దీనిని విడుదల చేయడం విశేషం. ఈ వీడియో ఎప్పుడు, ఎక్కడ రికార్డ్ చేశారనే విషయంలో మాత్రం స్పష్టత లేదు. ఇది ప్రస్తుత పరిస్థితుల్లో తీసిందా లేక పాత వీడియోను చారిత్రక రికార్డుల నుంచి తీసి విడుదల చేశారా అనే ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన ఆరోగ్యంపై వస్తున్న పుకార్లను పటాపంచలు చేయడానికి, ఆయన క్షేమంగానే ఉన్నారనే సంకేతాలను ప్రపంచానికి పంపడానికే ఇరాన్ ప్రభుత్వం ఈ వ్యూహాత్మక అడుగు వేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. క్లిష్ట సమయాల్లో నాయకత్వ స్థిరత్వాన్ని చాటుకోవడమే లక్ష్యంగా ఇరాన్ ఈ వీడియోను విడుదల చేసినట్లు కనిపిస్తోంది.

## 'అజేయ' ఎఫ్-35ను ఢీకొట్టిన ఇరాన్

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):



ప్రపంచంలోనే రాడార్లకు చిక్కని 'స్టెల్త్' సాంకేతికత కలిగిన అమెరికా 'ఎఫ్35' యుద్ధ విమానాన్ని తాము కూల్చివేసినట్లు ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ తమ గగనతల రక్షణ వ్యవస్థ ద్వారా ఈ ఘనత సాధించామని చెబుతూ, దానికి సంబంధించిన వీడియో ఆధారాలను కూడా విడుదల చేయడం అంతర్జాతీయ రక్షణ రంగంలో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. అర్ధరాత్రి దాటిన తర్వాత ఇరాన్ సరిహద్దుల్లోకి చొచ్చుకువచ్చిన ఈ విమానాన్ని తమ క్షిపణులు విజయవంతంగా అడ్డుకున్నాయని, అది తీవ్రంగా ధ్వంసమైందని ఇరాన్ పేర్కొంది. ఈ పరిణామంపై అమెరికా సెంట్రల్ కమాండ్ స్పందిస్తూ , ఒక ఫైటర్ జెట్ శత్రు క్షిపణి దాడికి గురైందని, పైలట్ చాకచక్యంగా దానిని అత్యవసరంగా ల్యాండ్ చేశారని కెప్టెన్ టిమ్ హాకిన్స్ ధృవీకరించారు. దాదాపు రూ. 769 కోట్లకు పైగా విలువైన, అజేయమైనదిగా భావించే ఎఫ్35 యుద్ధ విమానం ఇలా మిస్సైల్ దాడికి గురై నేలచూపులు చూడటం ప్రపంచ రక్షణ చరిత్రలో ఇదే మొదటిసారి.ఈ ఘటన రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను యుద్ధ తీవ్రతను మరింత పెంచేలా కనిపిస్తోంది. ఎఫ్35 వంటి అత్యాధునిక యుద్ధ విమానాల భద్రతపై ప్రస్తుతం అమెరికా పునరాలోచనలో పడింది. ఈ పరిణామం వల్ల పర్షియన్ గల్ఫ్‌లో యుద్ధ మేఘాలు కమ్ముకోవడమే కాకుండా, ప్రపంచ ఇంధన మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇరాన్ యొక్క రక్షణ సామర్థ్యంపై అంచనాలు మారుతున్న వేళ, అమెరికా తన తదుపరి వ్యూహాన్ని ఎలా అమలు చేస్తుందోనని ప్రపంచ దేశాలు ఉత్కంఠగా గమనిస్తున్నాయి.




## అంటార్కిటికాలో భారీ భూకంపం

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

అంటార్కిటికా ఖండంలోని సౌత్ షెట్లాండ్ దీవుల్లో భారీ భూకంపం సంభవించింది. అంతర్జాతీయ భూగర్భ శాస్త్రవేత్తలను ఉలిక్కిపడేలా చేసింది. రిక్టర్ స్కేలుపై 6.7 తీవ్రతతో నమోదైంది. ఈ భూప్రకోపంతో ఆ ప్రాంత తీరరేఖ ఒక్కసారిగా అతలాకుతలమైంది. జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ అందించిన వివరాల ప్రకారం, అర్జెంటీనా కాలమానం ప్రకారం తెల్లవారుజామున 5:52 గంటలకు భూమి భారీఎత్తున కంపించింది. ఈ భూకంపం భూ ఉపరితలం నుంచి 10 కిలోమీటర్ల (6.21 మైళ్లు) లోతులోనే సంభవించడం వల్ల దీనిని 'షాలో ఎర్త్ క్వేక్' (అల్ప లోతు భూకంపం) గా వర్గీకరించారు. ఇలాంటి భూకంపాలు ఉపరితలంపై అత్యంత వేగంగా ప్రభావం చూపుతాయి. టెక్టానిక్ ప్లేట్లలో చోటు చేసుకున్న భారీ కదలికలే ఈ విపత్తుకు కారణమని నిపుణులు నిర్ధారించారు. భూకంప తీవ్రత దృష్ట్యా సౌత్ అట్లాంటిక్, గల్ఫ్ , పసిఫిక్ మహాసముద్ర తీర ప్రాంతాలకు సునామీ ముప్పు పొంచి ఉందని హెచ్చరికలు జారీ చేయడంతో ఆందోళన నెలకొంది. ఆ తర్వాత సముద్రపు అలల కదలికలను నిశితంగా పరిశీలించిన శాస్త్రవేత్తలు సునామీ ముప్పు లేదని స్పష్టం చేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సౌత్ షెట్లాండ్ దీవులు అర్జెంటీనాలోని ఉషుయాయి పట్టణానికి 998 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అదృష్టవశాత్తూ, ఈ ప్రాంతంలో మానవ సంచారం చాలా తక్కువగా ఉండటం, ప్రధానంగా శాస్త్రీయ పరిశోధనా కేంద్రాలు భారీ సంఖ్యలో పెంగ్విన్ల నివాసస్థలం కావడంతో ప్రాణనష్టానికి సంబంధించిన ఎటువంటి వార్తలు నమోదు కాలేదు. ఈ స్థాయి భూకంపం వల్ల మంచు పలకలు విడిపోయే ప్రమాదం ఉందేమోనని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూకంపం సంభవించిన తీర ప్రాంతంలో అలలు భారీగా ఎగిసిపడటంతో తీర ప్రాంత స్వరూపం స్వల్పంగా మారింది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఉన్న పరిశోధనా కేంద్రాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, తదుపరి ప్రకంపనలు వచ్చే అవకాశం ఉందని అధికారులు సూచించారు. అంటార్కిటికా వంటి సున్నితమైన ప్రాంతంలో సంభవించిన ఈ సహజ విపత్తు, గ్లోబల్ వార్మింగ్ నేపథ్యంలో హిమానీనదాల స్థిరత్వంపై కూడా చర్చకు దారితీసింది.

# ఇరాన్ క్షిపణి ప్లాంట్ ధ్వంసం...


ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):



ఇరాన్ సైనిక సామర్థ్యంపై అమెరికా సైనిక దళాలు మరోసారి కోలుకోలేని దెబ్బతీశాయి. ఇరాన్‌లోని కరాజ్ నగరంలో ఉన్న క్షిపణి తయారీ కేంద్రాన్ని అగ్రరాజ్యం వైమానిక దళాలు పూర్తిగా ధ్వంసం చేశాయి. ఈ ప్లాంట్ బాలిస్టిక్ మిస్సైల్స్ ను అసెంబుల్ చేయడానికి అత్యంత ప్రధానమైన కేంద్రంగా పనిచేస్తుంది. తాజా దాడితో అది నేలమట్టం కావడంతో పనికిరాకుండా పోయిందని అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారికంగా ప్రకటించింది. అమెరికా తన వాదనకు బలాన్ని చేకూరుస్తూ, దాడికి ముందు , దాడి తర్వాత ఆ ప్లాంట్‌కు సంబంధించిన ఏరియల్ ఫొటోలను విడుదల చేసింది. కరాజ్ ప్లాంట్ ధ్వంసం కావడంతో ఇరాన్ క్షిపణి వ్యవస్థ బలహీనపడే అవకాశం ఉందని, దీనివల్ల గల్ఫ్ ప్రాంతంలో వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడుల ముప్పు తగ్గుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. దీనికి ప్రతిచర్యగా ఇరాన్ కూడా గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలనే కాకుండా సౌదీ అరేబియా, ఖతర్‌లోని గ్యాస్ ఉత్పత్తి కేంద్రాలపై డ్రోన్ దాడులు చేస్తోంది. ఈ పరిణామాల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రపంచ ఇంధన సరఫరా గొలుసు దెబ్బతినకుండా ఉండేందుకు బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్ వంటి అగ్రదేశాలు రంగంలోకి దిగాయి. హర్మూజ్ జలసంధిలో నౌకల ప్రయాణం సురక్షితంగా సాగేలా అంతర్జాతీయ నౌకాదళ కూటమిని బలోపేతం చేస్తామని ఈ దేశాలు ప్రకటించాయి. ఇరాన్ తన ఆధిపత్యం కోసం హర్మూజ్ మార్గంలో సృష్టిస్తున్న ఆటంకాలను ఎదుర్కోవడానికి ఈ కూటమి సన్నద్ధమవుతోంది. ఈ ఉద్రిక్తతలు గల్ఫ్ ప్రాంతంలో భౌగోళిక రాజకీయాలను సంక్లిష్టంగా మారుస్తున్నాయి.

# జెరూసలేంలో 'ఈద్' ప్రార్థనలు బంద్


ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):



పవిత్ర రంజాన్ మాసం ముగింపు వేళ ముస్లిం లోకమంతా ఈద్‌అల్‌ఫితర్ వేడుకల్లో మునిగిపోగా, జెరూసలేంలోని చారిత్రక అల్‌అక్సా మసీదు వద్ద మాత్రం అత్యంత విషాదకర పరిస్థితులు నెలకొన్నాయి. 1967 అరబ్‌ఇజ్రాయెల్ యుద్ధం తర్వాత ఐదు దశాబ్దాల కాలంలో ఈ ఏడాది ఈద్ ప్రార్థనలను ఇజ్రాయెల్ భద్రతా దళాలు పూర్తిస్థాయిలో అడ్డుకున్నాయి. మసీదు ప్రధాన ద్వారాలను మూసివేసి భక్తులను లోపలికి అనుమతించకపోవడంతో, వేలాది మంది పాలస్తీనియన్లు కన్నీటి పర్యంతమయ్యారు. కనీసం మసీదు సమీప పాయింట్ వద్దకైనా చేరుకుని ప్రార్థనలు చేసుకోవాలని ప్రయత్నించిన వారిపై పోలీసులు స్టన్ గ్రెనేడ్లు, టియర్ గ్యాస్ ప్రయోగించడంతో బాబ్ అల్‌సహీరా ప్రాంతం యుద్ధ క్షేత్రాన్ని తలపించింది. గత 21 రోజులుగా ఈ పవిత్ర మసీదు నిరంతరాయంగా మూతపడటం మత స్వేచ్ఛపై జరుగుతున్న దాడి అని జెరూసలేం గవర్నరేట్ ఖండించింది. విధిలేని పరిస్థితుల్లో భక్తులు మసీదు బయట వీధుల్లోనే, డమాస్కస్ గేట్ సమీపాన చాపలు పరుచుకుని అత్యంత భారమైన హృదయాలతో ప్రార్థనలు నిర్వహించారు. నిరంతర దాడులతో చిన్నాభిన్నమైన గాజా స్ట్రిప్ లో పరిస్థితి దయనీయంగా మారింది. ఇజ్రాయెల్ వైమానిక దాడుల ధాటికి గాజాలోని 1,240 మసీదుల్లో సుమారు 1,100కు పైగా మసీదులు నేలమట్టమయ్యాయి. పాలస్తీనియన్ల అచంచల విశ్వాసం చెక్కు చెదరలేదు. పండుగ పూట పిండివంటల ఘుమఘుమలు ఉండాల్సిన చోట గన్‌పౌడర్ వాసన వస్తున్నా, కూలిపోయిన మసీదుల గోడల నీడన, శిథిలాల మధ్యే కుటుంబాలు చేరి ఈద్ ప్రార్థనలు నిర్వహించడం ప్రపంచాన్ని కదిలించింది. ఇస్లాం ధర్మంలో మూడవ అత్యంత పవిత్ర స్థలమైన, మొదటి 'ఖిబ్లా'గా పిలిచే అల్‌అక్సా మసీదుపై ఇటువంటి ఆంక్షలు విధించడం కోట్ల మంది ముస్లింల మనోభావాలను దెబ్బతీస్తోందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 7వ శతాబ్దంలో ఉమయ్యద్ ఖలీఫాల కాలంలో నిర్మించబడిన ఈ మసీదు, శతాబ్దాలుగా అనేక యుద్ధాలను, ఆక్రమణలను చూసింది. చివరకు సలావుద్దీన్ అయ్యూబీ దీనిని తిరిగి ముస్లింల ఆధీనంలోకి తెచ్చారు. ఆంక్షలు ఎన్ని ఉన్నా, యుద్ధం ఎంతటి వినాశనాన్ని మిగిల్చినా తమ దైవ ప్రార్థనను ఆపలేమని నిరూపిస్తూ పాలస్తీనియన్లు సాగించిన ఈ 'ఈద్' ప్రార్థనలు చరిత్రలో నిలిచిపోనున్నాయి.

# హర్మూజ్ చుట్టూ అమెరికా యుద్ధ నౌకలు

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):



ఇరాన్ 'ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్' ఈ జలసంధిని మూసివేస్తామని హెచ్చరించిన నేపథ్యంలో, హర్మూజ్ చుట్టూ అమెరికా తన యుద్ధ నౌకలను భారీగా మోహరించింది. ఈ మార్గం గుండా ప్రయాణించే వాణిజ్య నౌకలు, ఆయిల్ ట్యాంకర్లపై ఇరాన్ దాడులు మితిమీరడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత కఠినమైన నిర్ణయం తీసుకున్నారు. అమెరికా నావికాదళం నేరుగా వాణిజ్య నౌకలకు 'ఎస్కార్ట్' (రక్షణ కవచం) ఇస్తుందని వైట్ హౌస్ ప్రకటించింది. ప్రపంచ ఇంధన సరఫరాకు గుండెకాయ వంటి హర్మూజ్ జలసంధి ప్రస్తుతం యుద్ధ క్షేత్రంగా మారింది. గతంలో ఎర్ర సముద్రంలో హౌతీ తిరుగుబాటుదారులను అడ్డుకోవడానికి ఏర్పాటు చేసిన 'ఆపరేషన్ ప్రోస్పెరిటీ గార్డియన్' తరహాలోనే, హర్మూజ్ కోసం ఒక శక్తివంతమైన మల్టీనేషనల్ టాస్క్ ఫోర్స్ ను అమెరికా సిద్ధం చేస్తోంది. ఈ కూటమిలో బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్ జపాన్ వంటి అగ్రదేశాలు చేరాయి. పెంటగాన్ వర్గాల సమాచారం ప్రకారం, ఇప్పటికే A10 వార్‌ప్లేన్లు, అపాచీ హెలికాప్టర్లను రంగంలోకి దించారు. ఇరాన్ ప్రయోగిస్తున్న ఆత్మాహుతి డ్రోన్లు, స్పీడ్ బోట్లను గాలిలోనే తుత్తునియలు చేయడమే ఈ ఆపరేషన్ లక్ష్యం. ఇటీవలి ఘర్షణల్లో సుమారు 120కి పైగా ఇరాన్ నౌకలను, 44 అటాక్ బోట్లను అమెరికా దళాలు ధ్వంసం చేసినట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. యుద్ధ విమానాలతోనే కాకుండా, అమెరికా ఒక వినూత్నమైన ఆర్థిక వ్యూహాన్ని కూడా అమలు చేస్తోంది. ఇరాన్ తన చమురు సరఫరాను ఆపివేసి ప్రపంచాన్ని 'బ్లాక్ మెయిల్' చేయకుండా ఉండేందుకు, సముద్రంలో నిలిచిపోయిన సుమారు 140 మిలియన్ బారెళ్ల ఇరాన్ ముడిచమురుపై ఉన్న ఆంక్షలను తాత్కాలికంగా తొలగించాలని అమెరికా ట్రెజరీ యోచిస్తోంది. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు అదుపులో ఉండటమే కాకుండా, ఇరాన్ వద్ద ఉన్న చమురు నిల్వల విలువను తగ్గించి ఆ దేశ ఆదాయ వనరులను దెబ్బకొట్టవచ్చని వాషింగ్టన్ భావిస్తోంది. ప్రపంచవ్యాప్త చమురు వాణిజ్యంలో సుమారు 2025 శాతం ఈ జలసంధి ద్వారానే జరుగుతుంది. ఒకవేళ ఇరాన్ ఈ మార్గాన్ని పూర్తిగా అడ్డుకుంటే, ముడిచమురు ధర బ్యారెల్‌కు 120 డాలర్ల పైకి చేరే ప్రమాదం ఉంది. ఇది భారత్ వంటి వర్ధమాన దేశాల ఆర్థిక వ్యవస్థపై పిడుగుపాటే అవుతుంది. అందుకే భారత నౌకాదళం కూడా తన వాణిజ్య నౌకల భద్రత కోసం ఈ ప్రాంతంలో యుద్ధ నౌకలను నిరంతరం నిఘాలో ఉంచుతోంది. హర్మూజ్ జలసంధిలో స్వేచ్ఛాయుత రవాణా అనేది కేవలం అమెరికా సమస్యే కాదని, అది మొత్తం ప్రపంచ ఆర్థిక సుస్థిరతకు సంబంధించిన అంశమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# పాక్ లో 'కోల్డ్ వార్ '.. ఐఎస్ఐకు మునీర్ అల్టిమేటం



ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

పాకిస్తాన్ దేశాన్ని దశాబ్దాలుగా శాసిస్తున్న రెండు అత్యంత శక్తివంతమైన వ్యవస్థలు పాక్ సైన్యం ఒకటి కాగా, గూఢచార సంస్థ ఐఎస్ఐ మరొకటి. పాకిస్తాన్ లో ప్రస్తుతం మునుపెన్నడూ లేని విధంగా తీవ్రస్థాయిలో 'కోల్డ్ వార్' కొనసాగుతుంది. ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ డెడ్ లైన్ విధించడంతో ఐఎస్ఐ అగ్రనేతలల్లో వణుకు పుడుతోంది. దీంతో ఆ దేశ సరిహద్దుల్లో ఎదురవుతున్న వరుస వైఫల్యాలు, దేశవ్యాప్తంగా పెచ్చురిల్లుతున్న ఉగ్రదాడులు పాక్ భద్రతా కోటను బద్ధలు కొడుతుంటే, ఆ నెపం ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ సంస్థల మధ్యే యుద్ధం జరుగుతుంది. ఈ నెల 20 నాటికి అందిన తాజా సమాచారం ప్రకారం, ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ ఐఎస్ఐ పనితీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఏ క్షణమైనా ఆ సంస్థలో భారీ ప్రక్షాళన జరగవచ్చని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ నిఘా విభాగం అధికారులపై నిప్పులు చెరిగినట్లు ఒక అత్యున్నత స్థాయి భద్రతా సమీక్షా సమావేశంలో జరిగినట్లు సమాచారం. "ఖచ్చితమైన గ్రౌండ్ రిపోర్ట్స్ చూపండి.. లేదంటే మీ పదవులను వదులుకోండి" అంటూ ఆయన నేరుగా ఐఎస్ఐ , మిలటరీ ఇంటెలిజెన్స్ అధికారులకు అల్టిమేటం జారీ చేశారు. పశ్చిమ సరిహద్దులో ఆఫ్ఘానిస్థాన్‌తో యుద్ధ వాతావరణం నెలకొన్నా, బలోచిస్తాన్‌లో తిరుగుబాటు సెగలు మళ్లీ చెలరేగుతున్నా, ఐఎస్ఐ ముందస్తు సమాచారం ఇవ్వడంలో ఘోరంగా విఫలమైందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా టిటిపి ఉగ్రవాదులు సైన్యం కదలికలను అడ్డుకోవడానికి ఏకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం పాక్ నిఘా వ్యవస్థ చేతగానితనానికి నిదర్శనమని మునీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిఘా వైఫల్యాల వల్ల పాక్ జవాన్లు భారీగా ప్రాణాలను కోల్పోతుండటంతో మునీర్ తన సహనాన్ని కోల్పోయినట్లు తెలుస్తోంది. ఆఫ్ఘానిస్థాన్ సరిహద్దుల్లో పాకిస్తాన్ నిర్వహిస్తున్న సైనిక చర్యలు కూడా ఘోరమైన ఎదురుదెబ్బలు తింటున్నాయి. అగ్రశ్రేణి ఉగ్రవాద నాయకులను మట్టుబెట్టడంలో విఫలమవడమే కాకుండా, పాక్ జరిపిన దాడులు అమాయక పౌరుల ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. ఈ వారం ప్రారంభంలో కాబూల్‌లోని ఒక డ్రగ్ పునరావాస ఆసుపత్రిపై పాక్ వైమానిక దాడులు జరగడం అంతర్జాతీయంగా కలకలం రేపింది. ఈ దారుణ ఘటనలో సుమారు 400 మంది అమాయక పౌరులు మరణించడం పాకిస్తాన్‌ను ప్రపంచ దేశాల ముందు దోషిగా నిలబెట్టింది. సరైన ఇంటెలిజెన్స్ సమాచారం లేకుండా, కేవలం అనుమానంతో దాడులు జరపడం వల్లే ఇన్ని ప్రాణాలు పోయాయని, ఇది సమస్యను పరిష్కరించడానికి బదులు ఆఫ్ఘన్, పాక్ మధ్య శతృత్వాన్ని మరింత పెంచిందని రక్షణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఒకవైపు సరిహద్దు ఉద్రిక్తతలు, మరోవైపు అంతర్గత తిరుగుబాట్లు, వీటి మధ్య సమన్వయం కోల్పోయిన పాక్ నిఘా యంత్రాంగం తీవ్ర ఒత్తిడిలో కొట్టుమిట్టాడుతోంది. ఆర్మీ చీఫ్ మునీర్ తన పట్టు బిగించాలని చూస్తుంటే, ఐఎస్ఐలోని సీనియర్ అధికారులకు ఆయన హెచ్చరికలు మింగుడుపడటం లేదు. త్వరలోనే పదవుల నుంచి తమను తొలగిస్తారనే భయం వారిలో అసంతృప్తిని పెంచుతోంది. క్షేత్రస్థాయిలో వైఫల్యాలు మునీర్ నాయకత్వానికే పెద్ద సవాలుగా మారాయి. ఆర్థికంగా దివాళా తీసిన దేశంలో, భద్రతా వ్యవస్థలు కూడా అంతర్గత కలహాలతో చితికిపోవడం పాకిస్తాన్‌ను వినాశనం వైపు నడిపిస్తోంది. వ్యవస్థల మధ్య నెలకొన్న ఈ ఘర్షణ రాబోయే రోజుల్లో పాక్ రాజకీయాల్లో మరిన్ని భూకంపాలకు దారితీసే అవకాశం ఉంది.



## లైవ్ లో రిపోర్టర్ పైకి దూసుకొచ్చిన మిస్సైల్

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

పశ్చిమాసియా యుద్ధ క్షేత్రంలో వార్తలు సేకరించడం ప్రాణాలతో చెలగాటంగా మారింది. లెబనాన్‌లోని యుద్ధ ప్రాంతం నుంచి ప్రత్యక్ష ప్రసారం చేస్తున్న ఒక అంతర్జాతీయ మీడియా జర్నలిస్టుపైకి క్షిపణి దూసుకు రావడంతో సంచలనం రేకెత్తిస్తోంది. మృత్యువు కళ్లముందే కన్పించినా, అప్రమత్తతతో ఆయన తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దక్షిణ లెబనాన్‌లోని ధ్వంసమైన ఒక భవనం ముందు నిలబడి రష్యా మీడియాకు చెందిన జర్నలిస్ట్ స్టీవ్ స్వీనీ లైవ్ రిపోర్టింగ్ చేస్తున్నారు. ఆయన కెమెరాతో మాట్లాడుతుండగానే, అకస్మాత్తుగా ఒక క్షిపణి ఆయన ఉన్న ప్రదేశానికి అతి సమీపంలోకి దూసుకొచ్చింది. క్షిపణి రాకను గమనించిన స్వీనీ, సెకన్ల వ్యవధిలో అక్కడి నుండి పరుగులు తీశారు. తర్వాతి క్షణమే ఆ ప్రాంతంలో భారీ పేలుడు సంభవించి మంటలు చెలరేగాయి. ఈ భయానక ఘటనలో స్వీనీతో పాటు కెమెరామెన్ కూడా గాయపడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వారు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. యుద్ధ ప్రాంతాల్లో జర్నలిస్టుల భద్రత ఎంతటి ప్రమాదకరంగా మారిందో ఈ ఘటన మరోసారి నిరూపించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ యుద్ధంలో మీడియా ప్రతినిధులు కూడా లక్ష్యంగా మారుతుండటంపై అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. బాంబుల వర్షం కురుస్తున్నా, నిజాన్ని ప్రపంచానికి చూపడానికి జర్నలిస్టులు పడే తపన, సాహసంపై ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

## వారసురాలికి కిమ్ సైనిక శిక్షణ



ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

ఉత్తర కొరియా దేశ అధినేత కిమ్ జోంగ్ ఉన్ తన గారాల పట్టి, కాబోయే వారసురాలు కిమ్ జు ఏకు సైనికపరమైన శిక్షణను ముమ్మరం చేశారు. ఇటీవల ప్యాంగ్యాంగ్ ట్రైనింగ్ బేస్ నంబర్ 60 వద్ద నిర్వహించిన భారీ స్థాయి సైనిక విన్యాసాల్లో తండ్రీకూతుళ్లు సందడి చేశారు. దేశం కొత్తగా అభివృద్ధి చేసిన అత్యాధునిక యుద్ధ ట్యాంకును కిమ్ స్వయంగా నడుపుతూ కనిపించగా, జు ఏ ఆ ట్యాంకు లోపలి నుంచి ఉత్సాహంగా బయటకు చూస్తూ కనిపించడం అంతర్జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా వీరిద్దరూ ఒకే రకమైన నలుపు రంగు లెదర్ జాకెట్లు ధరించి కనిపించడం, సైనిక పటిమను చాటడంలో తమ మధ్య ఉన్న ఏకత్వాన్ని ప్రతిబింబించేలా ఉంది. క్షిపణులు , డ్రోన్ దాడులను సమర్థవంతంగా ఎదుర్కోగల ఈ సరికొత్త ట్యాంకుల పనితీరుపై కిమ్ పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. "మన సైన్యం ధైర్యసాహసాలకు, సాంకేతిక అభివృద్ధికి ఈ యుద్ధ ట్యాంకుల కవాతు ఒక నిదర్శనం" అని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. గత కొన్ని నెలలుగా కిమ్ జు ఏను దాదాపు అన్ని కీలక సైనిక ,వ్యూహాత్మక కార్యక్రమాలకు వెంటబెట్టుకొని వెళ్లడం వెనుక పెద్ద ప్రణాళికే ఉందని దక్షిణ కొరియా నిఘా వర్గాలు విశ్లేషిస్తున్నాయి. గత వారం ఆమె పిస్టల్‌తో కాల్పులు జరుపుతున్న ఫోటోలు వైరల్ అయ్యాయి. ఇప్పుడు యుద్ధ ట్యాంకు విన్యాసాల్లో పాల్గొనడం ఆమెను భావి దేశాధినేతగా సిద్ధం చేస్తున్నారనే సంకేతాలను బలపరుస్తోంది. అమెరికా ,దక్షిణ కొరియా సంయుక్తంగా నిర్వహిస్తున్న సైనిక విన్యాసాలకు గట్టి సమాధానం ఇవ్వడమే లక్ష్యంగా ఉత్తర కొరియా ఈ ప్రదర్శనను చేపట్టింది. కిమ్ తన వారసురాలికి కేవలం సిద్ధాంత పరమైన అవగాహన మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో యుద్ధ తంత్రాలపై 'స్పెషల్ ట్రైనింగ్' ఇప్పిస్తున్నట్లు ఈ దృశ్యాలు స్పష్టం చేస్తున్నాయి. అధికారికంగా ఎటువంటి ప్రకటన రాకపోయినప్పటికీ, కిమ్ కుటుంబం నుంచి తదుపరి అధికారం జు ఏ చేతుల్లోకి వెళ్లడం దాదాపు ఖాయమనే చర్చ ప్రపంచవ్యాప్తంగా మొదలైంది. యుద్ధ ట్యాంకుపై తండ్రీకూతుళ్ల ఈ 'రచ్చ' ఉత్తర కొరియా సైనిక శక్తిని ప్రపంచానికి చాటిచెప్పే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తున్నారు.



## మృత్యునీడలో మౌనంగా 'నౌరూజ్'

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

పర్షియన్ క్యాలెండర్ ప్రకారం వసంత విషువత్తు వేళ ప్రకృతి పులకించి, కొత్త ఏడాదికి స్వాగతం పలికే 'నౌరూజ్' పండుగ ఈసారి ఇరాన్ గడ్డపై విషాద ఛాయల మధ్య మొదలైంది. పర్షియన్ భాషలో 'నౌరూజ్' అంటే 'కొత్త రోజు' అని అర్థం, కానీ ఇరాన్ ప్రజలకు ఈ ఏడాది కొత్త రోజు ఆశకు బదులు అంతులేని భయం, అనిశ్చితిని మిగిల్చింది. మూడు వేల ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ సాంస్కృతిక మహోత్సవం, ప్రస్తుతం అమెరికాఇజ్రాయెల్ దాడుల ధాటికి తన ప్రాభవాన్ని కోల్పోయి శ్మశాన వైరాగ్యాన్ని తలపిస్తోంది. ఈ సమయంలో ఇళ్లను శుభ్రం చేసుకునే 'ఖోనెహ్ టకాన్' సంప్రదాయంతో సందడిగా ఉండాల్సిన వీధులు, నేడు క్షిపణుల దాడులకు కూలిపోయిన భవనాల శిథిలాలతో నిండిపోయాయి. పండుగ పూట కొత్త బట్టలు ధరించి బంధుమిత్రులను పలకరించాల్సిన చేతులు, శిథిలాల కింద చిక్కుకున్న తమ వారి మృతదేహాలను వెలికితీస్తుండటం అత్యంత దయనీయమైన స్థితికి అద్దం పడుతోంది. ఇరాన్ గగనతలం బాణాసంచా కాంతులతో కాకుండా, యుద్ధ విమానాలు క్షిపణుల గర్జనలతో దద్దరిల్లుతోంది. ఈ భీభత్సం ఇరాన్ ప్రజలకు 1980ల నాటి ఇరాక్, ఇరాన్ యుద్ధ కాలపు చీకటి రోజులను గుర్తు చేస్తోంది. నాటి భయానక జ్ఞాపకాలు మళ్లీ కళ్లముందు కదలాడుతుండటంతో జనం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని సురక్షిత ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. వేలాది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం, లక్షలాది మంది నిరాశ్రయులవ్వడంతో పండుగ సంబరం అనేది ఒక అందని ద్రాక్షలా మారిపోయింది. తమ అస్తిత్వాన్ని చాటుకునేందుకు కొందరు ధైర్యవంతులు శిథిలాల మధ్యే ఏడు రకాల వస్తువులతో కూడిన 'హఫ్ట్‌సిన్' టేబుల్‌ను ఏర్పాటు చేసుకుంటూ తమ సంప్రదాయాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.



# జువ్వలదిన్నె హార్బర్‌ను కాపాడుకుందాం

**నెల్లూరు (ఏడీఎన్ఎన్):**

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను ప్రైవేట్‌పరం చేస్తున్నారని వైసీపీ చేపట్టిన 'చలో జువ్వలదిన్నె' కార్యక్రమం శుక్రవారం నెల్లూరు జిల్లాలో ఉద్రిక్తతకు దారితీసింది. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కావలి నుంచి భారీ ర్యాలీగా బయలుదేరిన వైసీపీ శ్రేణులను పోలీసులు జువ్వలదిన్నె సమీపంలో అడ్డుకున్నారు. కేవలం 25 మందిని మాత్రమే అనుమతిస్తామని పోలీసులు స్పష్టం చేయడంతో, పోలీసుల తీరుకు నిరసనగా కార్యకర్తలు అక్కడే ఆందోళనకు దిగారు.వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల ప్రయోజనాల కోసం 70 ఎకరాల స్థలాన్ని సేకరించి ఈ హార్బర్‌ను అభివృద్ధి చేశారని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇందులో 29.5 ఎకరాల భూమిని 'సాగర్ డిఫెన్స్' అనే ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. మత్స్యకారులకు చెందాల్సిన ఆస్తిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం ద్వారా చంద్రబాబు మత్స్యకారులపై కక్ష సాధిస్తున్నారని ఆరోపించారు. తాము పరిశ్రమల ఏర్పాటుకు వ్యతిరేకం కాదని, కానీ హార్బర్ కోసం సేకరించిన స్థలాన్ని ప్రైవేట్ సంస్థలకు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు.హార్బర్ ప్రైవేటీకరణను అడ్డుకునే వరకు తమ పోరాటం ఆగదని వైసీపీ నేతలు హెచ్చరించారు. ప్రైవేట్ సంస్థలకు స్థలాన్ని కేటాయించాలనుకుంటే వేరే చోట ఇవ్వాలని, హార్బర్ భూములను మాత్రం మత్స్యకారుల ఉపాధి కోసమే వినియోగించాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్రమంగా అరెస్టులు చేసినా, అడ్డంకులు సృష్టించినా జువ్వలదిన్నె ప్రయోజనాల కోసం నిరసనలు కొనసాగిస్తామని నేతలు స్పష్టం చేశారు. ఈ క్రమంలో నిరసనకారులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో కావలిజువ్వలదిన్నె పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# వివేకా హత్యకు స్పాట్ పెట్టింది ఆయనే

**కడప (ఏడీఎన్ఎన్):**



కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి నిర్వహించిన ప్రెస్‌మీట్‌పై పులివెందుల టీడీపీ ఇంచార్జి బీటెక్ రవి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎద్దేవా చేశారు. కడపలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ , అవినాష్ రెడ్డి మాటలు వింటుంటే ఆయనకు 'ఆస్కార్' అవార్డు ఇచ్చే రేంజ్‌లో నటిస్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితుడిగా ఉండి, ఇప్పుడు సునీతారెడ్డిపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు సునీత సహకరిస్తోందని చెప్పడం హాస్యాస్పదమని ధ్వజమెత్తారు.వివేకా హత్య కేసులో వాస్తవాలను అవినాష్ రెడ్డి వక్రీకరిస్తున్నారని బీటెక్ రవి ఆరోపించారు. ఒకవేళ సునీతారెడ్డికి రాజకీయ కోరిక ఉంటే, అవినాష్ రెడ్డి ఎన్నడూ కడప ఎంపీ అయ్యేవారు కాదని, ఆ పదవి ఆమె పెట్టిన భిక్ష అని పేర్కొన్నారు. "హత్యకు స్పాట్ పెట్టింది మీరు.. స్పాట్‌కు వెళ్ళింది మీరు.. అక్కడ సాక్ష్యాధారాలను దగ్గరుండి క్లీన్ చేయించింది కూడా మీరే" అంటూ అవినాష్ రెడ్డిపై ప్రత్యక్ష ఆరోపణలు చేశారు. వివేకా కేసులో ఎంపీ శిక్ష నుంచి తప్పించుకోలేరని ఆయన స్పష్టం చేశారు.కుటుంబ సభ్యులను చంపి, మళ్ళీ వారినే దోషులుగా చిత్రించే ప్రయత్నం చేస్తున్నారని బీటెక్ రవి మండిపడ్డారు. వైఎస్సార్ కుటుంబంలో జరిగిన ఈ ఘోరకలిని ప్రజలంతా గమనిస్తున్నారని, సాక్ష్యాలను తారుమారు చేసినా దేవుని న్యాయం నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. అవినాష్ రెడ్డి చేస్తున్న డ్రామాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, వివేకా హత్య వెనుక ఉన్న అసలు నిజాలు త్వరలోనే పూర్తిస్థాయిలో బయటకు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



# పండుగ రోజు కూడా సీఎం పచ్చి అబద్ధాలే

**తిరుపతి (ఏడీఎన్ఎన్):**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉగాది పండుగ రోజు కూడా అబద్ధాలు చెప్పి ప్రజలను వంచిస్తున్నారని మాజీ మంత్రి ఆర్‌కే రోజా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తిరుపతిలో మీడియాతో శుక్రవారం ఆమె మాట్లాడుతూ ,చంద్రబాబు పాలనలో జనం సంతోషంగా ఉన్నారని చెప్పడం హాస్యాస్పదమని విమర్శించారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిందని, అప్పటి నుంచి అబద్ధాలతోనే కాలం వెళ్లదీస్తోందని ఆమె ఆరోపించారు. జగనన్న పాలనలో రైతులు, ఉద్యోగులు, పేదలు ఎంతో సంతోషంగా ఉండేవారని, నేడు ఆ పరిస్థితి లేదని ఆమె పేర్కొన్నారు.మ్యానిఫెస్టోలో ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజలను దారుణంగా మోసం చేసిందని రోజా మండిపడ్డారు. 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ. 1500 ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఊసే ఎత్తలేదని, నిరుద్యోగ భృతి కింద రూ. 3,000 ఇస్తామన్న హామీ ఎక్కడకు పోయిందని ఆమె ప్రశ్నించారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కూటమి ప్రభుత్వంలో రైతులు, నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదని ఆమె దుయ్యబట్టారు.టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడుపై కూడా రోజా తీవ్ర విమర్శలు చేశారు. ఛైర్మన్ పదవి తనకు అన్నం పెడుతుందా అని ఆయన మాట్లాడటం దారుణమని, అర్హత లేని వ్యక్తులకు పదవులు ఇస్తే ఇలాగే ఉంటుందని ఆమె వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో వ్యాపారాలు ఉన్నాయని చెప్పుకునే ఆయనకు టీటీడీ వంటి పవిత్ర సంస్థ బాధ్యతలు అప్పగించడం సరైనది కాదని, తక్షణమే ఆయన రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. లోక కల్యాణం కోసం పని చేయాల్సిన పదవిలో ఉండి అహంకారంతో మాట్లాడే వారిని ప్రజలు తరిమికొట్టే రోజు వస్తుందని ఆమె హెచ్చరించారు.

# రైతు కష్టార్జితం వృధా కానివ్వం

- **తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్న సీఎం**

**అమరావతి (ఏడీఎన్ఎన్):**




రాష్ట్రంలో అకస్మాత్తుగా కురిసిన అకాల వర్షాలు బీభత్సం సృష్టించిన నేపథ్యంలో, అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం యుద్ధప్రతిపాదికన చర్యలు చేపట్టింది. వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. అమరావతిలో అధికారులతో వరుసగా రెండో రోజూ అత్యున్నత స్థాయి సమీక్ష శుక్రవారం నిర్వహించారు . ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ , క్షేత్రస్థాయిలో పంట నష్టంపై సమగ్ర నివేదికలు అందజేయాలని ఆదేశించారు.పంట నష్టపోయిన రైతులకు తక్షణమే సాయం అందించాలని, సహాయక చర్యల్లో ఎలాంటి జాప్యం జరగకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉన్న ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. "రైతు కష్టార్జితం ఒక్క గింజ కూడా వృధా కాకూడదు" అని సీఎం పేర్కొన్నారు . వర్షానికి తడిచిన ధాన్యాన్ని సైతం నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వమే సేకరించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. నష్టపరిహారం అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ. 62 కోట్లకు పైగా పంట నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనాలు వెలువడ్డాయి. 12 జిల్లాల్లోని సుమారు 6,684 హెక్టార్లలో ఆహార పంటలు, మరో 1,301 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ఈ కష్టకాలంలో యంత్రాంగం మొత్తం అప్రమత్తంగా ఉండి, రైతులకు ధైర్యాన్ని ఇవ్వాలని చంద్రబాబు సూచించారు. బాధితులకు అందాల్సిన పరిహారం నేరుగా వారి ఖాతాల్లోకి చేరేలా పారదర్శకత పాటించాలని అధికారులకు స్పష్టం చేశారు.

# 'ఖాళీలు బారెడు.. నోటిఫికేషన్లు చారెడు'

- **కూటమి సర్కార్‌పై వైఎస్ షర్మిల ఘాటు విమర్శలు**

**అమరావతి (ఏడీఎన్ఎన్):**




కూటమి ప్రభుత్వం ఉగాది పర్వదినం సందర్భంగా విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌పై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేవలం 10,060 పోస్టులతో క్యాలెండర్ ప్రకటించడం నిరుద్యోగ యువతను వంచించడమేనని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో లక్షలాది ఖాళీలు ఉండగా, ప్రభుత్వం ప్రకటించిన పోస్టుల సంఖ్య "ఖాళీలు బారెడు.. నోటిఫికేషన్లు చారెడు" అన్న చందంగా ఉందని ఆమె ఎద్దేవా చేశారు. కొండంత రాగం తీసి కూసంత పాట పాడినట్లుగా కూటమి ప్రభుత్వ తీరు ఉందని, ముష్టి 10 వేల పోస్టులతో గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. వివిధ శాఖల్లో ఉన్న ఖాళీలపై షర్మిల ప్రభుత్వాన్ని నిలదీశారు. గతంలో ఇచ్చిన హామీల ప్రకారం విద్యాశాఖలో 30 వేలు, పోలీస్ శాఖలో 19,999, పంచాయతీ రాజ్‌లో 26 వేలు, వైద్యశాఖలో 26 వేల ఖాళీలు ఉన్నాయని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 153 విభాగాల్లో కలిపి సుమారు 1.80 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, రెండేళ్లకు కలిపి కనీసం 50 వేల ఉద్యోగాలనైనా భర్తీ చేయాల్సి ఉందని ఆమె డిమాండ్ చేశారు. 50 లక్షల మంది నిరుద్యోగులున్న రాష్ట్రంలో ఇలాంటి అరకొర క్యాలెండర్లు యువత ఆశలపై నీళ్లు చల్లడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.నిరుద్యోగుల పక్షాన నిలబడి మరికొన్ని కీలక డిమాండ్లను ఆమె ప్రభుత్వం ముందుంచారు. కోచింగ్ సెంటర్లలో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న యువతకు న్యాయం చేయాలని కోరారు. ముఖ్యంగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ దరఖాస్తులకు వయోపరిమితిని 42 నుంచి 46 ఏళ్లకు పెంచాలని షర్మిల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మే 15 నుంచి అక్టోబరు లోపు నియామకాలు పూర్తి చేస్తామన్న హామీని నమ్మడం కష్టమని, యువతను ఊరించి ఉసూరుమనిపించడం మానుకోవాలని ఆమె హితవు పలికారు.

# భార్యపై అనుమానంతో బిడ్డలకు పరీక్షలా?

- **ఏపీ హైకోర్టు సంచలన తీర్పు!**

**అమరావతి (ఏడీఎన్ఎన్:**




భార్యకు అక్రమ సంబంధం ఉందనే అనుమానంతో, పుట్టిన బిడ్డలు తనవారో కాదో తేల్చుకునేందుకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించాలన్న ఒక భర్త పిటిషన్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. వ్యక్తిగత వివాదాల్లో పిల్లల హక్కులను పణంగా పెట్టడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. విజయనగరం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి తన భార్య ప్రవర్తనపై అనుమానంతో, ఆమె వివాహేతర సంబంధాన్ని నిరూపించేందుకు పిల్లలకు డీఎన్ఏ పరీక్షలు చేయించాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు ఈ కీలక తీర్పునిచ్చారు.ఈ కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "భార్యపై ఉన్న ఆరోపణలను నిరూపించడానికి అమాయక పిల్లలను పావులుగా ఉపయోగించడం అత్యంత విచారకరం. ఇలాంటి పరీక్షలు పిల్లల మానసిక స్థితిని, వారి భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తాయి" అని కోర్టు పేర్కొంది. భార్యకు అక్రమ సంబంధం ఉందని నిరూపించడానికి ఇతర సాక్ష్యాధారాలు వెతుక్కోవాలి తప్ప, పిల్లల పుట్టుకను ప్రశ్నిస్తూ వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదని హితవు పలికింది. వ్యక్తిగత స్వార్థం కోసం పిల్లల గౌరవానికి భంగం కలిగించే చర్యలను అనుమతించబోమని హైకోర్టు తేల్చి చెప్పింది.కోర్టు సమయాన్ని వృథా చేస్తూ, పిల్లల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టేలా పిటిషన్ దాఖలు చేసినందుకు సదరు వ్యక్తికి హైకోర్టు రూ. 3,000 జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని విజయనగరం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థకు చెల్లించాలని ఆదేశించింది. కుటుంబ కలహాల్లో పిల్లల ప్రయోజనాలే అత్యున్నతమని, వారి హక్కులను కాపాడటం న్యాయవ్యవస్థ బాధ్యతని ఈ తీర్పు ద్వారా హైకోర్టు మరోసారి స్పష్టం చేసింది.

# జగన్ ను వ్యక్తిత్వ హననం చేస్తే ఖబడ్దార్

- **షర్మిల, విజయమ్మలపై రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఫైర్!**

**కడప (ఏడీఎన్ఎన్):**



వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యక్తిత్వాన్ని హననం చేసేలా వ్యవహరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు. ప్రొద్దుటూరులో మీడియాలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ , గత కొన్నేళ్లుగా షర్మిల, సునీతలు కలిసి జగన్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. షర్మిలను కాపాడే క్రమంలో కుమారుడైన జగన్‌పై నిందలు వేయడం విజయమ్మకు సరైనదేనా అని ఆయన ప్రశ్నించారు. జగన్ తన సొంత డబ్బు రూ. 236 కోట్లు చెల్లెలికి ఇచ్చారని, 2019లో రాసిన ఎంఓయూ కేవలం ఆమెపై ప్రేమతో ఇచ్చిందే తప్ప అది ఆస్తుల పంపకం కాదని రాచమల్లు స్పష్టం చేశారు.విజయమ్మ విడుదల చేసిన లేఖలు మొదట టీడీపీ సోషల్ మీడియాలో ప్రత్యక్షమవ్వడం వెనుక ఉన్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన ఆరోపించారు. జగన్‌ను జైలుకు పంపిన పార్టీలోకి షర్మిల వెళ్తుంటే విజయమ్మ ఎందుకు నిరోధించలేదని, సరస్వతీ ప్లాంట్ షేర్ల బదిలీ జరిగితే జగన్ బెయిల్ రద్దవుతుందని తెలిసి కూడా అడగడం అన్యాయమని ధ్వజమెత్తారు. జగన్ పట్ల అందరూ కలిసి పగబట్టారని, ఆయన తరపున ఒక భక్తుడిలా తాను నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటానని, జగన్ కోసం ప్రాణాలైనా ఇస్తానని రాచమల్లు ఉద్వేగంగా ప్రకటించారు.

# నేను డ్రగ్స్ తీసుకోలేదు.. కావాలనే ఇరికిస్తున్నారు

**షోకాజ్ నోటీసుకి టీడీపీ ఎంపీ సమాధానం**

**ఏలూరు (ఏడీఎన్ఎన్):**



డ్రగ్స్ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏలూరు లోక్‌సభ సభ్యుడు పుట్టా మహేష్ కుమార్, తెలుగుదేశం పార్టీ అధిష్టానం జారీ చేసిన షోకాజ్ నోటీసుపై లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. గత ఐదు రోజులుగా ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తుండగా, గడువు ముగియడంతో నిన్న రాత్రి ఆయన తన వివరణను సమర్పించినట్లు సమాచారం. ఈ వివరణలో ఉన్న అంశాలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.పుట్టా మహేష్ తన సమాధానంలో తాను ఎటువంటి డ్రగ్స్ తీసుకోలేదని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా తన డ్రగ్స్ పరీక్షల ఫలితాల్లో వచ్చిన వ్యత్యాసాలపై ఆయన పలు అనుమానాలు వ్యక్తం చేశారు. మొదట నెగటివ్ వచ్చిన ఫలితం, తర్వాత పాజిటివ్‌గా ఎలా మారిందని ఆయన తన వివరణలో ప్రశ్నించినట్లు సమాచారం. తనను రాజకీయంగా బలిపశువును చేసేందుకు ఈ వ్యవహారాన్ని కావాలనే తెరపైకి తెచ్చారని, తెలంగాణ రాజకీయ పరిణామాలకు తనను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేసినట్లు టాక్ వినిపిస్తోంది.ప్రస్తుతం పుట్టా మహేష్ ఇచ్చిన వివరణను టీడీపీ అధిష్టానం నిశితంగా పరిశీలిస్తోంది. పార్టీ క్రమశిక్షణ కమిటీ మరియు అగ్ర నేతలు ఈ సమాధానాన్ని విశ్లేషించిన తర్వాత తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఒకవైపు ప్రతిపక్షాలు ఈ అంశంపై విమర్శలు గుప్పిస్తుండగా, మరోవైపు సొంత పార్టీ ఎంపీపై అధిష్టానం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది. ఈ వ్యవహారం ఏలూరు పార్లమెంట్ పరిధిలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# జగన్ పూజలన్నీ సెట్టింగ్ డ్రామాలే

**అమరావతి (ఏడీఎన్ఎన్):**



వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఇంట్లోనే సెట్టింగ్ వేసి పూజలు చేస్తున్నట్లు నటించడం అలవాటుగా మారిందని రాష్ట్ర మంత్రి పార్థసారథి ఎద్దేవా చేశారు . గతంలో తిరుమల తరహాలో సెట్టింగ్ వేసి ఆయన చేసిన పూజలను ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వంటి మహోన్నత వ్యక్తులే తిరుమల పర్యటనలో నిబంధనల ప్రకారం డిక్లరేషన్ ఇచ్చారని, కానీ జగన్ మాత్రం ఎప్పుడూ ఆ సంప్రదాయాన్ని పాటించలేదని ఆయన మండిపడ్డారు. హిందూ ధర్మంపై గౌరవం లేని వ్యక్తులు సూక్తులు చెప్పడం హాస్యాస్పదమని ధ్వజమెత్తారు.తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారంపై మంత్రి పార్థసారథి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో భక్తుల మనోభావాలతో ఆడుకున్నారని, అపవిత్రమైన నెయ్యిని కలిపి శ్రీవారి ప్రసాద ప్రాశస్త్యాన్ని దెబ్బతీశారని విమర్శించారు. జగన్ పాలనలో హిందువులను గౌరవించిన దాఖలాలు ఎక్కడా లేవని, ఒకవైపు ధర్మాన్ని దూషిస్తూనే మరోవైపు రక్షించమని చెప్పడం ఆయన ద్వంద్వ నీతికి నిదర్శనమని దుయ్యబట్టారు. పండుగల సమయంలో లోకకల్యాణాన్ని కోరుకోవాలి కానీ, జగన్ మాత్రం తాను ఒక్కడే సంతోషంగా ఉండాలనుకునే స్వార్థపూరిత తత్వం కలిగిన వ్యక్తి అని విమర్శించారు.వైసీపీ నాయకత్వం భక్తిని కూడా రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని మంత్రి ఆరోపించారు. తిరుమల పవిత్రతను కాపాడటంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇప్పుడు తప్పులు కప్పిపుచ్చుకోవడానికి డ్రామాలు ఆడుతోందని మండిపడ్డారు. హిందూ ధర్మంపై నిజమైన భక్తి ఉంటే నిబంధనలను గౌరవించాలని, అంతేకానీ సెట్టింగ్‌లతో ప్రజలను మభ్యపెట్టాలని చూడవద్దని పార్థసారథి హితవు పలికారు. తిరుమల ప్రసాదం కల్తీ వ్యవహారంలో దోషులు ఎవరైనా సరే వదిలిపెట్టే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు.

# ఇది ఒక 'జోక్ క్యాలెండర్'

- **ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మండిపాటు**

**తాడేపల్లి (ఏడీఎన్ఎన్:**



కూటమి ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌పై వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆయన మీడియా సమావేశంలో శుక్రవారం మాట్లాడుతూ, మంత్రి నారా లోకేశ్ ప్రకటించిన జాబ్ క్యాలెండర్ నిరుద్యోగుల పాలిట 'జోక్ క్యాలెండర్'గా మారిందని ఎద్దేవా చేశారు. ఆ క్యాలెండర్‌లో కేవలం తేదీలు మాత్రమే ఉన్నాయని, అసలైన ఉద్యోగాల డేటా ఎక్కడా లేదని ఆయన విమర్శించారు. గతంలో వేల సంఖ్యలో ఖాళీలు ఉన్నాయని చెప్పిన చంద్రబాబు, లోకేశ్, ఇప్పుడు కేవలం పది వేల ఉద్యోగాలతో తూతూమంత్రంగా చేతులు దులుపుకుంటున్నారని ధ్వజమెత్తారు.రాష్ట్రంలో నిరుద్యోగ భృతి ఊసే లేదని, బడ్జెట్‌లో దానికి సంబంధించిన కేటాయింపులు కూడా సున్నా అని చంద్రశేఖర్ ఆరోపించారు. వైఎస్ జగన్ హయాంలో నిరుద్యోగులకు కల్పించిన వేల ఉద్యోగాలను చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలగించిందని ఆయన మండిపడ్డారు. ఔట్ సోర్సింగ్ విభాగంలో 9 వేల మందిని, ఏపీ ఫైబర్‌లో 2 వేల మందిని, రేషన్ వాహనాల్లో పనిచేసే 2,900 మందిని, చివరకు బెవరేజెస్ కార్పొరేషన్‌లోని 18 వేల మందిని తొలగించారని గణాంకాలను వివరించారు. నిరుద్యోగులకు కొత్తగా ఉద్యోగాలు ఇవ్వకపోగా, ఉన్న ఉపాధిని లాగేసుకోవడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని ఆయన విమర్శించారు.మంత్రులుగా ఉన్న లోకేశ్, పవన్ కళ్యాణ్‌లకు నిరుద్యోగుల కష్టాలు తెలియవని, వారు కేవలం మాటలతో అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. ఏళ్లుగా గ్రూప్2 నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులను కూడా ఈ సర్కార్ విస్మరించిందని, ఐఆర్ , పీఆర్సీ ఊసే ఎత్తడం లేదని ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగుల జీవితాలతో బంతాట ఆడుతున్న ఈ ధోరణిని ప్రజలు గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు.



# గ్యాస్ సిలిండర్ల కోసం క్యూ కట్టొద్దు

**అమరావతి (ఏడీఎన్ఎన్):**

ఆంధ్రప్రదేశ్‌లో ఎల్పీజీ సిలిండర్ల సరఫరాపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టతనిచ్చారు. రాష్ట్రంలో ఎక్కడా గ్యాస్ కొరత లేదని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని ఆయన హామీ ఇచ్చారు. అమరావతిలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం నిర్వహించిన కీలక సమీక్షలో ఆయన మాట్లాడుతూ, సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు వార్తలను నమ్మి గ్యాస్ ఏజెన్సీల వద్ద గుమిగూడవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనవసరపు భయం కారణంగా ఒక్కసారిగా బుకింగ్స్ పెరగడం వల్ల సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోందని, ప్రస్తుతం అంతా సజావుగానే సాగుతోందని వివరించారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా 2,00,479 సిలిండర్ల డెలివరీ పూర్తయిందని ఆయన గణాంకాలను వెల్లడించారు.అంతర్జాతీయంగా, ముఖ్యంగా ఖతార్‌లో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ, ప్రస్తుతానికి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేవని మంత్రి భరోసా ఇచ్చారు. అదే సమయంలో గ్యాస్ సిలిండర్ల అక్రమ రవాణా లేదా దుర్వినియోగానికి పాల్పడే వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని హెచ్చరించారు. డొమెస్టిక్ సిలిండర్లను ఇతర అవసరాలకు డైవర్ట్ చేస్తున్న 9 మందిపై ఇప్పటికే కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పారదర్శకత కోసం ఇకపై ప్రతి సిలిండర్ డెలివరీ ఖచ్చితంగా ఓటీపీ విధానంలోనే జరుగుతుందని స్పష్టం చేశారు. హాస్టళ్లు, ఆస్పత్రులు, అన్న క్యాంటీన్ల వంటి అత్యవసర విభాగాలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా ప్రాధాన్యత క్రమంలో గ్యాస్ సరఫరా చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా సుమారు 60 వేల మందికి పైప్డ్ నేచురల్ గ్యాస్ అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో వంట అవసరాల కోసం ఇప్పటికే 54 వేల ఇండక్షన్ స్టవ్‌లను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. గ్యాస్ సరఫరా పర్యవేక్షణ కోసం జిల్లా జాయింట్ కలెక్టర్లు మరియు సివిల్ సప్లై అధికారులకు ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు సంయమనంతో వ్యవహరించాలని, ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని ఆయన పునరుద్ఘాటించారు.



## ఇది బడ్జెట్ కాదు..
# అప్పుల చిట్టా

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

తెలంగాణ శాసనసభలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది కేవలం అంకెల ఆర్భాటం, ప్రగల్భాల కేటాయింపులతో కూడిన 'ప్రజా వంచన' బడ్జెట్ అని ఆయన అభివర్ణించారు. ఆదాయ మార్గాలను పక్కనపెట్టి, మరో రూ. లక్ష కోట్ల అదనపు అప్పు భారాన్ని ప్రజలపై మోపడానికి ప్రభుత్వం సిద్ధమవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించడంలో కాంగ్రెస్ హ్యాట్రిక్ కొట్టిందని, కేంద్రం ఇచ్చే నిధులపై ఆధారపడటం తప్ప ఈ ప్రభుత్వానికి సొంత ప్రణాళిక లేదని విమర్శించారు. బడ్జెట్ లో సంక్షేమ పథకాలకు జరిగిన అన్యాయాన్ని బండి సంజయ్ ఏకరువు పెట్టారు. రైతు భరోసా నిధులను ఎగ్గొట్టి కౌలు రైతులు, కూలీల నోట్లో మట్టి కొట్టారని ఆరోపించారు. "తులం బంగారం తుస్.. రూ. 2,500 నిల్" అంటూ మహిళా సంక్షేమ హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఎద్దేవా చేశారు. అవ్వాతాతలకు ఇస్తామన్న రూ. 4 వేల పెన్షన్ పెంపు ఊసే లేదని, నిరుద్యోగ భృతిని బడ్జెట్ లో చేర్చకపోవడం నిరుద్యోగులను మోసం చేయడమేనని ధ్వజమెత్తారు. విద్యార్థులకు భరోసా కార్డులు అన్నారని, కానీ ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు. ఆరు గ్యారంటీలకు ఈ బడ్జెట్ 'పాడె కట్టేలా' ఉందని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు.విద్యాశాఖకు 16 శాతం నిధులు ఇవ్వాలని కమిషన్ ప్రతిపాదించినా, కేవలం 8 శాతానికే పరిమితం చేయడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. 56 శాతం ఉన్న బీసీ జనాభాకు కేవలం 4 శాతం నిధులు కేటాయించడం అన్యాయమని, ఎస్సీ, ఎస్టీలకు కూడా తగిన ప్రాధాన్యత లభించలేదని ఆరోపించారు. పెట్టుబడుల పేరుతో దావోస్, గ్లోబల్ సమ్మిట్ ల ద్వారా తెచ్చిన నిధుల వివరాలను వెల్లడించే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని సవాల్ విసిరారు. రెండేళ్లలో దిగిపోయే ప్రభుత్వం ఇష్టారాజ్యంగా అప్పులు చేస్తోందని, బీజేపీ అధికారంలోకి వచ్చాక గత బీఆర్ఎస్ మరియు ప్రస్తుత కాంగ్రెస్ చేసిన అప్పుల భాగోతంపై పూర్తిస్థాయి విచారణ జరిపిస్తామని బండి సంజయ్ స్పష్టం చేశారు.



# కాంగ్రెస్ బడ్జెట్ అంతా అంకెల గారడీ

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బంజారాహిల్స్ లోని జాగృతి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఈ బడ్జెట్ అంతా 'ఫేక్, రివిజన్, ఫ్యాబ్రికేటెడ్' అని మండిపడ్డారు. బీసీలు, మహిళలు, నిరుద్యోగులు, రైతులు, వికలాంగులు , మైనార్టీలు ఇలా సమాజంలోని అన్ని వర్గాలకు ఈ బడ్జెట్ లో తీరని అన్యాయం జరిగిందని ఆమె ఆరోపించారు. రైతుభరోసా, చేయూత పింఛన్ల వంటి పథకాలకు గతేడాది కేటాయించిన నిధులనే అక్షరం మార్చకుండా ఈ ఏడాది కూడా చూపించారని, ప్రభుత్వానికి కనీస విజన్ లేకపోవడం వల్లే పాత అంకెలనే మళ్లీ వాడుతున్నారని ఆమె విమర్శించారు.ఎన్నికల సమయంలో తెలంగాణకు వచ్చి పెద్ద ఎత్తున హామీలిచ్చిన రాహుల్ గాంధీని కవిత 'రాహుల్ ఫేక్' అంటూ సంబోధించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు బీసీలకు ఏటా రూ. 20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి, తీరా బడ్జెట్ లో కేవలం 4 శాతం నిధులే కేటాయించి మోసం చేశారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెస్తున్న లక్షల కోట్ల అప్పులు ఎక్కడికి పోతున్నాయని ప్రశ్నించిన ఆమె, రాష్ట్రంలో ఒక్కో కుటుంబంపై దాదాపు రూ. 9 లక్షల అప్పు భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు ఇస్తామన్న రూ. 2,500 పథకం ఊసే లేదని, ఇందిరమ్మ ఇళ్ల బడ్జెట్ లో కూడా భారీగా కోత పెట్టారని ఆమె ఎద్దేవా చేశారు. మహిళల సంక్షేమం గురించి మాట్లాడుతూ.. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న కాంగ్రెస్ మాటలు అన్నింటికంటే పెద్ద 'ఫేక్' అని కవిత కొట్టిపారేశారు. స్త్రీ నిధి విభాగంలో గత 14 ఏళ్లుగా అక్రమాలకు పాల్పడుతున్న జి. విద్యాసాగర్ రెడ్డిని వెంటనే తొలగించాలని, ఈ విషయంలో మంత్రి సీతక్క వెంటనే విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. కమీషన్ల కోసమే యంగ్ ఇండియా స్కూళ్లకు నిధులు కేటాయిస్తున్నారని ఆరోపించిన ఆమె, నిరుద్యోగం రాష్ట్రంలో 'రైజింగ్' అవుతోందని విమర్శించారు. బడ్జెట్ లో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు రివైజ్డ్ ఎస్టిమేట్స్ లోనైనా ప్రాధాన్యత లేని రంగాలకు నిధులు కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు.



# అబద్ధాలు, ఎదురుదాడులే రేవంత్ సర్కార్ విధానం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

తెలంగాణ శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. చట్టసభల్లో చర్చ అంటేనే ప్రస్తుత ప్రభుత్వం భయపడుతోందని, ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రజా సమస్యలకు సమాధానం చెప్పలేక పలాయనం చిత్తగిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో ప్రతిపక్షాల గొంతు నొక్కేలా ప్రభుత్వం బుల్డోజ్ చేస్తోందని, ఏ ఒక్క ప్రశ్నకు కూడా బాధ్యతాయుతమైన సమాధానం రావడం లేదని మండిపడ్డారు. చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా ప్రభుత్వం అబద్ధాలతో ఎదురుదాడి చేస్తూ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని, ముఖ్యమంత్రి మాట తీరు కూడా ప్రజాస్వామ్యబద్ధంగా లేదని విమర్శించారు. ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై తమ పోరాటం ఆపబోమని, సభలో ప్రభుత్వాన్ని ఎండగట్టి తీరుతామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.

# మా హయాంలోనే 732 మంది లొంగుబాటు

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :



తెలంగాణ అసెంబ్లీ వేదికగా నక్సలిజం అంతం, మావోయిస్టుల లొంగుబాట్లపై ఉపముఖ్యమంత్రి, మల్లు భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. బడ్జెట్ ప్రసంగంలో భాగంగా హోంశాఖకు రూ. 11,907 కోట్లు కేటాయించినట్లు వెల్లడించిన ఆయన, నక్సలిజం పుట్టుకకు కారణమైన సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపడం ద్వారానే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు దీనిని కేవలం శాంతిభద్రతల సమస్యగానే చూశాయని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం సమస్య మూలాలను విశ్లేషించి సామాజిక మార్పు దిశగా అడుగులు వేస్తోందని ఆయన వివరించారు. యువతకు సరైన జీవనోపాధి, సామాజిక గౌరవం, ఆర్థిక భరోసా కల్పించడం ద్వారా అడవుల్లోకి వెళ్లిన వారు సైతం ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలుస్తారనే వాస్తవాన్ని తమ ప్రభుత్వం గుర్తించిందని భట్టి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 347 మంది మావోయిస్టులు లొంగిపోగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 2023 డిసెంబర్ 7 నుంచి 2026 మార్చి 8 వరకు రికార్డు స్థాయిలో 732 మంది మావోయిస్టులు లొంగిపోయారని ఆయన వెల్లడించారు. సరెండర్ అయిన వారికి ప్రభుత్వం తరపున పూర్తిస్థాయిలో పునరావాసం కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు.సమగ్ర సంక్షేమం, ఉపాధి కల్పన ద్వారానే నక్సలిజం ఉద్యమాన్ని అంతం చేయవచ్చని తెలంగాణ నిరూపించిందని, ఈ విధానంలో రాష్ట్రం దేశానికే మార్గదర్శకంగా మారిందని మంత్రి అభివర్ణించారు. కేవలం పోలీస్, సైనిక బలగాలను ఉపయోగించి అణిచివేయడం కంటే, సామాజిక ఆర్థిక భరోసా కల్పించడం ద్వారానే నిజమైన మార్పు సాధ్యమని ఆయన దార్శనికతను చాటారు. ప్రజా ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానం దేశానికి ఒక ఆదర్శ నమూనాగా నిలిచిందని అసెంబ్లీ సాక్షిగా డిప్యూటీ సీఎం ప్రకటించారు.

# ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో భారీ కుంభకోణం

- ఆధారాలతో బయటపెడతానన్న హరీశ్ రావు

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణంలో వందల కోట్ల కుంభకోణం జరుగుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. అసెంబ్లీలోని బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా చిట్ చాట్ లో ఆయన మాట్లాడుతూ, టెండర్ల ప్రక్రియలో కాంట్రాక్టర్లు 'ఆర్గనైజ్డ్ రింగ్'గా ఏర్పడి ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని మండిపడ్డారు. ఈ స్కామ్ కు సంబంధించిన పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయని, వీటిని అసెంబ్లీ సాక్షిగా బయటపెడతానని ఆయన హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా 76 స్కూళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అంచనా వేసిన రూ. 10,199.54 కోట్లను, కాంట్రాక్టర్లు పక్కా ప్లాన్ తో రూ. 10,693.55 కోట్లకు దక్కించుకున్నారని హరీశ్ రావు ఆరోపించారు. దీనివల్ల సుమారు రూ. 494 కోట్ల అదనపు భారం ప్రజలపై పడుతోందన్నారు. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గం మధిర సహా పలువురు మంత్రుల నియోజకవర్గాల్లో అత్యధికంగా 4.95 శాతం నుంచి 4.99 శాతం ఎక్సెస్ ధరకు టెండర్లు కట్టబెట్టడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. అలాగే, ముఖ్యమంత్రి వాడుతున్న వాహనం రిజిస్టర్ అయిన సంస్థకే ఏకంగా 9 స్కూళ్ల టెండర్లు ఇవ్వడం వెనుక ఉన్న రహస్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు.రాజకీయ పక్షపాతంతో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలున్న 26 నియోజకవర్గాలకు ఈ స్కూళ్లను మంజూరు చేయలేదని హరీశ్ రావు మండిపడ్డారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ, మెడికల్ కాలేజీలు, దళిత బంధు వంటి పథకాలను విపక్ష ఎమ్మెల్యేలున్న ప్రాంతాల్లోనూ సమానంగా అమలు చేసిందని గుర్తు చేశారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం తమ పార్టీలోకి ఫిరాయించిన వారికి, మిత్రపక్షాలకే ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధిని విస్మరిస్తోందని విమర్శించారు. వందల కోట్ల అవినీతిపై సభలో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని ఆయన స్పష్టం చేశారు.

# బడ్జెట్ లో బీసీలకు మొండిచేయి

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :



తెలంగాణ శాసనసభలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బీసీలను దారుణంగా వంచించిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ, బీసీ సంక్షేమానికి కేటాయిస్తామన్న రూ.20 వేల కోట్లు ఏమయ్యాయని నిలదీశారు. తులం బంగారం ఇస్తామని నమ్మించి, ఇప్పుడు ప్రజల చెవిలో పువ్వులు పెట్టారని ఎద్దేవా చేశారు. బడ్జెట్ లో బీసీల వాటాను భారీగా తగ్గించడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని, ప్రభుత్వం బీసీల పట్ల అనుసరిస్తున్న మొండి వైఖరికి త్వరలోనే ఆ వర్గాల నుంచి తీవ్ర ఆగ్రహం ఎదుర్కోక తప్పదని ఆయన హెచ్చరించారు.గత కేసీఆర్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేయడం హాస్యాస్పదమని గంగుల విమర్శించారు. ఒకవైపు రేషన్ కార్డులు ఇచ్చామని చెబుతూనే, మరోవైపు కేసీఆర్ హయాంలో కొత్త కార్డులు ఇవ్వలేదని అబద్ధాలు ఆడటం ప్రభుత్వ డొల్లతనానికి నిదర్శనమన్నారు. కేవలం బీసీలకే కాకుండా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బడ్జెట్ లలో కూడా భారీగా కోతలు విధించారని ఆయన ఆరోపించారు. బీసీల ఆత్మగౌరవ భవనాల కోసం కేటాయించిన భూములను లాగేసుకునే ప్రయత్నాలను మానుకోవాలని, లేనిపక్షంలో ప్రభుత్వం బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని స్పష్టం చేశారు.

# కుంభకోణాల కోసమే ఈ బడ్జెట్

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :




తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్ పై ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం ప్రారంభించగానే, ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేకమని, ప్రజలను వంచించేలా ఉందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ సభ్యులు సభలో నినాదాలు చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ బడ్జెట్ ప్రతులను చింపివేసి, సభ నుంచి వాకౌట్ చేయడంతో అసెంబ్లీలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది.ప్రభుత్వం ప్రజల 'చెవిలో పూలు' పెట్టి మోసం చేస్తోందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వినూత్నంగా తమ నిరసనను వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలందరూ చెవుల్లో పూలు పెట్టుకుని సభ వెలుపలికి వచ్చి శాసనసభ ప్రవేశ ద్వారం వద్ద ధర్నాకు దిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను విస్మరించిందని, బడ్జెట్ లో వాటి ఊసే లేదని మండిపడ్డారు. ఈ సందర్భంగా 'బడ్జెట్ మోసం.. మోసం' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు.మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ఈ బడ్జెట్ కేవలం కుంభకోణాల కోసమే రూపొందించినట్లు ఉందని ఆరోపించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ. 15 వేలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించిన ఆయన, పాత పద్ధతిలో ఇచ్చే రూ. 12 వేల గురించి కూడా బడ్జెట్ లో స్పష్టత లేకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది రైతులను దగా చేయడమేనని ఆయన ధ్వజమెత్తారు.ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి స్వయంగా హామీ ఇచ్చిన నెలకు రూ. 2,500 పథకం ఇప్పటికీ అమలు కాకపోవడంపై జగదీష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం చేపట్టి రెండున్నరేళ్లు గడుస్తున్నా ఆడబిడ్డలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని విమర్శించారు. అలాగే వృద్ధులకు రూ. 4 వేలు, వికలాంగులకు రూ. 6 వేల పింఛన్లు ఇస్తామని చెప్పి ఇప్పుడు మౌనంగా ఉండటం వృద్ధులను, దివ్యాంగులను వంచించడమేనని మండిపడ్డారు.నిరుద్యోగ యువతకు రెండు లక్షల ఉద్యోగాల హామీ ఇచ్చి వారి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు, ముఖ్యంగా పీఆర్సీ అమలుపై ఆరు నెలల్లో నిర్ణయం తీసుకుంటామని చెప్పి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ఈ బడ్జెట్ పూర్తిగా విఫలమైందని, యువతకు ఈ ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు.మొత్తానికి, ఈ బడ్జెట్ లో పేదలకు, రైతులకు, మహిళలకు ఎలాంటి న్యాయం జరగలేదని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. కేవలం కాంగ్రెస్ నాయకుల స్వప్రయోజనాల కోసమే కేటాయింపులు ఉన్నాయని, ప్రజాప్రయోజనాలను గాలికి వదిలేశారని విమర్శించారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని హామీల అమలుపై స్పష్టత ఇచ్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, ఈ బడ్జెట్ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని హెచ్చరించారు.

# డ్రోన్లు, హైస్పీడ్ బోట్లతో విపత్తులకు చెక్

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :



తెలంగాణ రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో 'స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్ మెంట్' ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విపత్తుల నిర్వహణలో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపేలా ఈ శిక్షణా కేంద్రాన్ని తీర్చిదిద్దాలని రెవెన్యూ , హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో డిజాస్టర్ మేనేజ్ మెంట్, ఫైర్ సర్వీసెస్, SDRF, హైడ్రా , ఐసీసీసీ విభాగాల ఉన్నతాధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసేందుకు ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమించాలని, ముఖ్యమంత్రితో చర్చించిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి వెల్లడించారు.విపత్తుల నివారణ , నిర్వహణలో ఈ సంస్థ ఒక 'పాలసీ సపోర్ట్' కేంద్రంగా పనిచేస్తుందని మంత్రి వివరించారు. అత్యవసర సమయాల్లో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించేందుకు వీలుగా డ్రోన్లు, హైస్పీడ్ బోట్లు వంటి అత్యాధునిక పరికరాలను త్వరలోనే కొనుగోలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్టేట్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ స్పెషల్ సీఎస్ దానకిశోర్, ఫైర్ డీజీ విక్రమాన్ సింగ్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఐసీసీసీ డైరెక్టర్ కమల్ హాసన్ రెడ్డి , ఇతర ఉన్నతాధికారులు పాల్గొని విపత్తుల ఎదుర్కొనే కార్యాచరణపై చర్చించారు.



## తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి
# సర్కార్ అండ

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

తెలంగాణ శాసనమండలిలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్ ను నీటిపారుదల, ఆహార , పౌరసరఫరాల శాఖ మంత్రి నల్గొండ ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర సంస్కృతి, అస్తిత్వం , సంప్రదాయ పండుగలను కాపాడటంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మన వారసత్వాన్ని ప్రతిబింబించే ఉత్సవాలకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తుందని ఆయన పేర్కొన్నారు.అంతేకాకుండా, విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నామని, రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు బడ్జెట్ లో ప్రాధాన్యత కల్పించామని మంత్రి తెలిపారు. విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. నీటిపారుదల రంగంతో పాటు సామాజిక ,విద్యా రంగాల అభివృద్ధికి ఈ బడ్జెట్ ఒక దిక్సూచిలా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.




## డిజిటల్ హంగులతో
# అంగన్‌వాడీలు

- రాష్ట్రవ్యాప్తంగా 5,008 కేంద్రాల అప్‌గ్రేడ్

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న 'మిషన్ సక్షం అంగన్‌వాడీ పోషణ్ అభియాన్' కింద తెలంగాణలోని 5,008 అంగన్‌వాడీ కేంద్రాలను 'సక్షం అంగన్‌వాడీలు'గా అప్‌గ్రేడ్ చేయనున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు . ఈ ఆధునికీకరణ పనుల కోసం కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి రూ. 30.04 కోట్లను కేటాయించిందని ఆయన తెలిపారు . సాధారణ అంగన్‌వాడీలతో పోలిస్తే ఈ 'సక్షం' కేంద్రాల్లో అత్యాధునిక మౌలిక వసతులు కల్పించనున్నారు. చిన్నారులకు డిజిటల్ విద్యను అందించేందుకు ఎల్ఈడి స్క్రీన్లు, పరిశుభ్రమైన తాగునీటి కోసం వాటర్ ఫిల్టరేషన్ వ్యవస్థ, నీటి సంరక్షణ గుంతలు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తారు. వీటితో పాటు పోషణ్ వాటిక, విజ్ఞానాన్ని పంచే పుస్తకాలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. 15వ ఆర్థిక సంఘం కాల పరిమితిలోగా దేశవ్యాప్తంగా 2 లక్షల కేంద్రాలను ఇలా తీర్చిదిద్దాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది . మౌలిక వసతులతో పాటు పోషకాహార లోపాన్ని అరికట్టేందుకు 'SNP' పథకం ద్వారా గర్భిణీలు, బాలింతలు, శిశువులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తున్నారు. ముఖ్యంగా పిల్లల్లో రక్తహీనతను తగ్గించేందుకు అంగన్‌వాడీలకు ఫోర్టిఫైడ్ రైస్ సరఫరా చేస్తున్నారు. అలాగే వారానికి కనీసం ఒకసారి చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ఆధునికీకరణ వల్ల రాష్ట్రంలోని లక్షలాది మంది చిన్నారులకు, తల్లులకు మెరుగైన సేవలు అందనున్నాయి.



# ఇది మాయా ఫకీర్ల బడ్జెట్'

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా అప్పుల మీదనే ఆధారపడి ఉందని, ఇది వాస్తవికతకు దూరంగా ఉన్న 'మాయా ఫకీర్ల బడ్జెట్ ' అని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. విద్యాశాఖకు 15% నిధులు ఇస్తామని గత మూడు బడ్జెట్లలోనూ మాట తప్పారని, ఇది ప్రజలను వంచించడమేనని ఆయన మండిపడ్డారు. బడ్జెట్ లో ఎన్నికల హామీల అమలు ప్రస్తావన లేదని, నిరుద్యోగులను ,మహిళలను ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందని విమర్శించారు. ఉద్యోగ క్యాలెండర్ ఊసే లేదని, కాంగ్రెస్ నేతలు ప్రజా సమస్యలను వదిలేసి ఢిల్లీ టూర్లకే పరిమితమవుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు.ముస్లింలతో పోలిస్తే బీసీలకు ఈ బడ్జెట్ లో తీవ్ర అన్యాయం జరిగిందని మహేశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ అంకెలన్నీ ఊహాజనితంగా ఉన్నాయని, క్షేత్రస్థాయిలో ప్రజలకు కలిగే ప్రయోజనం శూన్యమని కొట్టిపారేశారు. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇలాంటి అంకెల గారడీకి తెరలేపిందని ఆయన విమర్శించారు.ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ, ఈ బడ్జెట్ లో బీసీ సబ్ ప్లాన్ ప్రస్తావన లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. ప్రభుత్వం బీసీలను పూర్తిగా విస్మరించిందని, తెలంగాణ ప్రజలను మోసం చేసేలా బడ్జెట్ రూపకల్పన జరిగిందని ఆయన ఆరోపించారు. బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపుతామని ఆయన స్పష్టం చేశారు. పెన్షనర్లు జమ చేసుకున్న డబ్బులు ఇవ్వని ప్రభుత్వం, విమాన ప్రమాదాల్లో మరణించిన వారికి రూ. 2 కోట్లు ఇస్తామనడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు.విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందక వారు హోటళ్లలో పనులు చేసుకునే దుస్థితి నెలకొందని, పంటల భీమా అమలుపై స్పష్టత లేదని పాయల్ శంకర్ మండిపడ్డారు. రైతు భరోసా గురించి ఎక్కడా ప్రస్తావించలేదని, ఇది కేవలం రైతులను వంచించే బడ్జెట్ మాత్రమేనని అన్నారు. తక్షణమే బడ్జెట్ లో సవరణలు చేసి, అన్ని వర్గాలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## రాశి ఫలాలు

**21-03-2026 శనివారం**

**మేషం:**
వృత్తి, ఉద్యోగాల్లోనే కాక, సామాజికంగా కూడా హోదా పెరిగే అవకాశం ఉంటుంది. ఆస్తి, ఆర్థిక సమస్యలు పరిష్కారం అవుతాయి. కొద్ది ప్రయత్నంతో ఆదాయం పెరగడం, ఆదాయ మార్గాలు విస్తరించడం జరుగుతుంది. ప్రభుత్వ ఉద్యోగులు, కళాకారులు బాగా రాణిస్తారు. రావలసిన డబ్బు వసూలై ముఖ్య మైన అవసరాలు తీరిపోతాయి.

**వృషభం:**
పట్టిందల్లా బంగారం అవుతుంది. ఈ మూడు రోజుల్లో ఎటువంటి ప్రయత్నం చేపట్టినా నెరవేరుతుంది. షేర్లు, స్పెక్యులేషన్లు, ఆర్థిక లావాదేవీలతో సహా అనేక మార్గాల్లో ఆదాయం వృద్ధి చెందే అవకాశం ఉంది. ఆర్థిక, వ్యక్తిగత సమస్యలు పరిష్కారమవుతాయి. వృత్తి, వ్యాపారాలు కొత్త పుంతలు తొక్కుతాయి.

**మిథునం:**
కొంతమంది కారణంగా చిన్న ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉంది. అయితే ధైర్యంగా, సానుకూల ఆలోచనలతో ముందుకు సాగితే సమస్యలు తగ్గుతాయి. ముఖ్య విషయాల్లో నిపుణుల సలహా తీసుకోవడం మేలు చేస్తుంది. అప్పుల విషయంలో జాగ్రత్త అవసరం.

**కర్కాటకం:**
వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలు సానుకూలంగా సాగిపోతాయి. అనుకున్న పనులు అనుకున్నట్టు పూర్తవుతాయి. ఇంటా బయటా అనుకూల పరిస్థితులుంటాయి. కుటుంబంలో ఒకటి రెండు శుభ పరిణామాలు చోటు చేసుకుంటాయి. ఆదాయం, ఆరోగ్యం బాగానే ఉంటాయి. ఆదాయ ప్రయ త్నాలు ఫలిస్తాయి.

**సింహం:**
వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలు బాగా అనుకూలంగా సాగుతాయి. కుటుంబపరంగా చిన్నా చితకా ఇబ్బందులు తప్పకపోవచ్చు. ఆర్థికంగా రోజంతా బాగానే గడిచిపోతుంది. వ్యక్తిగతంగా తప్పకుండా పురోగతి ఉంటుంది. కుటుంబంలో శుభ పరిణామాలు చోటు చేసుకుంటాయి.

**కన్య:**
వృత్తి, ఉద్యోగాలపరంగా అనుకూలతలు పెరుగుతాయి. అధికారుల నుంచి ప్రోత్సాహం ఉంటుంది. ఇష్టమైన ప్రాంతాలకు బదిలీ అయ్యే అవకాశం ఉంది. వ్యాపారాలు నిలకడగా పురోగమిస్తాయి. వ్యక్తిగత జీవితంలో అనుకోకుండా కొన్ని చిక్కులు ఎదురవుతాయి.

**తుల:**
ఈ రాశివారికి సమయం బాగా అనుకూలంగా ఉంది. ఏ ప్రయత్నం అయినా సానుకూల ఫలితా లనిస్తుంది. వృత్తి, ఉద్యోగాలలో మీ సలహాలు, సూచనలకు విలువ ఉంటుంది. ముఖ్యంగా ఉద్యో గంలో మంచి గుర్తింపు లభిస్తుంది. వ్యాపారాల్లో కూడా మీ వ్యూహాలు సఫలం అవుతాయి. ఆదాయ మార్గాలు విస్తృతమవుతాయి.

**వృశ్చికం:**
వృత్తి, ఉద్యోగాల్లో కొద్దిగా పని ఒత్తిడి ఉండే అవకాశం ఉంది. కుటుంబ జీవితంలో సామరస్యం పెరుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు చాలావరకు చక్కబడతాయి. ఆదాయం అనుకూలంగా ఉన్నప్పటికీ ఆచితూచి ఖర్చు చేయడం మంచిది. వ్యాపారాలు ఆశాజనకంగా ముందుకు సాగుతాయి.

**ధనస్సు:**
వృత్తి, ఉద్యోగాలు చాలావరకు సాఫీగా, హ్యాపీగా సాగిపోతాయి. వ్యాపారాల్లో కొద్దిపాటి మార్పులను చేపట్టి ప్రయోజనం పొందుతారు. ఒకటి రెండు వ్యక్తిగత సమస్యలు పరిష్కారం అవుతాయి. కొత్త ఉద్యోగావకాశాలు మెరుగుపడడంతో పాటు, ఉద్యోగం మారే అవకాశాలు కూడా అనుకూలంగా సాగుతాయి.

**మకరం:**
వృత్తి, వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగిపోతాయి. కొత్త ఉద్యోగ ప్రయత్నాలు సఫలమవుతాయి. ముఖ్యమైన వ్యవహారాలను పూర్తి చేస్తారు. వ్యక్తిగత సమస్యల మీద దృష్టి పెట్టడం మంచిది. సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. రాజకీయ ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

**కుంభం:**
వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో శ్రమకు తగ్గ ఫలితం పొందుతారు. ప్రతి పనిలోనూ కొద్దిగా శ్రమ, తిప్పట ఉండవచ్చు. వ్యయ ప్రయాసలతో ముఖ్యమైన వ్యవహారాలు పూర్తవుతాయి. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం మంచిది. రాదనుకున్న డబ్బు కొద్ది ప్రయత్నంతో చేతికి అందుతుంది.

**మీనం:**
వృత్తి, ఉద్యోగాల్లో బాధ్యతలు పెరుగుతాయి. అధికారులు ఎక్కువగా ఆధారపడే అవకాశం ఉంది. వ్యాపారాల్లో లాభాలు నిలకడగా ఉంటాయి. కుటుంబ జీవితం ప్రశాంతంగా సాగిపోతుంది. సమాజంలో గౌరవ మర్యాదలకు లోటుండదు. దైవ కార్యాల్లోనూ, సామాజిక సేవల్లోనూ పాల్గొంటారు.

## మద్యం కేసులో ముప్పిడి అవినాశ్ రెడ్డికి బెయిల్



**న్యూఢిల్లీ: (ఏడీఎన్ఎన్):**

ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో ఏ7 నిందితుడిగా ఉన్న ముప్పిడి అవినాశ్ రెడ్డికి సుప్రీంకోర్టు శుక్రవారం రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో రిమాండ్‌లో ఉన్న ఆయనను ఇప్పటికే సిట్ అధికారులు మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించారు. విచారణ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో అవినాశ్ రెడ్డి త్వరలోనే జైలు నుంచి విడుదల కానున్నారు.ఈ కుంభకోణంలో నగదు బదిలీలు, ఆర్థిక వ్యవహారాల నియంత్రణలో అవినాశ్ రెడ్డి కీలక పాత్ర పోషించినట్లు దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్నాయి. ఈ కేసులో రాజ్ కేసీ రెడ్డి ఏ1 నిందితుడిగా ఉండగా, ఇప్పటికే పలువురు కీలక వ్యక్తులను సిట్ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కాగా, మద్యం విక్రయాల్లో జరిగిన అక్రమాలు, సిండికేట్ల వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించేందుకు సిట్ తన విచారణను మరింత వేగవంతం చేసింది.

# రంజాన్ వేళ ఆరా ఫౌండేషన్ 'సేవానిరతి'

- **20 వేల మందికి తాగునీటి సౌకర్యం!**

**పల్నాడు(ఏడీఎన్ఎన్):**




పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని చిలకలూరిపేట నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లిం సోదర సోదరీమణుల కోసం ఆరా ఫౌండేషన్ , తేజశ్వీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ & క్లినిక్స్ అండగా నిలిచాయి. ఈద్ ప్రార్థనల కోసం భారీ సంఖ్యలో తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం 20,000 కూలింగ్ వాటర్ బాటిళ్లను ఉచితంగా పంపిణీ చేయాలని ఆరా ఫౌండేషన్ చైర్మన్ ఆరా మస్తాన్ నిర్ణయించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, సామూహిక ప్రార్థనల తర్వాత భక్తులకు ఉపశమనం కలిగించడమే లక్ష్యంగా ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు.చిలకలూరిపేట పట్టణంలోని ప్రధాన ఈద్గాలతో పాటు పరిసర గ్రామాలలోని మస్జీద్ ల వద్ద ఈ తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. రంజాన్ మాసంలో పాటించే కఠిన ఉపవాస దీక్షల తర్వాత జరుపుకునే ఈ వేడుకలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతో ఆరా మస్తాన్ ఈ ముందస్తు ఏర్పాట్లు చేయించారు. ఇందుకోసం ప్రత్యేక వాలంటీర్ల బృందాన్ని నియమించి, ప్రార్థనలు ముగిసిన వెంటనే ప్రతి ఒక్కరికీ శీతల పానీయం అందేలా ప్రణాళిక సిద్ధం చేశారు.తేజశ్వీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ యాజమాన్యం మాట్లాడుతూ, సమాజ సేవలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని ఆరా ఫౌండేషన్‌తో కలిసి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పండుగ వేళ సోదరభావం చాటుతూ, భక్తుల దాహార్తిని తీర్చడం తమకు సంతోషాన్ని ఇస్తుందని వారు వెల్లడించారు. గతంలో కూడా ఆరా మస్తాన్ అనేక సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా స్థానికుల మన్ననలు పొందారు. ఇప్పుడు రంజాన్ వేళ ఇంత భారీ స్థాయిలో తాగునీటి ఏర్పాట్లు చేయడంపై ముస్లిం మత పెద్దలు , స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా ఆరా ఫౌండేషన్ చైర్మన్ ఆరా మస్తాన్ మాట్లాడుతూ,రంజాన్ పండుగ పవిత్రతకు, క్రమశిక్షణకు , సోదరభావానికి నిదర్శనమని , గత నెల రోజులుగా కఠిన ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులు, ఈ పండుగ రోజున సామూహిక ప్రార్థనల కోసం ఈద్గాలకు వచ్చే సమయంలో ఎండ తీవ్రత వల్ల ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు . సుమారు 20 వేల మందికి పైగా భక్తులకు చల్లని తాగునీరు అందించేలా మా వాలంటీర్లు అన్ని చోట్లా అందుబాటులో ఉంటారని ఆరా మస్తాన్ తెలియజేసారు

# జాబ్ కొట్టాలంటే ప్లానింగ్‌తో చదవాల్సిందే

**అమరావతి (ఏడీఎన్ఎన్):**




ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుంచి గ్రూప్1 నోటిఫికేషన్ విడుదల కావడంతో నిరుద్యోగ అభ్యర్థుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నోటిఫికేషన్ వెలువడటంతో అభ్యర్థులు పరీక్షకు సిద్ధం కావడంపై దృష్టి సారిస్తున్నారు. గ్రూప్1 ప్రిలిమ్స్‌కు సిద్ధమవుతున్న విద్యార్థుల్లో సాధారణంగా పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఎలా చదవాలి, ఏ అంశాలపై ఎక్కువగా దృష్టి పెట్టాలి, ఏ పుస్తకాలు ప్రామాణికం, ఎలా ప్రాక్టీస్ చేయాలి వంటి ప్రశ్నలు తరచుగా ఎదురవుతున్నాయి.విద్యార్థులు ముందుగా తమపై విశ్వాసం పెంపొందించుకోవడం అత్యంత కీలకం. 'తాను సాధించగలను' అనే నమ్మకం ఉంటేనే లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యమవుతుంది. ఆ తర్వాత క్రమబద్ధమైన ప్రణాళికతో నిరంతరంగా చదువును కొనసాగించడం అవసరం. అలాగే పరీక్షకు సిద్ధం అయ్యే సమయంలో సోషల్ మీడియాకు దూరంగా ఉండడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. పట్టుదల, సమయ పాలనతో కృషి చేస్తే గ్రూప్1లో విజయం సాధించడం సాధ్యమేనని వారు అభిప్రాయపడుతున్నారు.ఏపీపీఎస్సీ పరీక్షలపై గత కొన్నేళ్లుగా వివాదాలు తీవ్రంగా చెలరేగాయి. ముఖ్యంగా గ్రూప్1 మెయిన్స్ మూల్యాంకనంలో జరిగిన లోపాలు, హైకోర్టు జోక్యం, ప్రభుత్వంపై వచ్చిన విమర్శలు ఈ వ్యవహారాన్ని మరింత సంక్లిష్టం చేశాయి.ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్1 మెయిన్స్ పరీక్షల మూల్యాంకనంలో రెండు విధానాలు అనుసరించడం పెద్ద వివాదానికి దారితీసింది. మొదట డిజిటల్ సిస్టమ్ ద్వారా మూల్యాంకనం జరగగా, తర్వాత హైకోర్టు ఆదేశాల మేరకు మాన్యువల్ రీఎవాల్యుయేషన్ జరిగింది. ఈ మార్పుల వల్ల ఫలితాల్లో భారీ తేడాలు వచ్చాయి. సుమారు 62% మంది అభ్యర్థులు అనర్హులుగా మారినట్లు బయటపడటంతో విద్యార్థులు, ఉద్యోగార్థులు తీవ్ర నిరసనలు వ్యక్తం చేశారు.ఈ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. హైలాండ్ రిసార్ట్స్, మంగళగిరిలో 65 రోజులపాటు మూల్యాంకనం జరిగిందని చెప్పినా, నిజంగా ఏం జరిగిందో ప్రశ్నించింది. దాదాపు రూ.20 లక్షలు ఖర్చు చేసి, పోలీసు బలగాలను నియమించినా మూల్యాంకనం జరగలేదని కోర్టు వ్యాఖ్యానించింది. ఎపిపిఎస్సి కార్యదర్శి ఇచ్చిన ప్రకటనలపై కూడా కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది.ఇక 2018లో ఎంపికైన గ్రూప్1 అధికారుల నియామకాలపై కూడా వివాదం చెలరేగింది. హైకోర్టు ఆదేశాల మేరకు, ఈ అధికారులను కీలక పదవుల నుంచి తొలగించి, ఇతర సాధారణ పోస్టులకు బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై అధికారులు సుప్రీంకోర్టుకు వెళ్ళినా, సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పును సమర్థించింది. ముఖ్యమైన పదవులు కోరుకునే హక్కు అధికారులకు లేదని, ఎక్కడ పనిచేసినా వేతనం మాత్రం లభిస్తుందని స్పష్టం చేసింది

# కేవీ అడ్మిషన్లు ప్రారంభం.. లాటరీ ద్వారా ఎంపిక

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**




దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాల్లో (కెవిఎస్) 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైంది. చిన్నారులను నాణ్యమైన విద్యా వాతావరణంలో చేర్పించాలని భావిస్తున్న తల్లిదండ్రులకు ఇది మంచి అవకాశంగా మారింది.కేంద్రీయ విద్యాలయ సంఘటన్ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం, బాల్‌వాటిక, ఒకటో తరగతి ప్రవేశాల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు మార్చి 20 ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. ఆసక్తి గల తల్లిదండ్రులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ పిల్లలను నమోదు చేసుకోవచ్చు.ఈసారి అడ్మిషన్ ప్రక్రియను పూర్తిగా సరళీకరించారు. గతంలోలాగా రాత పరీక్షలు లేదా ఇంటర్వ్యూలు ఉండవని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా లాటరీ విధానం ద్వారా నిర్వహించబడుతుంది. దీంతో అన్ని వర్గాల విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించబడతాయని తెలిపారు.జాతీయ విద్యా విధానం ప్రకారం వయోపరిమితి జాతీయ విద్యా విధానం (NEP) మార్గదర్శకాల మేరకు పిల్లల వయస్సును ఆధారంగా తీసుకుని తరగతుల అర్హతను నిర్ణయించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి,బాల్‌వాటిక 1: 3 సంవత్సరాలు నిండి, 4 సంవత్సరాల లోపు,బాల్‌వాటిక2: 4 సంవత్సరాలు నిండి, 5 సంవత్సరాల లోపు,బాల్‌వాటిక3: 5 సంవత్సరాలు నిండి, 6 సంవత్సరాల లోపు,ఒకటో తరగతి: 6 సంవత్సరాలు నిండి, 8 సంవత్సరాల లోపు,పిల్లల వయస్సుకు అనుగుణంగా సరైన తరగతిలో నమోదు చేయాలని అధికారులు తల్లిదండ్రులకు సూచించారు.పారదర్శక విధానం.. తల్లిదండ్రుల్లో నమ్మకం లాటరీ విధానం ద్వారా అడ్మిషన్లు నిర్వహించడం వల్ల ఎలాంటి వివక్ష లేకుండా, పారదర్శకంగా ఎంపిక జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతో తల్లిదండ్రుల్లో విశ్వాసం పెరుగుతుందని భావిస్తున్నారు.మొత్తంగా, కేంద్రీయ విద్యాలయాల్లో అడ్మిషన్లు ప్రారంభం కావడంతో దేశవ్యాప్తంగా తల్లిదండ్రుల్లో ఆసక్తి నెలకొంది.

# చంద్రబాబు గారూ.. మీరు ఎప్పుడు ఇస్తారు ?

- సినీ అవార్డుల కోసం చిరంజీవి , ఆర్ నారాయణ మూర్తి వినతి
- చిరు పై టీడీపీ సోషల్ మీడియా ట్రోలింగ్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**




తెలంగాణ ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహించిన 'గద్దర్ అవార్డ్స్ ' వేదికపై మెగాస్టార్ చిరంజీవి , విలక్షణ నటుడు ఆర్.నారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ, సినీ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఉగాది పర్వదినాన జరిగిన ఈ వేడుకలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి సమక్షంలో చిరంజీవికి 'ఎన్టీఆర్ జాతీయ అవార్డు'ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, తెలంగాణలో కళాకారులకు దక్కుతున్న గుర్తింపును అభినందిస్తూనే, పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ కళాకారులను ప్రోత్సహించే విషయంలో వెనుకంజలో ఉందని అభిప్రాయపడ్డారు. చిత్ర పరిశ్రమకు ఎంతో సన్నిహితుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిని స్ఫూర్తిగా తీసుకుని, ఏపీలో కూడా ఇండస్ట్రీకి మరింత ప్రోత్సాహం అందించాలని ఆయన కోరారు. చిరంజీవి వ్యాఖ్యలకు మద్దతుగా ఆర్.నారాయణమూర్తి కూడా ఆవేశంగా స్పందిస్తూ, ఏపీలో నిలిచిపోయిన నంది అవార్డులను వెంటనే పునరుద్ధరించి తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఉనికిని కాపాడాలని డిమాండ్ చేశారు.అయితే, చిరంజీవి చేసిన ఈ విమర్శలపై తెలుగుదేశం పార్టీ అనుకూల సోషల్ మీడియా వేదికల నుంచి గట్టి కౌంటర్ వస్తోంది. ఒక రాష్ట్రానికి చెందిన అధికారిక అవార్డుల వేదికపై ఉండి వేరే రాష్ట్రాన్ని వేలెత్తి చూపడం సభా మర్యాద కాదని వారు వాదిస్తున్నారు. ఏపీ ప్రభుత్వం చిత్ర పరిశ్రమ కోరిన వెంటనే టికెట్ ధరల పెంపునకు సహకరిస్తోందని, గతంలో చర్చల కోసం ముఖ్యమంత్రి సమయం కేటాయించినా ఇండస్ట్రీ పెద్దలు షూటింగుల సాకుతో రాలేదని గుర్తు చేస్తున్నారు. స్వయంగా ఏపీకి చెందిన చిరంజీవి గారు వైజాగ్‌లో స్టూడియో నిర్మిస్తానని చెప్పి ఎందుకు అడుగులు వేయలేదని, తన సొంత రాష్ట్ర అభివృద్ధిలో ఆయన పాత్ర ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సొంత అన్నయ్యే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇప్పుడు రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నంది అవార్డుల పునరుద్ధరణపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

# పెళ్లి పేరుతో మహిళల అక్రమ రవాణా

**కొమురంభీం (ఏడీఎన్ఎన్):**



కొమురంభీం జిల్లాలో పెళ్లి పేరుతో మహిళల అక్రమ రవాణా జరుగుతోందన్న ప్రచారం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపుతోంది. పేదరికాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు దళారులు, మహిళలను మోసం చేసి పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.జిల్లాలోని బెజ్జూరు మండలం నుంచి ఉపాధి కోసం మంచిర్యాలకు వెళ్లిన ఇద్దరు మహిళలను కొందరు వ్యక్తులు పరిచయం చేసుకుని, పెళ్లి చేస్తామని నమ్మించారు. అనంతరం వారి ఫోన్లు స్వాధీనం చేసుకుని, వారిని ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు తీసుకెళ్లినట్లు సమాచారం.కొద్దిరోజులుగా మహిళల నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, వారిని ఇతర రాష్ట్రాల వ్యక్తులు వివాహం చేసుకుని తమ గ్రామాలకు తీసుకెళ్లినట్లు గుర్తించారు.ఈ ఘటనలో సంబంధిత వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. ఇదే తరహా ఘటన గత ఏడాది జూన్‌లో ఆసిఫాబాద్ జిల్లాలో కూడా చోటుచేసుకోవడం గమనార్హం.



## కుటుంబ సమేతంగా తిరుమలకు సీఎం చంద్రబాబు

**తిరుమల (ఏడీఎన్ఎన్):**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన మనవడు దేవాన్ష్ పుట్టినరోజును పురస్కరించుకుని కుటుంబ సమేతంగా తిరుమల పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. శుక్రవారం సాయంత్రమే చంద్రబాబు, భువనేశ్వరి, బ్రాహ్మణి , దేవాన్ష్ తిరుమల చేరుకోగా, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ రాత్రికి అక్కడికి చేరుకున్నారు. తిరుపతి విమానాశ్రయంలో లోకేశ్‌కు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలకగా, తిరుమలలో మంత్రులు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు , ఉన్నతాధికారులు సాదరంగా ఆహ్వానించారు. శనివారం దేవాన్ష్ పుట్టినరోజు కావడంతో, నారా కుటుంబం అంతా కలిసి ఉదయం శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు. తిరుమలలోని గాయత్రీ అతిథి గృహంలో సీఎం కుటుంబం బస చేశారు . నారా లోకేశ్ కుమారుడు దేవాన్ష్ పుట్టినరోజున తిరుమల శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు విరాళం ఇవ్వడం నారా కుటుంబానికి ఒక ఆనవాయతీగా వస్తోంది. అదే సంప్రదాయాన్ని పాటిస్తూ, ఈ ఏడాది కూడా ఒకరోజు అన్నవితరణకు అయ్యే ఖర్చు సుమారు రూ. 44 లక్షలను టీటీడీకి విరాళంగా సమర్పించనున్నారు. ఈ పర్యటన పూర్తిగా వ్యక్తిగతమైనదని, మనవడి పుట్టినరోజు వేడుకలను ఏటా స్వామివారి సన్నిధిలోనే జరుపుకోవడం తమ ఆచారమని కుటుంబ సభ్యులు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా జిల్లా యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయడమే కాకుండా, సాధారణ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.



## మరో రెండు రోజులు వర్షా లు.. ప్రజలకు హెచ్చరిక

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

రాష్ట్రంలో ఉపరితల ఆవర్తన ద్రోణి, నైరుతి గాలుల ప్రభావంతో వచ్చే రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశముందని హెచ్చరించింది. అలాగే కామారెడ్డి, సిద్ధిపేట, జనగాం జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలతో పోలిస్తే 2 నుంచి 4 డిగ్రీల వరకు తగ్గే అవకాశముందని తెలిపింది.ఇప్పటికే రాష్ట్రంలో వర్షాల ప్రభావం కనిపిస్తోంది. వనపర్తి జిల్లాలో పిడుగుపాటుకు 27 ఏళ్ల రైతు రాములు మృతి చెందగా, వికారాబాద్ జిల్లాలో సుమారు 300 మేకలు మృత్యువాత పడ్డాయి. రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో మక్క పంట తీవ్రంగా దెబ్బతింది.ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈదురు గాలుల కారణంగా ఇళ్ల పైకప్పులు ఎగిరిపోవడంతో పాటు విద్యుత్ సరఫరా కూడా అంతరాయం కలిగింది.శుక్రవారం కూడా రాష్ట్రంలోని కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



## స్వగ్రామం నుంచి కేసీఆర్‌కు ఆహ్వానం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆయన స్వగ్రామమైన చింతమడక వాసులు కలుసుకున్నారు. సిద్ధిపేట జిల్లా, రూరల్ మండలంలోని చింతమడకలో ఈ నెల 25, 27 తేదీల్లో నిర్వహించనున్న శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవంతో పాటు శ్రీరామ నవమి వేడుకలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనను ఆహ్వానించారు.ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల వంశీధర్ రావు ఆధ్వర్యంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు. అనంతరం కేసీఆర్‌ను శాలువాతో సత్కరించి గౌరవపూర్వకంగా ఆహ్వానించారు. తమ ఊరి బిడ్డగా, తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా ఈ పవిత్ర కార్యక్రమాల్లో కేసీఆర్ పాల్గొనాలని గ్రామస్తులు కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కేసీఆర్, గ్రామస్తులతో కాసేపు ముచ్చటించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

## సుప్రీం కోర్టులో మెడికల్ సీట్ల పంచాయితీ

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**



తెలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న పీజీ మెడికల్ సీట్ల భర్తీ వ్యవహారం ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానానికి చేరింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని మెడికల్ కాలేజీల్లో మిగిలిపోయిన సీట్లను భర్తీచేసేందుకు కౌన్సెలింగ్ గడువును పెంచాలని కోరుతూ వైద్య విద్యా కళాశాలల యాజమాన్యాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. ఫిబ్రవరి 28తో కౌన్సెలింగ్ గడువు ముగిసినప్పటికీ, ఇప్పటికీ ఏపీలో 246, తెలంగాణలో 377 పీజీ సీట్లు భర్తీకాకుండా ఖాళీగా ఉన్నాయని యాజమాన్యాల తరఫు న్యాయవాదులు జస్టిస్ పీఎస్ నర్సింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. వీటిలో ఏపీకి సంబంధించి సుమారు 45 కన్వీనర్ కోటా సీట్లు కూడా ఉన్నాయని, విద్యార్థులు చేరేందుకు సిద్ధంగా ఉన్నా గడువు ముగియడం వల్ల కౌన్సెలింగ్ నిలిచిపోయిందని కోర్టుకు వివరించారు.గడువు పొడిగింపు విషయమై జాతీయ మెడికల్ కమిషన్ కి ముందే విజ్ఞప్తి చేసినా ఎటువంటి స్పందన రాలేదని, గతంలో కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఇలాంటి పరిస్థితుల్లో గడువు పెంచిన దాఖలాలు ఉన్నాయని న్యాయవాదులు ధర్మాసనానికి విన్నవించారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన సుప్రీం కోర్టు, దీనిపై వివరణ ఇవ్వాలని జాతీయ మెడికల్ కమిషన్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను సోమవారంకి వాయిదా వేసింది. ఈ తీర్పుపైనే తెలుగు రాష్ట్రాల్లో నివందలాది మంది వైద్య విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంది.




## రాజస్థాన్ రాయల్స్ షాకింగ్ నిర్ణయం: రూ. 16 వేల కోట్ల బిడ్‌కు 'నో'!

**క్రికెట్ చరిత్రలో ఖరీదైన డీల్స్.. వేల కోట్లల్లో ఐపీఎల్ జట్ల ధర!**

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

ఐపీఎల్ 2026సీజన్ ప్రారంభానికి ముందే ఫ్రాంచైజీల అమ్మకాలు, కళ్లు చెదిరే బిడ్డింగ్‌లతో క్రికెట్ ప్రపంచం కళకళలాడుతోంది. ముఖ్యంగా రాజస్థాన్ రాయల్స్ ,రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల విలువపై వస్తున్న వార్తలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీని కొనుగోలు చేసేందుకు వచ్చిన భారీ ఆఫర్‌ను ఆ జట్టు యాజమాన్యం తిరస్కరించడం ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. యూఎస్, కెనడా కేంద్రంగా పనిచేసే ఇన్వెస్ట్ మెంట్ బ్యాంకింగ్ సంస్థ కొలంబియా పసిఫిక్ క్యాపిటల్ పార్ట్‌నర్స్ రాజస్థాన్ రాయల్స్ కొనుగోలు కోసం ఏకంగా 1.7 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 16,000 కోట్లు) బిడ్ వేసింది. కేవలం రెండు వారాల్లోనే మొత్తం సొమ్ము చెల్లిస్తామని ఆ సంస్థ వ్యవస్థాపక భాగస్వాములు నిశా సన్దేవ, దుల్జీత్ గుప్తా హామీ ఇచ్చారు. అయితే, భవిష్యత్తులో ఫ్రాంచైజీ విలువ ఇంకా పెరుగుతుందని భావించిన రాజస్థాన్ రాయల్స్ బోర్డు ఈ భారీ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించింది. రాజస్థాన్ రాయల్స్ నిర్ణయంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీ విలువపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇప్పటికే డియాజియో సంస్థ ఆర్‌సీబీని విక్రయించే ప్రక్రియను తుది దశకు చేర్చింది. రాజస్థాన్ రాయల్స్‌కు వచ్చిన బిడ్ కంటే ఆర్‌సీబీ విలువ 1520 శాతం అధికంగా ఉండే అవకాశం ఉంది. అంటే, ఆర్‌సీబీ విక్రయం దాదాపు రూ. 18,000 కోట్ల నుంచి రూ. 20,000 కోట్ల మధ్య జరిగే అవకాశం ఉంది. ఆర్సీబీ రేసులో మణిపాల్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ రంజన్ పాయ్, స్వీడిష్ సంస్థ ముందంజలో ఉన్నట్లు సమాచారం. ఇండియన్ ప్రీమియర్ లీగ్ కేవలం ఒక క్రీడ మాత్రమే కాదు, అది ఒక అపారమైన వ్యాపార సామ్రాజ్యం అని మరోసారి నిరూపితమైంది.



## రోహిత్-కోహ్లీలపై బీసీసీఐ కీలక నిర్ణయం

**20 మందితో బీసీసీఐ షార్ట్ లిస్ట్.. ఐపీఎల్ ప్రదర్శనే ఫైనల్!**

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

ఐసీసీ టోర్నీలలో టీమిండియా వరుస విజయాల పరంపరను కొనసాగిస్తున్న వేళ, 2027 వన్డే ప్రపంచకప్ కోసం బీసీసీఐ (BCCI) అప్పుడే కసరత్తులు ప్రారంభించింది. భారత క్రికెట్ దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల భవితవ్యంపై బీసీసీఐ కీలన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే టీ20లకు స్వస్తి పలికిన ఈ ఇద్దరు సీనియర్లు, వన్డే ప్రపంచకప్2027 ఆడతారా లేదా అన్నది చర్చనీయాంశంగా మారింది. గతేడాది వన్డే ఫార్మాట్‌లో అద్భుతంగా రాణించిన ఈ ఇద్దరూ, తాము ఇంకా ఫామ్‌లో ఉన్నామని సంకేతాలు ఇచ్చారు. అయితే ఐపీఎల్‌లో వీరిద్దరి బ్యాటింగ్ తీరును సెలక్టర్లు ప్రత్యేకంగా గమనించనున్నారు. యువ రక్తాన్ని ప్రోత్సహించాలా లేక అనుభవజ్ఞులైన రోకో ద్వయాన్ని కొనసాగించాలా అనే అంశంపై స్పష్టత రానుంది. 2024 టీ20 ప్రపంచకప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ, తాజాగా 2026 టీ20 ప్రపంచకప్.. ఇలా వరుసగా మూడు ఐసీసీ టైటిళ్లను ముద్దాడి టీమిండియా అజేయంగా నిలిచింది. ఇప్పుడు అందరి కళ్లు 2027 వన్డే ప్రపంచకప్‌పైనే ఉన్నాయి. ఈ మెగా టోర్నీకి ఇంకా 18 నెలల సమయం ఉన్నప్పటికీ, బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ నేతృత్వంలోని కమిటీ (ఎస్ఎస్ దాస్, ఆర్పీ సింగ్, అజయ్ రాత్రా, ప్రజ్ఞాన్ ఓజా) ఇప్పటికే 20 మంది ఆటగాళ్లను షార్ట్‌లిస్ట్ చేసినట్లు సమాచారం. ఈ ఎంపికలో ఐపీఎల్2026 ప్రదర్శన అత్యంత కీలకం కానుంది. ప్రతి సెలక్టర్ వారానికి కనీసం ఒక మ్యాచ్‌ను మైదానానికి వెళ్లి ప్రత్యక్షంగా వీక్షించాలని, తద్వారా ఆటగాళ్ల ఫిట్ నెస్, ఫామ్ ను నిశితంగా గమనించవచ్చని బీసీసీఐ భావిస్తోంది. షార్ట్‌లిస్ట్ చేసిన 20 మందిలో నిలకడగా రాణిస్తున్న యువ ఆటగాళ్లకు పెద్దపీట వేయాలని సెలక్టర్లు భావిస్తున్నారు. ఐపీఎల్‌లో మెరిసే కొత్త టాలెంట్‌ను కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. వన్డే ప్రపంచకప్ నాటికి ఒక పటిష్టమైన కోర్ టీమ్‌ను సిద్ధం చేయడమే లక్ష్యంగా బీసీసీఐ అడుగులు వేస్తోంది.

## జొమాటో కస్టమర్లకు షాక్

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**




ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో తన సేవా రుసుములను మరోసారి సవరించింది. తన ప్లాట్ ఫామ్ ద్వారా ఆర్డర్ చేసే ప్రతి కస్టమర్ నుంచి వసూలు చేసే 'ప్లాట్ ఫామ్ ఫీజు'ను సుమారు 19శాతం మేర పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పెరిగిన ధరలు తక్షణమే అమలులోకి వచ్చాయి. పాత ఫీజు ప్రతి ఆర్డర్‌కు రూ. 12.50 అయితే కొత్త ఫీజు ప్రతి ఆర్డర్‌కు రూ. 14.90. దీనితో అదనపు భారం రూ. 2.40 పెరిగింది. వినియోగదారులు చెల్లించాల్సిన మొత్తం దాదాపు రూ. 18 వరకు ఉండవచ్చు. ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగడం డెలివరీ వ్యయాన్ని ప్రభావితం చేస్తోంది. పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల వల్ల డెలివరీ భాగస్వాముల నిర్వహణ ఖర్చులు పెరిగాయని, ఆ భారాన్ని తగ్గించుకోవడానికి కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. సెప్టెంబర్ 2025 తర్వాత జొమాటో ఫీజును పెంచడం ఇదే తొలిసారి. జొమాటోకు ప్రధాన పోటీదారు అయిన స్విగ్గీ ఇప్పటికే అన్ని పన్నులతో కలిపి రూ. 14.99 ప్లాట్‌ఫామ్ ఫీజును వసూలు చేస్తోంది. సాధారణంగా ఈ రెండు సంస్థలు ఒకరి ధరలను మరొకరు అనుసరిస్తూ మార్కెట్‌లో సమతుల్యత పాటిస్తుంటాయి. బెంగళూరులో కొత్తగా ప్రారంభమైన ర్యాపిడో ఫుడ్ డెలివరీ సర్వీస్ 'ఓన్లీ'.. ఎటువంటి ప్లాట్ ఫామ్ ఫీజు లేదా రెస్టారెంట్ కమీషన్లు వసూలు చేయబోమని ప్రకటించింది. ఇది మార్కెట్ లో ఉన్న జొమాటో, స్విగ్గీలపై ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. జొమాటో రోజుకు సుమారు 2.2 మిలియన్లకు పైగా ఆర్డర్లను ప్రాసెస్ చేస్తుంది. ఈ చిన్న పెంపు ద్వారా కంపెనీకి నెలకు అదనంగా రూ. 15 కోట్ల నుండి రూ.18 కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉంది. అయితే, నిరంతరం పెరుగుతున్న ఈ అదనపు ఛార్జీలు మధ్యతరగతి వినియోగదారుల బడ్జెట్ పై భారీ ప్రభావం చూపుతున్నాయి.

## ఐపీఎల్ కామెంటరీ బాక్స్ లో 'కోట్ల' వర్షం

**టాప్ కామెంటేటర్ల సంపాదన ఇదే!**

ఐపీఎల్ 2026 సీజన్ ముంగిట మైదానంలో ఆటగాళ్లే కాదు, మైక్ పట్టుకుని అలరించే కామెంటేటర్ల పారితోషికాలు కూడా హాట్ టాపిక్‌గా మారాయి. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL) అంటే కేవలం సిక్సర్లు, బౌండరీల మోత మాత్రమే కాదు.. అది అపర కుబేరుల వేదిక. మైదానంలో ఆటగాళ్లు కోట్లు గడిస్తుంటే, కామెంటరీ బాక్స్ లో కూర్చుని తమ మాటలతో మ్యాచ్‌కు ప్రాణం పోసే కామెంటేటర్లు కూడా తక్కువేమీ తినడం లేదు. ప్రపంచంలోనే అత్యంత ధనిక లీగ్ అయిన ఐపీఎల్‌లో కామెంటేటర్ల పారితోషికాలు ఇప్పుడు సామాన్యులను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. భారత క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్‌కు కామెంటరీ రంగంలో తిరుగులేని డిమాండ్ ఉంది. లోతైన విశ్లేషణ, నిక్కచ్చిగా మాట్లాడే తత్వంతో అలరించే గవాస్కర్, ఒక్కో ఐపీఎల్ సీజన్‌కు సుమారు రూ. 4.17 కోట్లు



పారితోషికంగా అందుకుంటున్నట్లు సమాచారం. ఇంగ్లీష్ కామెంటరీ ప్యానెల్‌లో ఆయన అత్యంత ఖరీదైన కామెంటేటర్‌గా కొనసాగుతున్నారు. గవాస్కర్ సరసన అంతర్జాతీయ దిగ్గజాలు కూడా భారీగానే వెనకేస్తున్నారు. తనదైన శైలిలో విశ్లేషణలు చేసే ఆస్ట్రేలియాకు చెందిన మ్యాథ్యూ హేడన్ కూడా గవాస్కర్ తో సమానంగా సీజన్‌కు దాదాపు రూ. 4.17 కోట్లు అందుకుంటున్నారు. వెస్టిండీస్ మాజీ పేసర్ ఇయాన్ బిషప్ గంభీరమైన స్వరం, ఉత్కంఠభరితమైన కామెంటరీకి కూడా ఇదే స్థాయిలో డిమాండ్ ఉంది. కామెంటరీ అనేది కేవలం స్కోరు చెప్పడం మాత్రమే కాదు. మ్యాచ్‌లోని వ్యూహాలను సామాన్యులకు వివరించడం, ఉత్కంఠభరిత క్షణాల్లో ప్రేక్షకుడి భావోద్వేగానికి కనెక్ట్ అవ్వడం వీరి బాధ్యత. అందుకే వీరి అనుభవం, భాషా నైపుణ్యం, అంతర్జాతీయ స్థాయిలో ఉన్న గుర్తింపును బట్టి బ్రాడ్‌కాస్టింగ్ సంస్థలు స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా భారీ మొత్తాలను వెచ్చిస్తున్నాయి. ప్రస్తుతం ఐపీఎల్ ప్రసారాలు టీవీతో పాటు డిజిటల్ ప్లాట్ ఫామ్స్ లోనూ అందుబాటులో ఉండటంతో, వివిధ భాషల్లో కామెంటరీకి ఆదరణ పెరిగింది. హిందీ, తెలుగు, తమిళం వంటి ప్రాంతీయ భాషల్లో కామెంటరీ చేసే మాజీ క్రికెటర్లు కూడా లక్షల్లో, కోట్లలో పారితోషికాలు అందుకుంటున్నారు. మైదానంలో పరుగులు కురిస్తే, కామెంటరీ బాక్స్ లో మాటల విలువకు కూడా కోట్లు కుమ్మరిస్తున్నారు.

## సంజూ లేని లోటు తీర్చలేం: రియాన్ పరాగ్

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ ప్రారంభానికి ముందే రాజస్థాన్ రాయల్స్ క్యాంప్‌లో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. జట్టుకు సుదీర్ఘకాలం సారథ్యం వహించిన సంజు శాంసన్ ఈసారి చెన్నై సూపర్ కింగ్స్ గూటికి చేరడంతో, రాయల్స్ పగ్గాలను యువ ఆటగాడు రియాన్ పరాగ్ అందుకున్నాడు. ఈ నేపథ్యంలో పరాగ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. తన గురువు, మాజీ కెప్టెన్ సంజు శాంసన్ గురించి రియాన్ పరాగ్ ఉద్వేగభరితంగా మాట్లాడాడు. "భారత జట్టులో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల స్థానాలను భర్తీ చేయడం ఎంత అసాధ్యమో, రాజస్థాన్ రాయల్స్‌లో సంజు భయ్యా లోటును పూడ్చడం కూడా అంతే అసాధ్యం. అతని స్థానంలో మరొకరిని ఆడించొచ్చు కానీ, అతని వ్యక్తిత్వాన్ని, నైపుణ్యాన్ని రీప్లేస్ చేయడం ఎవరికీ సాధ్యం కాదు. అతను జట్టుకు అందించిన సేవలు వెలకట్టలేనివి" అని పరాగ్ స్పష్టం చేశాడు. ఈ సీజన్‌లో యశస్వి జైశ్వాల్‌తో కలిసి 14 ఏళ్ల సంచలనం వైభవ్ సూర్య



వంశీ ఇన్నింగ్స్ ప్రారంభించనున్నట్లు పరాగ్ వెల్లడించాడు. "వైభవ్ తన సహజ సిద్ధమైన దూకుడును ప్రదర్శించాలి. ఒత్తిడిని జైశ్వాల్ చూసుకుంటాడు. వైభవ్ కేవలం తన ఆటను ఆస్వాదిస్తూ, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని కోరుకుంటున్నాను" అని పరాగ్ సూచించాడు. మార్చి 28 నుంచి ప్రారంభం కానున్న ఈ సీజన్‌లో రాయల్స్ సరికొత్త వ్యూహాలతో బరిలోకి దిగుతున్నట్లు తెలిపాడు. రాజస్థాన్ రాయల్స్ చీఫ్ కోచ్ కుమార సంగక్కర జట్టు కూర్పుపై ధీమా వ్యక్తం చేశారు. "ప్రపంచకప్ విజేత జట్టు సభ్యులు మా దగ్గర లేరని మేం చింతించడం లేదు. అందుబాటులో ఉన్న ఆటగాళ్లపై మాకు పూర్తి నమ్మకం ఉంది. ముఖ్యంగా రవీంద్ర జడేజా మా జట్టులోకి రావడంతో బౌలింగ్ విభాగం మరింత పటిష్టమైంది. ఈసారి బ్యాటింగ్ డెప్త్‌తో పాటు దేశీయ స్పిన్నర్లు, ఆల్ రౌండర్లపై ప్రత్యేక దృష్టి సారించాం" అని సంగక్కర వివరించారు.

## రూ. 9 లక్షల కోట్లతో అమెజాన్ బాస్ ఏఐ విప్లవం!

- **జెఫ్ బెజోస్ మాస్టర్ ప్లాన్ 'ప్రాజెక్ట్ ప్రోమెథియస్**

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

ప్రపంచ కుబేరుడు, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ మరో సంచలనానికి తెరతీశారు. కేవలం సాఫ్ట్‌వేర్, ఈకామర్స్ రంగాలకే పరిమితం కాకుండా, భౌతిక ఉత్పత్తి రంగంలోనూ ఏఐ జెండా పాతేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం ఆయన ఏకంగా 100 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 9 లక్షల కోట్లు) భారీ నిధిని సమీకరిస్తున్నట్లు 'వాల్ స్ట్రీట్ జర్నల్' తాజా నివేదికలో వెల్లడించింది. జెఫ్ బెజోస్ సహసీఈఓగా వ్యవహరిస్తున్న 'ప్రాజెక్ట్ ప్రోమెథియస్' అనే స్టార్టప్ ఈ భారీ ప్రణాళికలో కీలక పాత్ర పోషించనుంది. డిఫెన్స్, ఏరోస్పేస్, సెమీకండక్టర్స్ వంటి కీలక రంగాల్లోని పాత తరహా కంపెనీలను కొనుగోలు చేయడం. ఇలా కొనుగోలు చేసిన కంపెనీల ఫ్యాక్టరీలు, వేర్‌హౌస్‌లలో మానవ వనరుల అవసరాన్ని తగ్గించి, వాటి స్థానంలో అత్యాధునిక ఏఐ, రోబోటిక్ వ్యవస్థలను



ప్రవేశపెట్టడం. ఇంజనీర్లు, కార్మికులు చేసే పనులను ఏఐ సాఫ్ట్‌వేర్, యంత్రాల ద్వారా మరింత వేగంగా, తక్కువ ఖర్చుతో పూర్తి చేయడం. ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే, వస్తువుల డిజైన్ నుంచి తయారీ వరకు ప్రతి దశలోనూ ఏఐ ప్రమేయం ఉంటుంది. ఉదాహరణకు, ఒక విమానం రెక్కల చుట్టూ గాలి ప్రవాహం ఎలా ఉంటుందో లేదా ఒక లోహపు భాగం ఎక్కడ విరిగిపోయే అవకాశం ఉందో ఏఐ ముందే ఊహించి, లోపాల్ని సరిదిద్దుతుంది. దీనివల్ల కంపెనీల లాభదాయకత పెరగడమే కాకుండా, సిబ్బందిపై ఆధారపడటం గణనీయంగా తగ్గుతుంది. ఈ మెగా ఫండ్ కోసం జెఫ్ బెజోస్ ఇప్పటికే మధ్యప్రాచ్య దేశాల సార్వభౌమ నిధులతో పాటు సింగపూర్ వంటి దేశాల్లోని ప్రముఖ ఇన్వెస్టర్లతో చర్చలు జరుపుతున్నారు. ఇది సాఫ్ట్ బ్యాంక్ యొక్క ప్రసిద్ధ 'విజన్ ఫండ్' స్థాయిలోనే అతిపెద్ద పెట్టుబడి నిధిగా అవతరించనుంది. ఇప్పటికే కోడింగ్, కంటెంట్ రైటింగ్ వంటి ఆఫీస్ పనుల్లో ఏఐ ప్రభావం కనిపిస్తుండగా, ఇప్పుడు బెజోస్ ప్లాన్‌తో వేర్‌హౌస్‌లు, ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికుల భవితవ్యంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మనుషుల ప్రమేయం లేకుండా నిరంతరాయంగా పనిచేసే రోబోటిక్ ఫ్యాక్టరీల దిశగా ప్రపంచం వేగంగా అడుగులు వేస్తోంది. జెఫ్ బెజోస్ స్వయంగా ఈ ప్రాజెక్ట్‌కు నాయకత్వం వహిస్తుండటం వల్ల, ఇది ప్రపంచ తయారీ రంగంపైనే కాకుండా ఉద్యోగ విపణిపై కూడా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి.

## ఐసీఐసీఐ బ్యాంక్‌కు జీఎస్టీ షాక్

- **రూ. 769 కోట్ల చెల్లింపులకు జీఎస్టీ నోటీసులు**

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

దేశీయ ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్‌కు భారీ షాక్ తగిలింది. పన్నుల రూపంలో కొత్త చిక్కులు వచ్చి పడ్డాయి. పన్ను చెల్లింపుల్లో వ్యత్యాసాలు ఉన్నాయంటూ జీఎస్టీ విభాగం ఏకంగా రూ. 769 కోట్ల డిమాండ్ నోటీసులను జారీ చేసింది. ముంబై ఈస్ట్ కమిషనరేట్‌కు చెందిన సెంట్రల్ ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్ కార్యాలయం నుంచి ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. సాధారణంగా బ్యాంకులు తమ ఖాతాదారుల అకౌంట్‌లో మినిమం బ్యాలెన్స్ ఉన్నప్పుడు కొన్ని రకాల సేవలను (ఉదాహ




రణకు చెక్ బుక్స్, ఏటీఎం లావాదేవీలు) ఉచితంగా అందిస్తుంటాయి. అయితే, ఈ ఉచిత సేవలకు కూడా ప్రతిఫలం ఉంటుందని, ఆ సేవల విలువపై జీఎస్టీ చెల్లించాలని పన్ను విభాగం వాదిస్తోంది. ఈ పాత వివాదమే ఇప్పుడు భారీ డిమాండ్ నోటీసులకు దారితీసింది. అసలు పన్ను డిమాండ్ సుమారు రూ. 384 కోట్లు కాగా.. పన్ను మొత్తానికి సమానమైన జరిమానాతో పాటు వడ్డీని కూడా కలిపి మొత్తం రూ.769 కోట్లుగా నిర్ణయించారు. ఈ నోటీసులపై ఐసీఐసీఐ బ్యాంక్ ధీటుగా స్పందించింది. దీనిపై చట్టపరంగా పోరాడుతామని బ్యాంక్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో స్పష్టం చేసింది. ప్రస్తుత డిమాండ్ మొత్తం ఎక్కువగా ఉన్నందున నిబంధనల ప్రకారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు నివేదించామని, అయితే ఇది బ్యాంక్ ఆర్థిక కార్యకలాపాలపై పెద్దగా ప్రభావం చూపదని యాజమాన్యం ధీమా వ్యక్తం చేసింది. నిర్ణీత గడువులోగా రిట్ పిటిషన్ దాఖలు చేయడం లేదా అప్పీలేట్ అథారిటీని ఆశ్రయించడం ద్వారా ఈ ఉత్తర్వులను సవాలు చేస్తాం. అంటూ బ్యాంక్ యాజమాన్యం వెల్లడించింది.

## సఫారీ గడ్డపై కివీస్ ఘనవిజయం


- **2-1 ఆధిక్యంలో న్యూజిలాండ్.. సౌతాఫ్రికా చిత్తు**

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న న్యూజిలాండ్ జట్టు మూడో టీ20లో అద్భుత విజయాన్ని నమోదు చేసి సిరీస్‌లో ఆధిపత్యాన్ని చాటుకుంది. బౌలింగ్ లో సఫారీలను కట్టడి చేసిన కివీస్, అనంతరం బ్యాటింగ్ లోనూ క్లాస్ ప్రదర్శనతో 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ లో న్యూజిలాండ్ 2 1తో ముందంజ వేసింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి కేవలం 136 పరుగులు మాత్రమే చేయగలిగింది. కివీస్ బౌలర్ల ధాటికి సఫారీ టాపార్డర్, మిడిలార్డర్ పేకమేడలా కూలిపోయింది. టెయిలెండర్ కొబాని మొకినా (26 నాటౌట్), జార్జ్ లిండే (23) పోరాడటంతో



దక్షిణాఫ్రికా ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. కివీస్ బౌలర్లలో కైల్ జేమీసన్, మిచెల్ సాంట్నర్, బెన్ సియర్స్ తలా రెండు వికెట్లతో సత్తా చాటారు. ముఖ్యంగా లోకీ ఫెర్గూసన్ తన వేగంతో పరుగులను నియంత్రించి ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టాడు. 137 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ కు ఓపెనర్లు శుభారంభాన్ని ఇచ్చారు. టామ్ లాథమ్, డెవాన్ కాన్వే (39) తొలి వికెట్ కు 96 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి విజయాన్ని ఖాయం చేశారు. టామ్ లాథమ్ 55 బంతుల్లో 63 పరుగులు (7 ఫోర్లు, 2 సిక్సర్లు) చేసి అజేయంగా నిలిచాడు. దీనితో 16.2 ఓవర్లలోనే కేవలం 2 వికెట్లు కోల్పోయి కివీస్ లక్ష్యాన్ని ఛేదించింది. పొదుపుగా బౌలింగ్ చేసి దక్షిణాఫ్రికా వెన్ను విరిచిన లోకీ ఫెర్గూసన్కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. సిరీస్ లో నిలవాలంటే దక్షిణాఫ్రికాకు తర్వాతి మ్యాచ్ అత్యంత కీలకం. ఇరు జట్ల మధ్య నాలుగో టీ20 మ్యాచ్ ఆదివారం జరగనుంది. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్ ను కైవసం చేసుకోవాలని కివీస్ భావిస్తుండగా, సిరీస్ ను సమం చేయాలని ప్రొటీస్ పట్టుదలతో ఉంది. న్యూజిలాండ్ జట్టు ప్రస్తుతం ఉన్న ఫామ్ చూస్తుంటే సిరీస్ గెలిచే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆదివారం జరిగే నాలుగో టీ20లో దక్షిణాఫ్రికా పుంజుకుంటుందేమో వేచి చూడాల్సిందే.



## ప్రపంచ అథ్లెటిక్స్ వేదికగా భారత్

**2028 వరల్డ్ ఇండోర్ ఛాంపియన్‌షిప్‌కు భువనేశ్వర్ ఆతిథ్యం!**

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

అంతర్జాతీయ అథ్లెటిక్స్ రంగంలో భారత ప్రతిష్ఠ మరోసారి ప్రపంచవ్యాప్తమైంది. ప్రతిష్ఠాత్మకమైన 'ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్2028' ఆతిథ్య హక్కులను భారత్ దక్కించుకుంది. పోలెండ్‌లో జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ పాలకవర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రపంచ అథ్లెటిక్స్ ఉపాధ్యక్షుడు ఆదిల్ సుమరివాలా అధికారికంగా ప్రకటించారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్ ఈ మెగా ఈవెంట్‌కు వేదిక కానుంది. భారత అథ్లెటిక్స్ సమాఖ్య (AFSI) అధ్యక్షుడు బహదూర్ సింగ్ సాగూ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఒలింపిక్స్, ప్రపంచ వేదికలపై స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా సాధించిన అద్భుత విజయాలే భారత ట్రాక్ అండ్ ఫీల్డ్ క్రీడలపై ప్రపంచం దృష్టి సారించేలా చేశాయని కొనియాడారు. అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతున్న భారత అథ్లెటిక్స్ పరపతికి ఈ ఆతిథ్య హక్కులే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ పోటీల కోసం భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియం సముదాయంలో ఉన్న అత్యాధునిక ఇండోర్ కేంద్రాన్ని ఇప్పటికే ప్రపంచ అథ్లెటిక్స్ బృందం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రపంచ టోర్నీలో మొత్తం 26 విభాగాల్లో (పురుషులు 13, మహిళలు 13) పోటీలు నిర్వహించనున్నారు. 60 మీటర్ల నుంచి 3000 మీటర్ల వరకు పరుగు పందాలు నిర్వహించనున్నారు. దీనితో పాటు 60 మీటర్ల హర్డిల్స్, 4x400 మీటర్ల రిలే, హైజంప్, పోల్ వాల్ట్, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్, హెప్టాథ్లాన్ (పురుషులకు), పెంటాథ్లాన్ (మహిళలకు) నిర్వహించనున్నారు. భారతదేశంలో తొలిసారిగా జరుగుతున్న ఈ ప్రపంచ స్థాయి ఇండోర్ అథ్లెటిక్స్ టోర్నీ, దేశంలోని యువ అథ్లెట్లకు గొప్ప స్ఫూర్తినిస్తుందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.



## గిన్నిస్ రికార్డుల్లో విశాఖ యువ కెరటం

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భూపతిరాజు అన్మిష్ వర్మ పర్వతారోహణలో సరికొత్త చరిత్ర సృష్టించారు. ప్రపంచంలోని ఏడు ఖండాల్లో ఉన్న అత్యంత ఎత్తైన ఏడు అగ్నిపర్వత శిఖరాలను అత్యంత వేగంగా అధిరోహించిన వ్యక్తిగా ఆయన గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లోకెక్కారు. ఈ అసాధారణ సాహసయాత్రను అన్మిష్ వర్మ కేవలం 92 రోజుల 4 గంటల 45 నిమిషాల వ్యవధిలోనే పూర్తి చేయడం విశేషం. ఈ అరుదైన మైలురాయిని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ తన అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా వెల్లడించింది.అన్మిష్ వర్మ తన రికార్డు స్థాయి ప్రస్థానాన్ని 2024 అక్టోబర్ 23న రష్యాలోని 'మౌంట్ ఎల్బ్రస్' అధిరోహణతో ప్రారంభించారు. అక్కడి నుండి తన ప్రయాణాన్ని కొనసాగిస్తూ టాంజానియాలోని మౌంట్ కిలిమంజారో (ఆఫ్రికా), చిలీ/అర్జెంటీనా సరిహద్దుల్లోని ఓజోస్ డెల్ సలాడో (దక్షిణ అమెరికా) శిఖరాలను అధిరోహించారు. ఆ తర్వాత ఉత్తర అమెరికాలోని మెక్సికోలో ఉన్న పికో డి ఒరిజాబా, ఓషియానియా ఖండంలోని పాపువా న్యూ గినియాకు చెందిన మౌంట్ గిలువే శిఖరాలను జయించారు. ఆసియా ఖండం తరపున ఇరాన్‌లోని మౌంట్ దమవంద్ శిఖరాన్ని చేరుకున్న ఆయన, చివరగా 2025 జనవరి 23న అంటార్కిటికాలోని 'మౌంట్ సిడ్లీ' శిఖరాన్ని అధిరోహించడంతో ఈ చారిత్రాత్మక యాత్ర విజయవంతంగా ముగిసింది.అన్మిష్ వర్మ నెలకొల్పిన ఈ ప్రపంచ రికార్డును గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ 2026 ఫిబ్రవరి 6న ధృవీకరించగా, ఫిబ్రవరి 27న అధికారికంగా ప్రకటించింది. తాజాగా ఎక్స్ వేదికగా ఈ సాహసానికి సంబంధించిన వీడియోను కూడా షేర్ చేసింది. ఒక భారతీయుడు, అందులోనూ విశాఖ వాసి అంతర్జాతీయ స్థాయిలో ఈ రికార్డు సాధించడం పట్ల పర్వతారోహక సంఘాలు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 92 రోజుల్లోనే ఏడు ఖండాల్లోని అగ్నిపర్వతాలను అధిరోహించడమనేది పర్వతారోహణ చరిత్రలో ఒక అరుదైన ఘట్టంగా నిలిచిపోనుంది.



## గోల్డ్ లవర్స్ కి గుడ్ న్యూస్

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

పసిడి ప్రియులకు, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లోని కొనుగోలుదారులకు ఇది నిజంగానే తియ్యని వార్త. ఉగాది పండుగ ముంగిట బంగారం ధరలు చుక్కలను తాకుతాయని భావించిన వారందరికీ షాకిస్తూ, మార్కెట్ ఒక్కసారిగా కుప్పకూలింది. గత కొద్ది రోజులుగా రికార్డు స్థాయిల్లో కొనసాగుతున్న పుత్తడి ధరలు, శుక్రవారం భారీగా దిగివచ్చాయి. కేవలం ఒక్క రోజు వ్యవధిలోనే ధరలు భారీగా తగ్గడం విశేషం. నిన్నటి వరకు పెరుగుతూ వచ్చిన ధరలు ఒక్కసారిగా 'యూటర్న్' తీసుకోవడంతో జ్యువెలరీ షాపులు కస్టమర్లతో కిటకిటలాడుతున్నాయి. ఉగాది పండుగ నాడు బంగారం కొనడం శుభప్రదమని భావించే వారికి ఈ ధరల తగ్గుదల గొప్ప అవకాశంగా మారింది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములు రూ.1,50,270, 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములు రూ.1,37,740 గా ఉంది. దేశంలోని ఇతర మెట్రో నగరాల్లోనూ ఇదే తరహా పతనం కనిపిస్తోంది.

**చెన్నై:** తమిళనాడులో ధరలు ఎప్పుడూ కాస్త ఎక్కువగా ఉంటాయి. ఇక్కడ 24 క్యారెట్ల ధర రూ. 1,51,630 కాగా, 22 క్యారెట్ల ధర రూ. 1,38,990గా ఉంది.

**ఢిల్లీ:** దేశ రాజధానిలో 24 క్యారెట్ల ధర రూ.1,50,420 వద్ద కొనసాగుతోంది. ముంబై, బెంగళూరు నగరాల్లోనూ హైదరాబాద్ తరహాలోనే 24 క్యారెట్ల ధర రూ. 1,50,270 వద్ద స్థిరంగా ఉంది. బంగారంతో పోటీ పడుతూ వెండి కూడా భారీగా దిగివచ్చింది. దేశీయ బులియన్ మార్కెట్లో నేడు వెండి ధర కిలోకు రూ. 2,64,900 వద్దకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న అనిశ్చితి, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై తీసుకున్న నిర్ణయాలు ప్రపంచ వ్యాప్తంగా బులియన్ మార్కెట్ పై ప్రభావం చూపాయి. గత వారం రోజులుగా పశ్చిమాసియా యుద్ధ మేఘాల వల్ల ధరలు పెరుగుతాయని అంచనా వేసినప్పటికీ, ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గు చూపడం డాలర్ విలువలో మార్పుల వల్ల ధరలు అకస్మాత్తుగా పడిపోయాయి. రాబోయే పెళ్లిళ్ల సీజన్ మరియు ఉగాది నేపథ్యంలో ఈ ధరల తగ్గింపును సద్వినియోగం చేసుకోవడం మంచిదని మార్కెట్ విశ్లేషకులు సూచిస్తున్నారు. అయితే, బంగారం ధరలు ఎప్పుడు ఎలా మారుతాయో చెప్పలేము కాబట్టి, కొనుగోలు చేసే ముందు స్థానిక నగరాల్లోని ప్రత్యక్ష ధరలను మరోసారి సరిచూసుకోవాలని నిపుణులు కోరుతున్నారు.

సంక్షిప్త మనసర్కార్

Follow: manasarkar

శనివారం | హైదరాబాద్
21.03.2026
www.manasarkar.com



## మరో గొప్ప మెగా ప్రయత్నం!

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**


వెండితెర రారాజుగా అభిమానులు, ప్రేక్షకులని అలరించే మెగాస్టార్ చిరంజీవి, సినిమాలతో పాటు సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటూ, తెరపై మాత్రమే కాదు నిజ జీవితంలో కూడా రియల్ హీరోగా ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఆయన స్థాపించిన చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్, బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ వంటి సంస్థలు దశాబ్దాలుగా ప్రజా సంక్షేమంలో కీలక పాత్ర పోషిస్తూ, అనేక సంక్షోభ సమయాల్లో ప్రజలకు ప్రాణదాతలుగా నిలిచాయి. ఏదైనా ప్రకృతి విపత్తు, అనుకోని అత్యవసర పరిస్థితి అయినా, సహాయం అందించడానికి ముందుకు వచ్చే వారిలో మెగాస్టార్ ఎప్పుడూ ముందుంటారు. ఉగాది ప్రత్యేక కార్యక్రమంలో చిరంజీవి ఒక ముఖ్యమైన కొత్త కార్యక్రమం గురించి చెప్పారు. "రక్తం ప్రాముఖ్యతను, రక్త కొరత కారణంగా ఎన్ని ప్రాణాలు పోతున్నాయో నేను అర్థం చేసుకున్నప్పుడు, నా అభిమానులందరినీ రక్తదానంలో పాల్గొనేలా స్ఫూర్తిని ఇవ్వాల్సిన అవసరం ఉందని నాకు అనిపించింది. ఆ ఆలోచన నాకు 25 ఏళ్ల క్రితమే కలిగింది. నేను కేవలం అక్కడితోనే ఆగిపోదలచుకోలేదు. భవిష్యత్తులో పేద ప్రజలకు విద్యను ఎలా అందించాలనే దానిపై ఇప్పుడు ఆలోచిస్తున్నాను. నన్ను స్ఫూర్తిగా తీసుకుని నటుడు సూర్య 'అగరం ఫౌండేషన్'ను ప్రారంభించారు. ఇప్పుడు, నేను ఆయన నుంచి స్ఫూర్తి పొంది ఉచిత విద్యా బోధనను ప్రారంభించాలనుకుంటున్నాను. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, ఎక్కడైతే అవసరం ఉంటుందో, అక్కడ ఉచిత విద్యను అందించే దిశగా కృషి చేస్తాను. ఈ కొత్త విద్యా కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో ప్రకటిస్తానని ఆయన చెప్పారు. సమాజానికి ఉపయోగపడే మరో గొప్ప ప్రయత్నానికి శ్రీకారం చుట్టబోతున్నారు మెగాస్టార్ చిరంజీవి.



## అభిరుచికి తగ్గట్టుగానే!

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అందం, అభినయంతో మరోసారి తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంది శ్రీలీల. పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన 'ఉస్తాద్ భగత్‌సింగ్'లో లీల పాత్రలో సందడి చేసింది. ఈ చిత్రం 19న విడుదలైన సంగతి తెలిసిందే. "కెరీర్‌లో ఇప్పటిదాకా నేను చాలా పాటలకు డ్యాన్స్ చేశా. వేసుకున్న డ్రెస్ అయినా, చేస్తున్న స్టెప్ అయినా నాకెంత సౌకర్యంగా ఉందనేది చూస్తాను. నేనైనా, ఇంకెవరైనా వాళ్లకు సౌకర్యంగా ఉంటేనే చేస్తారు. ఇప్పటిదాకా నేను చేసిన పాటల్ని అందరూ ఆస్వాదించారు. 'పుష్ప 2'లో చేసిన కిస్సిక్ పాట తర్వాత, అలా ప్రత్యేక గీతాల్లో నటించే అవకాశాలు చాలానే వచ్చాయి. కానీ నేనే చేయలేదు. 'పుష్ప 2' జాతీయ, అంతర్జాతీయ ప్రేక్షకుల్ని ఆకర్షించిన సినిమా కావడంతో అందులో నటించా. అలాంటి మంచి ప్రాజెక్టులు, పాత్రలు వస్తే చేయడానికి సిద్ధం" అంటోంది శ్రీలీల ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో. తెలుగమ్మాయిలు కథానాయికలుగా రాణించడం అరుదు. అలాంటి పరిస్థితుల్లో ఓ అచ్చ తెలుగమ్మాయి స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. తన అందం.. ప్రతిభతో ప్రేక్షకుల్ని కట్టిపడేస్తూ... వరుస అవకాశాల్ని సొంతం చేసుకొంటోంది. ఈమధ్య ఎక్కువగా హిందీ పరిశ్రమలో కనిపిస్తున్నారు. అటువైపు ఎక్కువగా దృష్టి పెట్టనున్నారా? అని శ్రీలీలని కదిలిస్తే..'తెలుగు చిత్ర పరిశ్రమ నా ఇల్లు. ఎక్కడికి వెళ్లినా నేను తెలుగమ్మాయినే, నా ప్రాతినిధ్యం తెలుగుకే. ఇతర భాషల్లో అవకాశాలు వచ్చినా, అన్ని భాషల్నీ బ్యాలెన్స్ చేస్తాను తప్ప, ఎక్కడికో వెళ్లిపోవడం అంటూ ఉండదు. ఓ తెలుగమ్మాయిగా అందరూ గర్వపడేలా చేయాలన్నదే నా అభిమతం. అందుకే ఒకసారి వాణిజ్య ప్రధానమైన సినిమాలో నటించినా, మరోసారి బలమైన కథని ఎంపిక చేసుకుని బాధ్యతాయుతమైన పాత్రలు చేయాలని ఉంది. కెరీర్ ఆరంభంలో నేను ఇలాంటి పాత్రలు, ఇలాంటి సన్నివేశాలే చేస్తానని చెప్పే అవకాశం ఎవ్వరికీ ఉండదు. కానీ దేవుడి దయ వల్ల ఇప్పుడు నేను ఏం అనుకుంటున్నానో దర్శకులకు చెప్పగలుగుతున్నా. నా అభిప్రాయం, అభిరుచికి తగ్గట్టుగా నిర్ణయాలు తీసుకుంటున్నా. ఒకవైపు వాణిజ్య ప్రధానమైన సినిమాలు చేస్తూనే, మరోవైపు కథాబలం ఉన్న సినిమాల్ని, సందేశం ఉన్న కథలు, పాత్రల్ని చేస్తా'' అంటూ చెప్పుకొచ్చింది.



## ఇంటెన్స్ లుక్

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

సూర్య తన మాగ్నమోపస్ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'కరుప్పు' కోసం దర్శకుడు ఆర్జే బాలాజీతో చేతులు కలిపారు. ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించడం ద్వారా పేరును తెచ్చుకున్న నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. తమిళం, తెలుగు, హిందీ పరిశ్రమలలో పాపులర్ కంటెంట్‌ను అందించిన డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని స్కేల్, కంటెంట్ రెండింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రతిష్టాత్మకగా తెరకెక్కిస్తోంది. సూర్య పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపించిన 'కరుప్పు' ఫస్ట్ లుక్ టీజర్ సంచలనం క్రియేట్ చేసింది. తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. 2026 మే 14న ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది. రిలీజ్ డేట్ పోస్టర్ సూర్య ఇంటెన్స్ లుక్ అదిరిపోయింది. ఈ చిత్రంలో త్రిష హీరోయిన్ గా నటిస్తోంది. ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ మాయ రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రానికి జికె విష్ణు సినిమాటోగ్రఫీ.



## ప్రేమలో పడిపోయా

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

సినీనటిగా, కథానాయికగా ఎదుగుతానని చిన్నప్పుడు అనుకున్నారా? అని ఇటీవల కలిసిన కథానాయిక సంయుక్త మీనన్ ని అడిగితే .. ''లేదు. ఎప్పుడూ అనుకోలేదు. నాకసలు అలాంటి ఆలోచనే ఉండేది కాదు. ఇదంతా విధి ఫలితమే! నేను కేరళలోని ఒక అందమైన గ్రామంలో పుట్టాను. ఆ గ్రామం కేరళ, తమిళనాడు సరిహద్దులో ఉంది. అంత మారుమూల గ్రామం నుంచి సినీ రంగంలోకి ప్రవేశించే మార్గమే లేనప్పుడు, దాని గురించి ఆలోచించే అవకాశం కూడా ఉండదు కదా? కాబట్టి బాగా చదువుకొని, డాక్టరు కావాలని కోరుకునేదాన్ని. ప్రపంచమంతా చుట్టి రావాలని అనుకునేదాన్ని. బడిలో చదువుకునే రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొనేదాన్ని. పుస్తకాలు ఎక్కువగా చదివేదాన్ని. చిన్మయ స్కూల్‌లో చదివే రోజుల్లో వేదాలతో పరిచయం ఏర్పడింది. నేను పెద్దయ్యాక నటిని అవుతానని నా కుటుంబం, స్నేహితులు, బంధువులు ఎవరూ ఊహించలేదు. యాదృచ్ఛికంగా జరిగింది. 'వనిత' అనే మ్యాగజైన్‌కు ఫొటోగ్రాఫర్‌గా వ్యవహరించే ఒక వ్యక్తి... ఓనమ్ పండుగ కోసం నన్ను ఫొటోషూట్ చేస్తానని అడిగారు. ఆ ఫొటోలు పబ్లిష్ అయిన తర్వాత, నాకు సినిమా అవకాశాలు రావడం మొదలుపెట్టాయి. అప్పటివరకూ నాకు సినీ వాతావరణం గురించి ఏమాత్రం తెలీదు. షూటింగ్‌లు ఎలా జరుగుతాయో, లొకేషన్లు ఎలా ఉంటాయో కూడా తెలీదు. అయితే రెండో సినిమా తరువాత... ఈ రంగంతో అలా ప్రేమలో పడిపోయాను. అనంతరం గొప్ప దర్శకుల దర్శకత్వంలో రూపొందిన అంతర్జాతీయ సినిమాలు చూశాను. గొప్ప నటుల ప్రతిభను అర్థం చేసుకుకోవడానికి, నటిగా నన్ను నేను ఆవిష్కరించుకోవడానికి ప్రయత్నించాను. అయితే నాలోని నటిని వెలికి తీయడానికి తగిన దర్శకుడు, తగిన కథ, తగిన సహనటులు అవసరమనే విషయాన్ని కూడా గ్రహించాను. అలా అంశాలన్నీ అనుకూలించినప్పుడు, కచ్చితంగా నటనా ప్రతిభను చాటుకోవచ్చని నేను నమ్ముతాను'' అంటూ చెప్పుకొచ్చింది.




## గుమ్మడి నర్సయ్య ఫియర్స్ లుక్

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**


ప్రవల్లిక ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్ మీద ఎన్. సురేష్ రెడ్డి (ఎన్ఎస్ఆర్) నిర్మాతగా పరమేశ్వర్ హివ్రాలే తెరకెక్కిస్తున్న చిత్రం 'గుమ్మడి నర్సయ్య'. రాజకీయాల్లో, ప్రజా సేవలో తనకంటూ ఓ గుర్తింపుని తెచ్చుకున్న గుమ్మడి నర్సయ్య బయోపిక్‌గా రాబోతోన్న ఈ సినిమాలో గుమ్మడి నర్సయ్యగా కరుణాడ చక్రవర్తి శివ రాజ్ కుమార్ నటిస్తున్నారు. ఇప్పటికే వదిలిన గ్లింప్స్ దక్షిణాది చిత్ర పరిశ్రమలో భారీ అంచనాల్ని నెలకొల్పింది. ఇక ఇప్పుడు ఓ అద్భుతమైన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. గుమ్మడి నర్సయ్యగా శివ రాజ్ కుమార్ కనిపిస్తున్న తీరు, భుజంపై ఆ కండువా? పిడికిలి బిగించిన విధానం, ఆయన లుక్స్ ఇలా అన్నీ కూడా ఎంతో ఇంటెన్స్‌గా కనిపిస్తున్నాయి. గుమ్మడి నర్సయ్య పాత్రకు శివన్న ప్రాణం పోస్తున్నట్టుగా అనిపిస్తోంది. ఉగాది సందర్భంగా రిలీజ్ చేసిన ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ తెలుగు ప్రేక్షకుల్నే కాకుండా భారతీయ సినీ ప్రేమికులందరినీ ఆకట్టుకుంటోంది. ఈ మూవీకి సిద్దగాని సాయి కిరణ్ గౌడ్, చింతకింది రూప కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. ఈ సినిమాకి సతీష్ ముత్యాల సినిమాటోగ్రఫర్‌గా, సురేష్ బొబ్బిలి సంగీత దర్శకుడిగా, సత్య గిడుటూరి ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, కన్నడ, తమిళ, హిందీ, మలయాళీ భాషల్లో భారీ ఎత్తున విడుదల చేయనున్నారు.



## మరపురాని క్షణం... స్పైడర్ మ్యాన్

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ప్రపంచవ్యాప్తంగా అశేష ప్రేక్షకాదరణ పొందిన స్పైడర్ మ్యాన్ సిరీస్‌లో సరికొత్త చిత్రం 'స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే' ట్రైలర్ విడుదలైంది. మొట్టమొదటి గ్లోబల్ ఫ్యాన్‌డ్రివెన్ ట్రైలర్ టీజ్ తర్వాత, న్యూయార్క్ నగరంలో ఐకానిక్ ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ పై నుండి టామ్ హాలండ్ పూర్తి ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు ఇదొక మరపురాని క్షణంగా నిలిచిపోయింది. 'స్పైడర్‌మ్యాన్: నో వే హోమ్' సాధించిన రికార్డ్‌బ్రేకింగ్ గ్లోబల్ సక్సెస్ తర్వాత, పీటర్ పార్కర్, స్పైడర్ మ్యాన్‌ల జీవితాల్లో 'స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే' ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించనుంది. 'నో వే హోమ్' సంఘటనలు జరిగి నాలుగు సంవత్సరాలు గడిచాయి. పీటర్ ఇప్పుడు తనను ప్రేమించేవారి జీవితాలు, జ్ఞాపకాల నుండి తన అస్తిత్వాన్ని పూర్తిగా చెరిపేసుకుని ఒంటరిగా జీవిస్తున్నాడు. తన పేరును ఏమాత్రం గుర్తుపట్టలేని న్యూయార్క్ నగరంలో నేరాలతో పోరాడుతూ, సిటీని రక్షించడానికి ఒక ఫుల్‌టైమ్ స్పైడర్ మ్యాన్‌గా పూర్తిగా అంకితమయ్యాడు. అయితే అతనిపై బాధ్యతలు, ఒత్తిడి పెరిగేకొద్దీ.. ఊహించని శారీరక మార్పులు అతని మనుగడకే ముప్పుగా పరిణమిస్తాయి. అదే సమయంలో నగరంలో జరుగుతున్న వింతైన నేరాల పరంపర అతనెన్నడూ ఎదుర్కోనంతటి అత్యంత శక్తివంతమైన విలన్ ముప్పుకు దారితీస్తుంది. డెస్టిన్ డానియల్ క్రెటన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో స్పైడర్‌మ్యాన్‌గా టామ్ హాలండ్ తిరిగి నటిస్తుండగా, జెండయా, జాకబ్ బటలాన్, సాడీ సింక్, జోన్ బెర్న్తాల్, మార్క్ రుఫలో, మైఖేల్ మాండో మరియు ట్రామెల్ టిల్మాన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సోనీ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్, జూలై 31న ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో అన్ని ప్రీమియం ఫార్మాట్లలో థియేటర్లలో విడుదల కానుంది.



## బాక్సాఫీస్ విస్ఫోటనం

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన స్పై యాక్షన్ సినిమా 'ధురందర్ 2: ది రివెంజ్'. ఉగాది పండగ సందర్భంగా మార్చి 19న భారీ అంచనాల మధ్య విడుదలైంది. మొదటి రోజే ఈ చిత్రానికి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. దాదాపు 3 గంటల 30 నిమిషాలు ఉన్న ఈ సినిమాను దర్శకుడు ఆదిత్య ధర్ ఎక్కడా బోర్ కొట్టకుండా తెరకెక్కించాడని అంటున్నారు ఆడియన్స్. గతేడాది విడుదలైన ధురంధర్ మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా రూ. 1300 కోట్లకు పైగా వసూలు చేసింది. ఈ క్రమంలోనే ధురంధర్ 2 పై మరింత హైప్ క్రియేట్ అయ్యింది. రెండవ భాగం నిజ సంఘటనల ఆధారంగా ఆదిత్య ధర్ దర్శకత్వంలో రూపొందింది. పెద్ద నోట్ల రద్దు, ఉరి దాడి వంటి కీలక సంఘటనలను చూపించే ప్రయత్నం చేశారు డైరెక్టర్. నివేదికల ప్రకారం ధురంధర్ 2 సినిమా విడుదలకు ముందే రూ.30 కోట్లకు పైగా వసూలు చేసినట్లు టాక్. మొదటి రోజు ఈ సినిమా థియేటర్లలో రూ. 103 కోట్ల వరకు వసూలు చేసింది. ఇది కేవలం భారతదేశవ్యాప్త వసూళ్లు మాత్రమే. ఈ చిత్రాన్ని మొదటి రోజు ప్రత్యేక ప్రదర్శనల ద్వారా కూడా విడుదల చేశారు. దీని ద్వారా రూ. 43 కోట్లు వసూలు కాగా, నివేదిక ప్రకారం మొదటి రోజు మొత్తం వసూళ్లు సుమారు రూ. 172.63 కోట్లుగా ఉన్నాయి. అయితే ఈ కలెక్షన్స్ గురించి చిత్రయూనిట్ అధికారికంగా ప్రకటించలేదు. ధురందర్ 2, సన్నీ డియోల్ తాజా చిత్రం బోర్డర్ 2, షారుఖ్ ఖాన్ రెండు భారీ బ్లాక్‌బస్టర్‌లైన జవాన్ , పఠాన్‌ల రికార్డులను బద్దలు కొట్టింది. బోర్డర్ 2 మొదటి రోజున 6,078 షోలలో 37% ఆక్యుపెన్సీ రేటుతో రూ. 30 కోట్లు వసూలు చేసింది. ఇది ధురందర్ 2: ది రివెంజ్ మొదటి రోజు వసూళ్ల కంటే చాలా తక్కువ. షారుఖ్ ఖాన్ 'జవాన్' విషయానికి వస్తే ప్రారంభ వసూళ్లు రూ. 75.40 కోట్లు కాగా, 'పఠాన్' భారతదేశంలో రూ. 5557 కోట్లు సంపాదించింది. రణ్‌వీర్ కేవలం షారుఖ్, సన్నీ డియోల్‌లను అధిగమించడమే కాకుండా, 'స్త్రీ 2' (రూ. 54 కోట్లు), 'యానిమల్' (రూ. 64 కోట్లు) వంటి ఇతర హిందీ చిత్రాల రికార్డులను కూడా బద్దలు కొట్టాడు .

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027 Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**